అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదివారం 9-7-2023



సంపుటి : 9 | సంచిక : 189 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 8.00



రాష్ట్రంలో అవినీతి కుటుంబ పాలన

అది ఢిల్లీ వరకు పాకింది

రూ.6,100 కోట్ల పనులకు వర్చువల్‌లో శంకుస్థాపన

- దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకం
- వరంగల్ సభలో ప్రధాని మోడీ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే సీఎం కేసీఆర్ పని అని, కేసీఆర్ కుటుంబం అవినీతి ఢిల్లీ వరకు పాకిందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. శనివారం హన్మకొండ జిల్లాలో ప్రధాని పర్యటించారు. ఈ సందర్భంగా రూ.6,100 కోట్లతో రైల్వే వ్యాగన్ పరిశ్రమ, జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానం నుంచి వర్చువల్ పద్ధతితో ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత అధికారుల సమావేశంలో మాట్లాడిన అనంతరం మోడీ విజయసంకల్ప సభలో ప్రసంగించారు. సభాస్థలిలో వున్న ప్రజలను చూస్తుంటే రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని తీసుకురావడానికి నిర్ణయించు కున్నట్టు కనిపిస్తుందన్నారు. అభివృద్ధి కోసం పలు రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయని, కానీ అవినీతి కోసం తెలంగాణ, ఢిల్లీ ప్రభుత్వాలు కలిసి పనిచేయడం తొలిసారిగా చూస్తున్నానన్నారు. మోడీ ప్రసంగంలో ఎక్కడా నేరుగా సీఎం కేసీఆర్ పేరును ప్రస్తావించకుండా విమర్శలు చేయటం గమనార్హం. కేసీఆర్ కుటుంబ అవినీతిపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయని చెప్పారు. కేసీఆర్‌కు కేవలం నాలుగు పనులే తెలుసన్నారు. ఉద యం నుంచి సాయ ంత్రం వరకు మోడీని తిట్టడం, కుటుంబ పార్టీని పెంచి పోషించడం, తెలంగాణ ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడం, తె ల ం గా ణ న ు అవినీతిలో కూరుకు పోయేలా చేయడమని విమర్శించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ట్రైలర్ మాత్రమేనని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌ను అడ్రస్ లేకుండా చేసి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. దేశంలోనే అత్యంత అవినీతి ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క పని కూడా అవినీతి లేకుండా జరగడం లేదన్నారు. 3 వేల అధ్యాపకుల ...6లో

మోడీ..ఓ విఫల ప్రధాని...

అత్యధిక నిరుద్యోగం సృష్టించిన ఘనత ఆయనదే



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా
- ఉడత ఊపులకు భయపడబోమంటూ వ్యాఖ్యలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నరేంద్ర మోడీ.. దేశ చరిత్రలో అత్యంత విఫల ప్రధానిగా మిగిలిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. తొమ్మిదేండ్లలో అత్యధిక నిరుద్యోగం సృష్టించిన ఘనత ఆయనకే దక్కుతుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రధాని మోడీ వరంగల్ సభలో చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని యువత కోసం చేసిన ఒక్క మంచిపనినైనా చెప్పాలంటూ ...6లో

రాష్ట్రాన్ని మోసగించిన ప్రధాని

విభజన హామీల ప్రస్తావనేది?

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర విభజన హామీల ప్రస్తావన చేయకుండా తెలంగాణ ప్రజలను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మరోసారి మోసగించారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని అటకెక్కించి, తొమ్మిదేండ్ల తర్వాత వ్యాగన్ వర్క్‌షాపునకు శంఖుస్థాపన చేయడమంటే..ప్రజల్ని మోసగించడమేననీ విమర్శించారు. 'మోడీ పర్యటన సందర్భంగా విభజన చట్టం హామీల గురించి ప్రస్తావిస్తారని రాష్ట్ర ప్రజలు ఆశించారు. వరంగల్‌కు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ...6లో

మోడీ సభకు ముగ్గురు నేతల డుమ్మా

కనిపించని వివేక్, విజయశాంతి, చంద్రశేఖర్





- ఎడమొఖం, పెడమొఖంగానే ఈటల, బండి
- స్టేజీపైకి పిలవకపోవడంతో అలిగిన పలువురు నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీలో కలహాల కాపురం అట్లాగే కొనసాగుతున్నది. ప్రధాని పర్యటన కూడా నేతలను ఒక్కతాటిపైకి తేలేకపోయింది. సభావేదికపై నేతలు ఎడమొహం, పెడమొహంగా ఉండటం స్పష్టంగా కనిపించింది. దానికి మించిన బిగ్ ట్విస్ట్ ఏమిటంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనకు ముగ్గురు కీలక నేతలు డుమ్మా కొట్టారు. అందులో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ ప్రధాని సభలో ఎక్కడా కనిపించలేదు. వీరు త్వరలో పార్టీ మారబోతున్నారని కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం విదితమే. బండి సంజయ్‌ని రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించడాన్ని ఆమె బాహాటంగానే ఖండించారు. బండిని తప్పించడం, ఈటలకు ప్రాధాన్యత ఇవ్వటంతో వివేక్ కూడా కొద్దిరోజులుగా అలకపాన్పు ఎక్కారు. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మాజీ ...6లో

పాత చింతకాయ పచ్చడిలా....

టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వరంగల్ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీ పాత చింతకాయ పచ్చడిలాగా చెప్పేవే చెప్పారంటూ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ ...5లో



మోడీ హయాంలో యథేచ్ఛగా హింస

ఇది మహిళా వ్యతిరేక ప్రభుత్వం..

- ఆహార భద్రతను తుంగలో తొక్కిన కేంద్రం
- పౌష్టికాహార లేమితో రోగాల పాలవుతున్న మహిళలు
- మణిపూర్ చిచ్చుకు బీజేపీయే కారణం..
- ఐద్వా జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియం ధావలే, పీకే శ్రీమతి
- ఆగస్టులో జాతీయ స్థాయి సింపోజియం
- అదే నెల 5న చలో ఢిల్లీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియం ధావలే, పీకే శ్రీమతి విమర్శించారు. ఆ సంఘం జాతీయ కమిటీ సమావేశాలు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండో రోజైన శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన ...5లో

బీబీసీ, వికీమీడియాలకు సమన్లు

పరువు నష్టం కేసులో జారీ చేసిన ఢిల్లీ కోర్టు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2002 గుజరాత్ అల్లర్లలో ప్రధాని మోడీ పాత్ర ఉన్నదని ఆరోపించిన డాక్యుమెంటరీకి సంబంధించిన పరువు నష్టం కేసులో ఢిల్లీ కోర్టు.. బీబీసీ, వికీమీడియా, డిజిటల్ లైబ్రరీ ఇంటర్నెట్ ఆర్కైవ్‌లకు తాజా సమన్లు జారీ చేసింది. బీజేపీ నాయకుడు బినయ్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పరువు నష్టం ఫిర్యాదుపై న్యాయస్థానం పై విధంగా స్పందించింది. డాక్యుమెంటరీ భారత్‌లో అధికారికంగా విడుదల చేయనప్పటికీ.. వికీపీడియా పేజీ దానిని చూడటానికి లింక్‌లను అందిస్తున్నదనీ, కంటెంట్ ఇప్పటికీ ఇంటర్నెట్ ఆర్కైవ్‌లో ...5లో

మణిపూర్‌లో చల్లారని హింస

తాజా అల్లర్లలో నలుగురు మృతి

- మృతుల్లో ఒక పోలీసు
- రాష్ట్రంలో ఇప్పటికీ అదుపులోకి రాని శాంతిభద్రతలు

వివరాలు 5లో..

నేడు సికింద్రాబాద్ ఉజ్జయినీ

మహంకాళి బోనాలు



- రంగులతో ఆలయం ముస్తాబు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. ఆషాఢమాస జాతరలో భాగం గా ఆదివారం బోనాలు, సోమ వారం రంగం కార్యక్రమం జరుగనుంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ, ఎలక్ట్రిసిటీ, జలమండలి, ఆర్ అండ్‌బీ తదితర శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు ...5లో

బెంగాల్ పంచాయతీ హింసాత్మకం

11 మంది మృతి

- పలు చోట్ల బ్యాలెట్ బాక్సుల అపహరణ
- బ్యాలెట్ పత్రాలకు నిప్పు
- తృణమూల్, బీజేపీ పరస్పర ఆరోపణలు
- ఎస్ఈసీలో పారదర్శకత లోపించింది : సీపీఐ(ఎం) నేత మహమ్మద్ సలీం



కొల్‌కతా : పశ్చిమబెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా శనివారం హింసాకాండ చెలరేగింది. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు కాగా బీజేపీ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్‌కు చెందిన ఒక్కొక్కరున్నారు. ఆరు వందల కంపెనీల కేంద్ర దళాలను, 70 వేల మంది రాష్ట్ర పోలీసులను మోహరించినప్పటికీ పలు చోట్ల అధికార తృణమూల్, ప్రతిపక్ష బీజేపీ కార్యకర్తలు రెచ్చిపోయి పరస్పరం దాడులకు తెగబడారు. హింసాకాండ నేపథ్యంలో కొన్ని గ్రామాలలో పోలింగ్ నిలిపివేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడంలో కేంద్ర బలగాలు విఫలమయ్యాయని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. అయితే కేంద్ర దళాలను సరిగా వినియోగించుకోలేదని, తృణమూల్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని బీజేపీ నేత సువేంద్రు అధికారి ప్రత్యారోపణ చేశారు. రాష్ట్రంలోని 73,887 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 2.06 లక్షల మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. కూచ్‌బీహార్ ...5లో

నవతెలంగాణ

బిజినెస్



హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రుణాలు ప్రియం

• వడ్డీ రేట్ల పెంపు

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగంలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తమ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. ఆ బ్యాంక్ రుణాలపై వసూలు చేసే వడ్డీ రేట్లను పెంచింది. ఇటీవలే హెచ్‌డిఎఫ్‌సి ని విలీనం చేసుకున్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తాజా నిర్ణయంతో లక్షలాది మంది ఖాతాదారులపై ప్రభావం పడనుంది. బెంచ్‌మార్క్ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను (ఎంసిఎల్‌ఆర్) 15 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. పెంచిన వడ్డీ రేట్లు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చా యి. ఈ నిర్ణయంతో గృహ, వ్యక్తిగత, వాహన, రిటైల్ రుణ గ్రహీతలపై భారం పడనుంది. వారు చెల్లించే ఇఎంఐ పెరగనుంది. కొత్త వడ్డీ రేట్ల వివరాలు.. ఓవర్ నైట్ ఎంసిఎల్‌ఆర్ రేటు 15 బేసిస్ పాయింట్లు పెరిగింది. దీంతో ఈ రేటు 8.1 శాతం నుంచి 8.25 శాతానికి చేరింది. నెల రోజుల ఎంసిఎల్‌ఆర్ రేటు కూడా 10 బేసిస్ పాయింట్లు పెంచడంతో 8.2 శాతం నుంచి 8.3 శాతానికి చేర్చింది. మూడు నెలలపై వడ్డీరేటు 10 బేసిస్ పాయింట్లు పెరిగి 8.5 శాతం నుంచి 8.6 శాతంగా ప్రకటించింది. ఆరు నెలల ఎంసిఎల్‌ఆర్‌ను 5 బేసిస్ పాయింట్లు పెంచి 8.85 శాతం నుంచి 8.9 శాతానికి చేర్చింది. ఏడాది ఆపైన వ్యవధి రుణాలపై వడ్డీరేటును 9.05 శాతం వద్ద కొనసాగించాలని నిర్ణయించింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సిలు జులై 1వ తేది నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో రూ.18 లక్షల కోట్ల ఆస్తులతో ఒక దిగ్గజ సంస్థగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌గా ఏర్పాటు అయ్యింది. విలీనం అనంతరం 12 కోట్ల ఖాతాదారులు, 8,300 బ్యాంకు శాఖలు, 1.77 లక్షల మంది ఉద్యోగులతో కూడిన అతిపెద్ద బ్యాంకుగా ఆవిర్భవించింది.

దేశంలో తగ్గిన నివాస అమ్మకాలు

• ప్రథమార్థంలో 3% పెరిగిన వాణిజ్య లీజింగ్ స్థలాలు
• నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్



హైదరాబాద్: దేశ వ్యాప్తంగా నివాస గృహాల అమ్మకాలు తగ్గాయి. ప్రస్తుత ఏడాది జనవరి నుంచి జూన్‌తో ముగిసిన ప్రథమార్థం (హెచ్1) కాలంలో 1 శాతం తగ్గి 1,56,640 యూనిట్లకు పరిమితమయ్యాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన రిపోర్ట్‌లో వెల్లడించింది. గతేడాది ఇదే సమయంలో 1,58,705 యూనిట్లు రిజిస్టర్ అయ్యారు. ఇదే సమయంలో 25.3 మిలియన్ల చదరపు అడుగుల కార్యాలయాల స్థల లీజింగ్ రికార్డ్ కాగా.. గడిచిన హెచ్1లో 3 శాతం పెరిగి 26.1 మిలియన్ చదరపు అడుగులుగా నమోదయ్యింది. నివాస అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకున్నప్పటికీ.. గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో రెండో సారి గరిష్ట స్థాయి అమ్మకాలు జరిగాయి.

హైదరాబాద్‌లో తగ్గిన ఆఫీసు లీజింగ్

నైట్ ఫ్రాంక్ గణంకాల ప్రకారం.. గడిచిన హెచ్1లో హైదరాబాద్‌లో నివాస అమ్మకాలు 5 శాతం పెరిగి 15,355 యూనిట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే హెచ్1లో 14,693 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఇదే సయమంలో ఆఫీసు లీజింగ్ 3.2 మిలియన్ చదరపు అడుగులుగా ఉండగా.. గడిచిన హెచ్1లో 8 శాతం తగ్గి 2.9 మిలియన్ చదరపు అడుగులుగా చోటు చేసుకుంది. 2023 జనవరి నుంచి జూన్ కాలంలో ఢిల్లీ - ఎన్‌సిఆర్ పరిధిలో నివాస అమ్మకాలు 3 శాతం పెరిగి 30,114 యూనిట్లుగా. ఆఫీసు లీజింగ్‌లో 24 శాతం పెరిగి 5.1 మిలియన్ చదరపు అడుగులుగా నమోదయ్యింది. బెంగళూరులో నివాస అమ్మకాలు 2 శాతం తగ్గి 26,247 యూనిట్లుగా, పూణెలో 1 శాతం తగ్గి 21,670 యూనిట్లుగా, చెన్నయ్‌లో 3 శాతం పెరిగి 7,150 యూనిట్లుగా, కోల్‌కత్తాలో 3 శాతం పెరిగి 7,324 యూనిట్ల చొప్పున చోటు చేసుకున్నాయి.

బంగారం రూ.440 ప్రియం

న్యూఢిల్లీ : బంగారం ధరల్లో పెరుగుదల నమోదయ్యింది. గోల్డ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం.. శనివారం న్యూఢిల్లీ, హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లలో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.440 పెరిగి రూ.59,510గా నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ.400 పెరిగి రూ.54,550గా పలికింది. కిలో వెండిపై రూ.1,000 పెరిగి రూ.73,300గా ఉంది. ఇటీవల తగ్గుతూ వచ్చిన బంగారం ధర వారాంతంలో పెరగడం గమనార్హం. అంతర్జాతీయంగా అమెరికాలో ఒక్క ఔన్స్ పసిడిపై 0.71 శాతం పెరిగి 1,924 డాలర్లుగా నమోదయ్యింది.

వ్యాట్సాప్, ఫేస్‌బుక్‌లపై నియంత్రణ..!

• ట్రాయ్ సంప్రదింపులు



న్యూఢిల్లీ : సోషల్ మీడియా యాప్స్‌ను కేంద్రం తన గుప్పిట్లోకి తీసుకునే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్, సిగ్నల్ తదితర సోషల్ మీడియా యాప్ ప్రొవైడర్లను నియంత్రించడంపై టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) సంప్రదింపులు ప్రారంభించింది. ఆందోళనలు, ఉద్రిక్త పరిస్థితుల్లో ఆ యాప్స్‌పై కొంత సమయం లేదా తాత్కాలిక నిషేధం విధించాల్సిన అవసరం ఉందా.. లేదా అనే విషయం మీద చర్చ మొదలు పెట్టింది. కమ్యునికేషన్ యాప్స్ నియంత్రణ, తాత్కాలిక నిషేధం వంటి 14 అంశాలపై ట్రాయ్ సంప్రదింపులను మొదలుపెట్టింది. ఇంటర్నెట్ కాలింగ్ విషయంలో టెలికాం ప్రొవైడర్లకు వర్తించే నియమాలే కమ్యూనికేషన్ యాప్స్‌నకూ వర్తింపజేయాలని టెల్కోలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. తమ లాగే లైసెన్స్ ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

సిసోడియా ఆస్తులు జప్తు

• 'మద్యం' కేసులో రూ.52 కోట్ల అటాచ్



న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆయన భార్య సీమ, ఇతరులకు చెందిన రూ.52.24 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. సిసోడియాకు, ఆయన భార్యకు చెందిన రెండు స్థిరాస్తులను, చరియట్ ప్రొడక్షన్ మీడియా ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ రాజేష్ జోషీ, గౌతమ్ మల్హోత్రాలకు చెందిన భూమి, ఫ్లాట్లను స్వాధీనం చేసుకున్నామని ఈడీ తెలిపింది. ఈ స్థిరాస్తుల విలువ రూ.7.29 కోట్లు. ఇక రూ.44.29 కోట్ల చరాస్తుల విషయానికి వస్తే సిసోడియా బ్యాంక్ డిపాజిట్లు (రూ.11.49 లక్షలు), బ్రిండ్కో సేల్స్ ప్రయివేట్ లిమిటెడ్ (రూ.16.45 కోట్లు), ఇతర ఆస్తులను అటాచ్ చేశారు. ఇప్పటి వరకూ ఈ కేసులో రూ.128.78 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. సిసోడియాకు సన్నిహితుడిగా భావిస్తున్న ఢిల్లీ వ్యాపారవేత్త దినేష్ అరోరాను అరెస్ట్ చేసిన మర్నాడే ఈ ఆస్తుల జప్తు జరిగింది. కాగా సిసోడియా ప్రతిష్టను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం మీడియాలో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ నేత అతిషి మర్లేనా ఆరోపించారు. సిసోడియా 18 సంవత్సరాల క్రితం ఒక ఫ్లాటు కొనుగోలు చేశారని, 2018లో మరొకటి కొన్నారని, ఎక్సైజ్ పాలసీని రూపొందించడానికి ముందే వీటి కొనుగోలు జరిగిందని ఆయన చెప్పారు.

మహారాష్ట్రతో తెలంగాణది 'రోటీ- బేటీ' బంధం

ఆ రాష్ట్రం మీదుగా దేశమంతా విస్తరిస్తాం:బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షులు కేసీఆర్

• గులాబీ పార్టీలోచేరిన

పలువురు మహారాష్ట్ర నేతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహారాష్ట్రతో తెలంగాణది 'రోటీ-బేటీ' బంధమని బీఆర్‌ఎస్ జాతీయ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు.. వెయ్యి కిలోమీటర్ల మేర సరి హద్దును పంచుకుంటున్న రెండు రాష్ట్రాల ప్రజల నడుమ మొదటి నుంచి సామాజిక బాంధవ్యం, సాంస్కృతిక సారూప్యత ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నా మని హామీ ఇచ్చారు. ఇంతటి అనుబంధమున్న మహారాష్ట్ర నుంచే దేశ వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌ను విస్తరిస్తామని తెలిపారు. కేవలం తొమ్మిదేండ్లలో అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందనీ, అదే స్ఫూర్తితో మహారాష్ట్రను ప్రగతిపథంలో నడిపించుకుందామని వ్యాఖ్యానించారు. ఆ రాష్ట్రంలో పార్టీల మధ్య జంప్ జిలానీలను ప్రజలు గమనిస్తున్నారంటూ అక్కడి రాజకీయ పార్టీలను ఆయన హెచ్చరించారు. భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ప్రజలను చైతన్యవంతులను చేయాలని యువతకు పిలుపునిచ్చారు. శని వారం షోలాపూర్, నాగపూర్ తదితర ప్రాంతాల నుంచి పలువురు నేతలు, ప్రముఖులు తెలంగాణ భవన్‌లో అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆయన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "దేశంలో అవసరానికి మించి నదీ జలాలు, సహజ సంపదలు ఉన్నాయి. 75 ఏండ్లు గడిచినా ఈ దేశాన్ని పాలించిన పాలకులు వాటిని వినియోగంలోకి తేలేకపోతున్నారు. ప్రపంచంలో మొన్నటి వరకు చైనా వెనుకబడి ఉంది. ప్రస్తుతం ఆ దేశం మనం అందుకోలేనంత అభివృద్ధి చెందింది. దేశాన్ని అభివృద్ధి చేసే ఆలోచనలను కేంద్ర పాలకులు సరైన రీతిలో చేయకపోవడమే అందుకు కారణం. సభ్య దేశాల ముంగిట అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశ పరువును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది..... "అని ఆయన తెలిపారు. అభివృద్ధి నిరోధకులకు ఓట్లు వేసుకుంటూ, గెలిపించుకుంటూ, కనీసం తాగునీరు, సాగునీరు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు లేకుండా ఇంకెన్నాళ్లు అభివృద్ధి దూరంగా ఉందామని ప్రశ్నించారు. ఇతర దేశాలు అభివృద్ధి చెందుతుంటే మన దేశం ఎందుకు వెనుకబడి ఉందనే విషయంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలనీ, ఇతరులతో చర్చించాలని సూచించారు. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు వ్యవసాయ రంగానికి సబ్సిడీ ఇస్తుంటే, వ్యవసాయాధారిత భారత దేశంలోని పాలకులు అందుకు వ్యతిరేకంగా వ్యవహరించడం కేసీఆర్ విమర్శించారు.

బీఆర్‌ఎస్ రూపంలో ఇంటి గడప ముందుకు అభివృద్ధి వచ్చిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు సహా తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసేందుకురావాలని వారిని ఆహ్వానించారు. ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. వారి జీవితాలను తీర్చిదిద్దుతానని భరోసానిచ్చారు. దాదాపు 300 మందికి పైగా నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

బీఎస్ఎన్ఎల్ పరిరక్షణ కోసం పోరాడండి

కాంట్రాక్టు కార్మికుల హక్కుల కోసం ఉద్యమించండి : బీఎస్ఎన్ఎల్ క్యాజువల్, కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి అన్వేశ్ మిత్ర పిలుపు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఎస్ఎన్ఎల్ కాంట్రాక్టు కార్మికులు తమ హక్కులు, ఆ సంస్థ పరిరక్షణ కోసం పోరాడాలని బీఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన ఆలిండియా ప్రధాన కార్యదర్శి అన్వేశ్ మిత్ర పిలునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో బీఎస్ఎన్ఎల్ క్యాజువల్ కాంట్రాక్టు వర్కర్ల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.మధు అధ్యక్షతన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వేశ్ మిత్ర మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ సంస్థలో కాంట్రాక్టు సిస్టమ్ రద్దు చేశారనీ, సర్వీసు లెవెల్ అగ్రిమెంట్ పద్ధతిలో కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు.

కాంట్రాక్టు వర్కర్లందరూ కనీస వేతనాల కోసం బీఎస్ఎన్ఎన్‌లోని ఇతర సంఘాలతో ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సద స్సులో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ సర్కిల్ కార్యదర్శి జి. సాంబశివరావు, కాంట్రాక్టు వర్కర్ల సంఘం జనరల్ సెక్రటరి బి. పరిపూర్ణాచారి, ఏఐబీడీపీఏ సర్కిల్ కార్యదర్శి రామ చంద్రుడు, ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు వర్కర్ల సంఘం జనరల్ సెక్రటరి కె. ప్రభాకరరావు, రాష్ట్ర అధ్యక్షులు తిరుమలాచార్యులు, ప్రధాన కార్యదర్శి పరిపూర్ణాచారి, బీఎస్ ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నారాయణ, సుశీల్ కుమార్, హరిప్రసాద్, నవీన్, నాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల కోసం నిమ్స్‌లో ప్రత్యేక కౌంటర్లు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కార్మికులకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవల కోసం నిమ్స్ ఆస్పత్రిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్ బలరామ్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తెలిపారు. శనివారంనాడిక్కడి ఆస్పత్రి ప్రాంగణంలో ఈ కౌంటర్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమ్స్‌లోని ఔట్ పేషెంట్, మిలీనియమ్, స్పెషాలిటీ బ్లాకుల్లో సింగరేణీయుల కోసం ఈ ప్రత్యేక ఔట్ పేషెంట్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రిఫర్ చేయబడిన సింగరేణి కార్మికులు, సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డుల కలిగిన విశ్రాంత కార్మికులు అడ్మిషన్ కౌంటర్ల వద్ద ఇతరులతో కలిసి క్యూలైన్లలో ఎక్కువ సేపు వేచి ఉండే అవసరం లేకుండా నేరుగా డాక్టర్లను సంప్రదించేందుకు, అడ్మిట్ అయ్యేందుకు ఈ కౌంటర్లు పనిచేస్తాయన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వైద్య సేవలకు వస్తున్న కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇతర ఆస్పత్రులతో పోల్చితే నిమ్స్‌లో తక్కువ ఖర్చుతో అన్ని రకాల వైద్య సేవలను విశేష ఆనుభవం గల వైద్య నిపుణులు అందిస్తున్నారని వివరించారు.

కార్య క్రమంలో సింగరేణి జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) ఎమ్ సురేష్, డిప్యూటీ సీఎమ్ఓ డాక్టర్ బాలకోటయ్య, పీఆర్వో ఎస్ శ్రీకాంత్, డీఎమ్ఎస్‌లు డాక్టర్ కేవీ కష్టారెడ్డి , డాక్టర్ లక్ష్మీభాస్కర్, ఆర్థిక విభాగం అధికారులు శ్రీధర్, వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ మోహన్, పీఆర్వో శ్రీమతి లక్ష్మి, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ పాయింట్ల మీద చేస్తున్న ఆరోపణలు అవాస్తవం

స్పౌజ్ టీచర్ల ఫోరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్పౌజ్ పాయింట్ల మీద వస్తున్న ఆరోపణలు అవాస్తవమని స్పౌజ్ టీచర్ల ఫోరం ఖండించింది. ఈ మేరకు ఆ ఫోరం నాయకులు నందారం జైపాల్ రెడ్డి, నజియాబేగం, వారణాసి శివశంకర్, డి.సౌజన్య, రాథోడ్, నీరజ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత 13 ఏండ్లుగా 24 శాతం హెచ్‌ఆర్‌ఏ అనుభవిస్తున్న రంగారెడ్డి జిల్లాలోని ఐదు మండలాలు, సంగారెడ్డి జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని కొందరు టీచర్లు ఇప్పుడు జరగబోయే బదిలీల నుంచి తప్పించుకోవడానికే కేసు వేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాలకు వారు చేస్తున్న ఆరోపణల ప్రకారం అధిక హెచ్‌ఆర్‌ఏ లేదు. రాజధానికి సమీప రంగారెడ్డి,సంగారెడ్డి జిల్లాల్లోని 8 మండలాల వారికి 24 శాతం హెచ్‌ఆర్‌ఏలో 13 ఏండ్లుగా ఉన్నందువల్లే బదిలీల్లో తక్కువ పాయింట్లు వచ్చాయని చెప్పారు..అలాంటివారు ఆ జిల్లా పరిధిలో కొంత దూరం వెళ్లడానికి ఇష్టపడక స్పౌజ్ పాయింట్ల నెపంతో బదిలీలు ఆగి పోవాలనే కుట్రతో కేసు వేశారని విమర్శిం చారు. దీనివలన ఆ రెండు జిల్లాల్లోని ఇతర మండలాల వారితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 24 శాతం హెచ్‌ఆర్‌ఏతో సంబంధంలేని 30 జిల్లాల ఉపాధ్యాయులు బదిలీలు ,ప్రమోషన్లకు దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మంది ఉపాధ్యాయులు 40 పాయింట్లకు పైగా ఉండి బదిలీల కోసం ఎదురుచూస్తున్న వారికి ముఖ్యంగా పాఠశాలల్లో ఒకరు లేదా ఇద్దరు ఉన్న మహిళా టీచర్లు బదిలీలు ,ప్రమోషన్లు లేక తీవ్ర ఆవేదనతో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం కోర్టు దృష్టికి తెచ్చిన వివరణలో కూడా పిటిషనర్లు వాస్తవాలను సరైన దృక్పథంలో వివరించలేదని తెలియజేశారు. స్పౌజ్ పాయింట్లు అనేవి మహిళలు అవసరమైన సందర్భంలోనే అది కూడా ఎనిమిదేండ్లకు ఒక సారి మాత్రమే ఉపయోగించుకుంటారన్నారు. వాస్తవాల ను పరిశీలించి సత్వరమే స్టే ఎత్తివేసే విధంగా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బదిలీలకు, ప్రమోషన్లకు అర్హత పొందిన 80 వేల మంది ఉపాధ్యా యుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విషం కక్కిన మోడీ

మంత్రి శ్రీనివాసగౌడ్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

వరంగల్ సభలో ప్రధాని మోడీ.. తెలంగాణపై మరోసారి విషం కక్కారని రాష్ట్ర మంత్రి వి.శ్రీనివాస గౌడ్ వ్యాఖ్యానించారు. విభజన హామీలను నెరవేర్చని ఆయన ఓ విశ్వాస ఘాతుకుడని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్ ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, అంజయ్యలతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. గతంలో తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపిన బీజేపీ... ఇప్పుడు ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయ కుండా ఒక చిన్న రిపేరు కంపెనీని పెడతామంటూ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అసలు ఆ పార్టీ పాత్రేంటని ప్రశ్నిం చారు. అద్వానీ, వెంకయ్య నాయుడు లాంటి అగ్రనేతల చరిత్రను తొక్కి పట్టింది మోడీయేనని విమర్శించారు.

జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌కు సన్మానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికైన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ను తెలంగాణ న్యాయమూర్తుల సంఘం ఘనంగా సన్మానించింది. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సంఘం ప్రతినిధులు భుయాన్‌ను కలుసుకుని అభినందనలు తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఆధ్వర్యంలో రాష్ట్రం లోని 33 జిల్లాలకు జిల్లా న్యాయస్థానాలను, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేయడంలో ఆయన చేసిన కృషిని న్యాయమూర్తుల సంఘం ఈ సందర్భంగా అభినందించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయ మూర్తుల సంఘం అధ్యక్షులు, హైకోర్టు రిజిస్ట్రార్ నందికొండ నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కె.మురళీమోహన్, సహాయ కార్యదర్శి ఉపేందర్ రావు, కార్యవర్గ సభ్యులు మండ వెంకటేశ్వరరావు, జలీల్, రాజు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు. న్యాయమూర్తుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సహకరించి నందుకు రాష్ట్ర న్యాయ మూర్తుల తరపున వారు భుయాన్‌కు ధన్యవాదాలు తెలిపారు.


(ఫైల్)

బీజేపీది పితృస్వామ్య భావజాలం

- అందుకే అత్యాచార నిందితులకు ఆ పార్టీ మద్దతు
- మహిళా రెజ్లర్లకు మోడీ సర్కార్ తీరని అన్యాయం
- మాజీ క్రీడాకారిణి, సామాజిక ఉద్యమకారిణి జగ్మతి సంగ్వాన్

ఉన్నావో ఉదంతం నుంచి బిస్కిస్ బానో వరకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ), కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ అత్యాచార నిందితులకు మద్దతుగా నిలిచాయి. మహిళా రెజ్లర్ల విషయంలోనూ అదే జరిగింది. ఎందుకంటే బీజేపీది పితృస్వామ్య భావజాలం. బాధితులను మరింత క్షోభకు గురి చేయటం, నిందితులకు బాసటగా నిలువటం ఆ పార్టీ భావజాలంలోనే ఉందని భారత మాజీ వాలీబాల్ క్రీడాకారిణి, సామాజిక ఉద్యమకారిణి జగ్మతి సంగ్వాన్ అన్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన ఆమెతో నవతెలంగాణ క్రీడా ప్రతినిధి శ్రీనివాస్ దాస్ మంతటి ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు..



మహిళా రెజ్లర్లు జనవరి నుంచి న్యాయ పోరాటం చేస్తున్నారు. ఎందుకని ప్రభుత్వంలో కదలిక లేదు?

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఓ మైనర్ సహా ఆరుగురు మహిళా రెజ్లర్లు బ్రిజ్‌భూషణ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించి దేశం గర్వపడేలా చేసిన మహిళా రెజ్లర్లు ఓ వైపు.. 40కి పైగా క్రిమినల్ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ మరో వైపు. ఇక్కడ కేంద్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు, ఢిల్లీ పోలీసులు నిందితుడిని రక్షించేందుకు రంగంలోకి దిగాయి. సుప్రీంకోర్టు ఆదేశిస్తే గానీ బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. మోడీ సర్కార్ రాజకీయ ప్రయోజనాలు కాపాడుకునేందుకే ప్రయత్నించింది. బాధిత మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలనే ఆలోచన ప్రభుత్వంలో కనిపించలేదు. అందుకే, ఇప్పటికి బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ రెజ్లర్లపై ప్రత్యారోపణలు చేస్తూ బయట స్వేచ్ఛగా తిరుగుతున్నారు.

రెజ్లర్ల ఆందోళన అంతర్జాతీయ సమాజం దృష్టిని ఆకర్షించింది. భారత్‌లోనూ దేశవ్యాప్త ఉద్యమంగా రూపొందేలా కనిపించింది. అయినా బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను మోడీ సర్కార్ ఎందుకు కాపాడుతోంది?

బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ బలమైన రాజ్‌పుత్ సామాజిక వర్గానికి చెందినవారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ భాజపాకు అత్యంత కీలకం. మహిళా రెజ్లర్ల ఆరోపణలతో అతనిపై చర్యలు తీసుకుంటే ఊరుకోమని రాజ్‌పుత్ సంఘాలు బహిరంగ హెచ్చరికలు చేశాయి. బ్రిజ్‌భూషణ్‌కు అనుకూలంగా సభలు, ర్యాలీలు తీశారు. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకుంటే ఉత్తరప్రదేశ్‌లో రానున్న ఎన్నికల్లో దెబ్బతింటామని భాజపా భావించింది. అందుకే, అతడిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు ఆసక్తి చూపించలేదు. మరోవైపు బ్రిజ్‌భూషణ్ సైతం భాజపా రహస్యాల చిట్టా విప్పేస్తానని హెచ్చరించారు. బాబ్రీ మసీదు కూల్చివేత కేసు నుంచి కాషాయ పార్టీలో కొనసాగుతున్న నాయకుడిని రక్షించేందుకు.. మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలనే ఆలోచనే మరిచారు.

అగ్రశ్రేణి అథ్లెట్లు లైంగిక వేధింపులకు గురైనా నిందితులపై చర్యలు లేవు. ఈ పరిణామంతో భవిష్యత్‌లో బాలికలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకునేందుకు వెనుకడుగు వేయరా?

మహిళా రెజ్లర్ల అంశం ప్రభావం కచ్చితంగా ఉంటుంది. మన అమ్మాయిలు అంతర్జాతీయ వేదికపై విజయాలు సాధించినప్పుడు క్షేత్రస్థాయిలో యువతలో ఉత్సాహం అదే స్థాయిలో వెల్లువెత్తింది. ఇప్పుడు అదే అమ్మాయిలపై జరిగిన చీకటి కోణం సైతం ప్రతికూలంగా ప్రభావం చూపుతుంది. క్రీడల్లోకి అమ్మాయిలను పంపిస్తే.. వారి బాధ్యత, సంరక్షణ తల్లిదండ్రులదేనని ప్రభుత్వం పరోక్షంగా చెప్పేసింది. మహిళా రెజ్లర్లపై ఆగడాలకు పాల్పడిన వ్యక్తిని చట్టపరంగా శిక్షిస్తే.. భవిష్యత్‌లోనూ ఇలాంటి పనులకు పాల్పడాలనే ఆలోచనకు సైతం వణుకు పుట్టేది. కానీ భారతీయ జనతా పార్టీది పితృసామ్య భావజాలం. అత్యాచార బాధితులపై ఎదురు ప్రశ్నలు సంధిస్తూ మరింత క్షోభకు గురి చేయటమే భాజపాకు తెలుసు. మహిళా రెజ్లర్ల విషయంలోనే కాదు.. ఉన్నావో, బిల్కిస్ బానో కేసుల్లోనూ నిందితులకు బీజేపీ బాసటగా నిలిచింది. అత్యాచార నిందితులకు అండగా నిలువటమే ఆ పార్టీ సిద్ధాంతం.

క్రీడా సంఘాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

పని చేసే చోట మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం ప్రతి సంస్థలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉండాలి. భారత జాతీయ క్రీడా సమాఖ్యల్లో కొన్ని మాత్రమే ఈ కమిటీలను ఏర్పాటు చేశాయి. క్రీడా సంఘాల ఆఫీస్ బేరర్లలో మహిళలకు ప్రాతినిథ్యం లేకపోవటంతో పురుషులే ఈ కమిటీలో ఉంటున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని బదిలీ చేయటం, వార్షిక ఇంక్రిమెంట్ నిలుపుదల చేయటం మాత్రమే కమిటీ గరిష్ఠంగా తీసుకోగల చర్యలు. లైంగిక వేధింపుల నిరోధానికి ఈ కమిటీలకు ఉన్న అధికారం సరిపోదు. కమిటీలకు మరిన్ని అధికారాలు ఇవ్వాలి. ఇక బాధితులు కమిటీ ఎదుట నిర్భయంగా ఫిర్యాదు చేయగల పరిస్థితులు కల్పించాలి. బాధితులను ఫిర్యాదుల కమిటీనే మరింత వేధింపులకు గురి చేసిన సంఘటనలు సైతం ఉన్నాయి. భారత రెజ్లింగ్ సమాఖ్యలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ పేరును 'లైంగిక వేధింపుల కమిటీ'గా పెట్టారు. అందుకు తగినట్టుగానే డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ వ్యవహరించినట్టు కనిపిస్తుంది!.

జంతర్‌మంతర్ వద్ద రెజ్లర్లకు మద్దతుగా ఆందోళనలో మీరూ పాల్గొన్నారు. ఆ సమయంలో రెజ్లర్ల భావోద్వేగాలు ఎలా ఉన్నాయి?

ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలో కూర్చున్నారు. మహిళా రెజ్లర్లు న్యాయం కోసం వీధుల్లోకి వచ్చి నిరసన తెలపడానికి పడిన వేదనను నేను ఓ అథ్లెట్‌గా అర్థం చేసుకోగలను. ఢిల్లీ పోలీసులు రెజ్లర్లతో దారుణంగా వ్యవహరించారు. రోడ్డుపైకి ఈడ్చుకొచ్చారు, లాఠీలకు పని చెప్పారు. రెజ్లర్లను నేరస్థులు, ఉగ్రవాదులను చూసినట్టు చూశారు. అధికార పార్టీ ఎంపీపై న్యాయ పోరాటం చేస్తే.. అగ్రశ్రేణి క్రీడాకారులనే విషయాన్ని సైతం పట్టించుకోకుండా ఎన్నో ఇబ్బందులు పెట్టారు. నీటి సరఫరా నిలిపివేత, కరెంట్ నిలిపివేత, మద్దతుదారులను అడ్డుకోవటం వంటి దృశ్యాలు చూసిన మహిళా రెజ్లర్లు ఎంతో వేదనకు గురయ్యారు. మల్లయోధులు జంతర్‌మంతర్ వద్ద నిద్ర లేని రాత్రులు గడిపారు. మహిళా మల్లయోధల ఆవేదన మాటల్లో చెప్పలేనిది.

అథ్లెట్‌గా, సామాజిక ఉద్యమకారిణిగా హైదరాబాద్‌కు పలుమార్లు వచ్చారు. ఇక్కడ క్రీడాభివృద్ధి, స్టేడియాలపై మీ అభిప్రాయం?

వాలీబాల్ క్రీడాకారిణిగా హైదరాబాద్‌తో మంచి అనుబంధం ఉంది. 1982 ఆసియా క్రీడల సన్నాహక శిబిరం ఇక్కడి ఎల్బీ స్టేడియంలో నిర్వహించారు. ఆసియా క్రీడల కోసం ఇక్కడే సాధన చేశాం. లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియంతో ఎంతో అనుబంధం ఉంది. కానీ ఇప్పుడు ఎల్బీ స్టేడియంలో క్రీడా పోటీల కంటే ప్రయివేటు కార్యక్రమాలే ఎక్కువగా సాగుతున్నాయని విన్నాను. ఓ క్రీడాకారిణిగా ఇది ఏమాత్రం నచ్చలేదు. క్రీడాకారులు ఆడుకునేందుకు సైతం డబ్బులు చెల్లించి స్టేడియాలకు రావాల్సిన పరిస్థితిని ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. భారత జాతీయ జట్లకు ఎంతో మంది దిగ్గజ క్రీడాకారులను అందించిన చరిత్ర హైదరాబాద్‌కు ఉంది. క్రీడా మైదానాలను ఆటల పోటీలకు మాత్రమే ఉపయోగించాలి. రాజకీయ, ప్రయివేటు వేడుకలకు స్టేడియాలను ఉపయోగించకూడదు.

సెమీస్‌లో సింధు, లక్ష్య

- క్వార్టర్స్‌లో అలవోక విజయాలు
- కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్



న్యూఢిల్లీ : భారత స్టార్ షట్లర్ పి.వి సింధు, లక్ష్యసేన్ కెనడా ఓపెన్‌లో సత్తా చాటుతున్నారు. మహిళల సింగిల్స్‌లో సింధు, పురుషుల సింగిల్స్‌లో సేన్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో పి.వి సింధు వరుస గేముల్లో గెలుపొందింది. చైనా అమ్మాయి ఫాంగ్ జిపై 21-13, 21-7తో ఏకపక్ష విజయం సాధించింది. 44 నిమిషాల్లోనే సెమీస్‌కు చేరుకున్న సింధు.. చైనా షట్లర్‌ను చిత్తు చేసింది. తొలి గేమ్‌ను 21-13తో నెగ్గిన సింధు.. రెండో గేమ్‌లో మరింత రెచ్చిపోయింది. ఏకంగా వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించి దుమ్మురేపింది. చైనా షట్లర్ నుంచి సింధుకు కనీస పోటీ ఎదురుకాలేదు. సెమీఫైనల్లో టాప్ సీడ్, జపాన్ షట్లర్ అకానె యమగూచితో సింధు తలపడనుంది. మెన్స్ సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ మూడు గేముల్లో నెగ్గాడు. 21-8, 17-21, 21-10తో బెల్జియం ఆటగాడిపై పైచేయి సాధించాడు. తొలి గేమ్‌ను సులువుగా నెగ్గిన సేన్.. రెండో గేమ్‌లో తడబడ్డాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో దూకుడు చూపించి సెమీస్ బెర్త్ దక్కించుకున్నాడు. సెమీఫైనల్లో జపాన్ షట్లర్ కెంట నిషిమోటతో లక్ష్యసేన్ ఢీకొట్టనున్నాడు.

ఆసియా క్రీడలకు వృతి అగర్వాల్

- ఈ ఘనత సాధించిన తొలి తెలంగాణ స్విమ్మర్



హైదరాబాద్ : తెలంగాణ యువ స్విమ్మర్ వృతి అగర్వాల్ రికార్డు సృష్టించింది. ఆసియా క్రీడల్లో పోటీపడనున్న తొలి తెలంగాణ స్విమ్మర్‌గా నిలువనుంది. హౌంగ్జౌ ఆసియా క్రీడలకు భారత స్విమ్మింగ్ సమాఖ్య భారత జట్టును శనివారం ప్రకటించింది. మహిళల 4, 200 మీటర్ల రిలే రేసులో వృతి అగర్వాల్ పోటీపడనుంది. 16 ఏండ్ల వృతి అగర్వాల్ ఇటీవల జాతీయ క్రీడల్లోనూ నాలుగు పతకాలతో మెరిసింది. తాజాగా హైదరాబాద్‌లో ముగిసిన జాతీయ స్విమ్మింగ్ పోటీల్లోనూ పతకాల పంట పండించింది. 'ఆసియా క్రీడల భారత జట్టులో ఇంత త్వరగా చోటు ఆశించలేదు. ఇంత గొప్ప అవకాశం లభించటం పట్ల సంతోషంగా ఉంది. ఆసియా క్రీడల మెగా సవాల్‌కు సిద్ధమవుతాను. ఆసియా క్రీడల్లో పతకంతో దేశం గర్వపడేలా చేస్తానని' వృతి అగర్వాల్ తెలిపింది.

ఫైనల్లో సౌత్ జోన్

సెమీస్‌లో నార్త్‌పై గెలుపు

బెంగళూర్ : దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సౌత్ జోన్ ఘన విజయం సాధించింది. నార్త్ జోన్ నిర్దేశించిన 215 పరుగుల లక్ష్యాన్ని సౌత్ జోన్ 8 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (54, 57 బంతుల్లో 7 ఫోర్లు), కెప్టెన్ హనుమ విహారి (43, 42 బంతుల్లో 8 ఫోర్లు) ఛేదనలో కీలక ఇన్నింగ్స్‌లు నమోదు చేశారు. రికీ భుయ్ (34), తిలక్ వర్మ (25), సాయి కిశోర్ (15 నాటౌట్) రాణించారు. 36.1 ఓవర్లలో 8 వికెట్లకు 219 పరుగులు చేసిన సౌత్ జోన్ దులీప్ ట్రోఫీ ఫైనల్లోకి చేరుకుంది. మరో సెమీస్‌లో సెంట్రల్ జోన్‌పై వెస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

గోదావరి ముంపు కాలనీల్లో సీపీఐ(ఎం) పాదయాత్ర

- పాదయాత్రను ప్రారంభించిన రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి పొంచి ఉన్న ప్రమాదం : ప్రారంభ సభలో వక్తల ఉద్ఘాటన

నవతెలంగాణ-భద్రాచలం

గోదావరి ముంపు నుంచి భద్రాచలం రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి ప్రమాదం పొంచి ఉందని సీపీఐ(ఎం) నేతలు అన్నారు. ముంపు కాలనీలలో సీపీఐ(ఎం) పాదయాత్రను శనివానం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ ప్రారంభించారు. ప్రారంభ సభ భద్రాచలం ఏఎంసీ కాలనీలో శనివారం పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో బండారు రవికుమార్, నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య ప్రసంగించారు. పోలవరం ముంపు నుంచి భద్రాచలానికి ప్రమాదం పొంచి ఉన్నదని తమ పార్టీ 2007లోనే హెచ్చరించినా పాలకవర్గాలు పెడచెవిన పెట్టాయని విమర్శించారు. గత సంవత్సరం వరదలు భద్రాచలం పట్టణ ప్రజలను భయాందోళనకు గురిచేశాయన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి సైతం వచ్చి భద్రాచలం రక్షణకు చర్యలు చేపడతామని మాటలు మాత్రమే చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. భద్రాచలంలో గెలిచిన అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ముంపు విషయంలో నోరు మెదపకపోవడం సరైనది కాదన్నారు. గతంలో సీపీఐ(ఎం) ప్రజాప్రతినిధులు వరదల సమయంలో ముంపు ప్రాంతాలను



అంటిపెట్టుకొని ఉండి ప్రజలకు అండగా నిలిచారని, నేడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టు కాబట్టి కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చించి భద్రాచలం ముంపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తక్షణం గోదావరి కరకట్టకు మరమ్మతులు చేయాలని, కట్టకు ఉన్న స్లూఈజ్‌లు రిపేరు చేయించి సమర్థవంతమైన మోటార్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మొదటిరోజు పాదయాత్ర భద్రాచలం ముంపు కాలనీలు ఏఎంసీ కాలనీ, అశోక్ నగర్ కొత్త కాలనీ, రెవెన్యూ కాలనీ, అయ్యప్ప కాలనీలలో కొనసాగింది. పాదయాత్రకు నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య సారథ్యం వహించగా.. బృందంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, ఎం.రేణుక, సున్నం గంగా, బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి సంతోష్ కుమార్, నాదెల్ల లీలావతి ఉన్నారు. ప్రారంభ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, ఏ.జే. రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మచారి, ఎంబి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, దొడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ వ్యాఖ్యలు దిగజారుడు తనానికి నిదర్శనం : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



హైదరాబాద్ : వివిధ సంక్షేమ పథకాలతో దేశంలోనే ఆదర్శ పాలన సాగిస్తున్న కేసీఆర్‌పై అవినీతి, కుటుంబ పాలన అంటూ.. ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విమర్శిం చారు. అంబర్ పేటలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ వ్యాఖ్యలను ఖండించారు. విభజన హామీలు అమలు చేయలేని ప్రధాని రాష్ట్రానికి వచ్చిన ప్రతిసారి ఇక్కడి ప్రభుత్వంపై అవాకులు చవాకులు పేలడం, అసత్యాలు మాట్లాడడం అలవాటుగా మారిందని విమర్శించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన వర్సిటీ, నది జలాల పంపిణీ పై తేల్చకుండా ఉత్త చేతులతో వెళ్తున్నా తలసరి ఆదాయం పెంపు వ్యవసాయ, ఐటీ రంగాల్లో అభివద్ధిలో ఉందన్నారు. రైతులు పేదల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఉచిత విద్యుత్ , రైతు బీమా, రుణమాఫీ కల్యాణ లక్ష్మి పథకాలతో ఆదర్శ పాలన సాగిస్తున్నరని, అధికార దాహంతో ప్రజల మధ్య విభేదాలు సష్టించే బీజేపీని రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో నియోజవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు యత్నిస్తుందని, అందులో భాగంగానే ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై భారాలను మోపుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు విపక్షాలు ఏకమవుతున్నాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఒక వేదిపైకి వచ్చి బీజేపీని గద్దె దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని చెప్పారు. దీనికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. కర్నాటక ఫలితాలు, కాంగ్రెస్‌లో పొంగులేటి చేరికతో తెలంగాణలో కాంగ్రెస్‌కు కొంత ఊపు తీసుకొచ్చిందన్నారు. దీంతో రాష్ట్రంలో బీఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య పోటీ ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని, కానీ వరంగల్‌లో మోడీ సభతో తాము కూడా పోటీలో ఉన్నట్టు బీజేపీ నేతలు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇవ్వొద్దన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాటాలు నిర్వహించే వామపక్ష పార్టీలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని, వాటి అమలు కోసం భవిష్యత్‌లో ప్రజా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేసి గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, తిరుపతి, రామ్మూర్తి, భావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరుశరాములు, ఐద్వా జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వందల వేల సంవత్సరాలుగా దేశంలోని దళితులు, ఆదివాసీలు ఆర్థిక దోపిడీకి, లైంగిక దోపిడీకి గురవుతున్నందున వారి కోసం ఎన్నో ప్రత్యేక చట్టాలు వచ్చాయి. మరి ఈ ఉమ్మడి స్మృతితో అవన్నీ ఉంటాయా? లేదా! ఆదివాసీలకు 1/70 చట్టం ఉంది. రక్షించబడుతుందా? రిజర్వేషన్లూ ఉన్నాయి. వాటి సంగతేమిటి? మహిళల వివక్షపై దాడులపై ప్రత్యేక చట్టాలున్నాయి. రేపు కోడ్‌వస్తే! బీఫ్ ఆహార హక్కుగా ఉంటుందా లేదా! ఇలా ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా హడావిడి చేస్తే ఎలా? యూసీసీ లేకుండానే లింగ సమానత్వం సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు.



ఏకరూపం ఎవరికోసం!

సంపాదకీయం

ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే న్యాయం, ఒకే పాలన. చాలా వీనులవిందుగా వినపడుతుంది. అంతా ఒక్కటిగా ఉండటమంటే మాటలా మరి! అందుకోసం కృషి చేసేవాళ్ల ఎంత విశాల హృదయులు! వారి కృషిని ఆహ్వానించాల్సిందే, అని పరవశించిపోతున్న వాళ్లు అనేకులను చూస్తుంటే వెనకటి కథ ఎలుకల రొట్టె తగాదాను పిల్లి పరిష్కరించినది గుర్తుకు వస్తోంది. ఒకే దోపిడి, ఒకే వివక్ష, ఒకే విధ్వంసం, ఒకే ఉన్మాదంతో జనాన్ని ముంచే యత్నాలకు ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతి ఓ ఆయుధంలా దొరికింది ఏలినవారికి. డెబ్బయి అయిదేండ్ల స్వతంత్రంలో ఆర్థిక అసమానతలు అంతరించకపోగా పెరిగాయి. సామాజిక అసమానతలు అలానే ఉన్నాయి! ఉన్నవాడి బాధలకు, లేనివాడి బాధలకు ఏకరూపత లేదు. స్త్రీ, పురుషుల సమానత్వమూ సాధించబడలేదు. చదువుకునే హక్కును అందరూ ఇంకా పొందలేకపోతున్నారు. పసిపిల్లల ఆహారమూ, ఆరోగ్యమూ అందరికి సమానంగా సాధించబడలేదు. ఉండటానికి గూడు, గుడ్డ, కూడు సమకూర్చనేలేదు. ఇప్పుడు ఉమ్మడి పౌరస్మృతితో వారసత్వ హక్కులన్నింటినీ సమానం చేస్తారట. అంటే దారిద్ర్యాన్ని, లేమిని, అనారోగ్యాన్ని అశేష జనులకూ ధనవంతుల ధనాన్ని వారి పిల్లలకూ సమానంగా పొందే హక్కు కల్పిస్తాడన్నమాట!

ఒకే తూటాకి రెండు పిట్టలు అన్నట్లుగా, ఎన్నికల సమయంలో ఈ పౌరస్మృతి చట్టాన్ని ప్రచారంలోకి తెచ్చారు. ఒకటి మతాల మధ్య ద్వేషాలను పెంచటం, రెండోది ఉమ్మడి పేరుతో సామాన్య బడుగు, బలహీన ప్రజల ప్రత్యేక హక్కులను కాలరాసి కార్పొరేట్లకు మేలుచేయటం, పేదల రాయితీలను రద్దు చేయటం అనేవి దీని మూలంగా జరిగే అనర్థాలు. చాలామంది ప్రజలు ఉమ్మడి పౌరస్మృతి అనగానే మతపరమైన అంశమని, అదీ మన ప్రత్యర్థి మతాన్ని నియంత్రించేదని అనుకుంటున్నారు. కాని ఇది అన్ని మతాలకూ, అందరు ప్రజలకూ సంబంధించినది. అందుకనే చాలా జాగ్రత్తగా ఆలోచన చేయాలి. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం అనే స్ఫూర్తితో సాగుతున్నది. ఎన్నో మతాలు, సంస్కృతులు, కులాలు, తెగలు, జాతులు, ఆచారాలు, సంప్రదాయాలు, భాషలు, భిన్నమైన విధానాలతో బతుకుతున్న దేశం. వివాహాల సంప్రదాయాలు వేరుగా ఉన్నాయి. విడాకుల సంప్రదాయాలూ వేరుగా ఉన్నాయి. పునర్వివాహాలు వేరు వేరు, వారసత్వ విధానాలూ వేరు, ఆహారపు అలవాట్లూ వేరువేరు. వీటన్నింటిని క్రోడీకరించి ఎలా ఏకరూపంలోకి తెస్తారు? గతంలో అధ్యయనం చేసిన లా కమిషన్ బహుళ సంస్కృతులు ఉన్న సమాజంలో ఉమ్మడి స్మృతి అసాధ్యమని, వాంఛనీయము కాదని పేర్కొన్నది. మన దేశంలో కులాల మధ్య అంతరాలు అధికంగా ఉన్నాయి. అసమానంగా చూడటమూ ఉంది. అలా చూడకూడదన్న చట్టాలూ ఉన్నాయి. కానీ దుర్మార్గాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీనిపై ఏం చేయాలో ఏమైనా ఆలోచించారా! మొన్న మొన్నటి వరకూ హిందూమతంలో సతీసహగమనం ఆచారంగా కొనసాగింది కదా! ఇప్పటికీ ఈ మతంలో స్త్రీ వంటింటికీ, పిల్లలు కనటానికి, సేవచేయటానికేనని బోధిస్తున్నది కదా! అలాంటి మనుస్మృతియే మా రాజ్యాంగమని ప్రకటించిన వారి వారసులే లింగ సమానత కోసం ఈ స్మృతిని తెస్తున్నామనటమే వింతగా ఉంది.

ఆనాడు అంబేద్కర్ హిందూకోడ్ బిల్లును తీసుకువచ్చే ప్రయత్నం చేస్తే హిందూ సాంస్కృతిక మహాసౌధం కూలిపోతుందని వ్యతిరేకించిన శ్యాంప్రసాద్ ముఖర్జీ హిందూ సంఘీయుల వారసులు ఇప్పుడెలా ఉమ్మడి విధానాన్ని ముందుకు తెస్తున్నారు? హిందూ సంస్కృతిలో ఏ అంశాన్నీ వేలెత్తి చూపడానికి వీల్లేదని వాదించిన వారే నేడు ఈ నినాదాన్ని ఎత్తుకోవటం వెనుక వారి ఉద్దేశ్యాలు వేరుగా ఉన్నాయి. పర్సనల్ లాలు ఒక్క ముస్లింలకే లేవు, అన్ని మతాలకూ ఉన్నాయి. అందరూ సమానంగా వ్యవహరించటానికి మన రాజ్యాంగమూ అందరికి అన్ని హక్కులనూ కల్పిస్తున్నది కూడా. ముస్లిం షరియత్, పెండ్లిళ్లు, తలాక్‌లకు మాత్రమే సంబంధించిన విషయం కాదు. కానీ ఆ రకమైన వైరుధ్యాన్ని ముందుకు తెచ్చి, విద్వేషాలను నింపజూస్తున్నది. అందుకనే "ఉమ్మడి స్మృతికి హిందూ రాష్ట్ర భావనకు సంబంధం ఉన్నదని, వేల సంవత్సరాలుగా భిన్న అభిప్రాయాలతో సంస్కృతులతో జీవిస్తున్నాం, మరో వెయ్యేండ్లు జీవిస్తాం. యూసీసీ ప్రవేశపెట్టి ఎవరు ప్రయోజనం పొందుతారు?" అని నోబుల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ ప్రశ్నించారు.

వందల వేల సంవత్సరాలుగా దేశంలోని దళితులు, ఆదివాసీలు ఆర్థిక దోపిడీకి, లైంగిక దోపిడీకి గురవుతున్నందున వారి కోసం ఎన్నో ప్రత్యేక చట్టాలు వచ్చాయి. మరి ఈ ఉమ్మడి స్మృతితో అవన్నీ ఉంటాయా? లేదా! ఆదివాసీలకు 1/70 చట్టం ఉంది. రక్షించబడుతుందా? రిజర్వేషన్లూ ఉన్నాయి. వాటి సంగతేమిటి? మహిళల వివక్షపై దాడులపై ప్రత్యేక చట్టాలున్నాయి. రేపు కోడ్‌వస్తే! బీఫ్ ఆహార హక్కుగా ఉంటుందా లేదా! ఇలా ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా హడావిడి చేస్తే ఎలా? యూసీసీ లేకుండానే లింగ సమానత్వం సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఏవైనా వివక్షతలుంటే పరిశీలించి ఆ చట్టాలను సవరించాలి. అంతే కానీ వైవిధ్యాలను, విభిన్నతలను వైరుధ్యంగా చేసే ప్రయత్నాలు సరికాదు.

తెలుగురాష్ట్రాల్లో కమలం కమాల్


తెలకపల్లి రవి

గత పదిహేను రోజులుగా బీజేపీ తెలుగు రాష్ట్రాలలో సాగించిన రాజకీయ విన్యాసాలు వాటికి పరాకాష్టగా ప్రధాని మోడీ పర్యటన, ఇందుకు సమాంతరంగా కొన్ని ప్రాంతీయ పార్టీల పిల్లిమొగ్గలు అవకాశవాదానికి అద్దం పడుతున్నాయి. ఎవరు ఎవరితో కలుస్తున్నారు, ఏ దిశలో పయనిస్తున్నారు అనేదానిపై భిన్న సంకేతాలిస్తూ ప్రజల్లో గందరగోళం పెంచడం వాటి నైజాన్ని నిరూపించింది. మరోవైపున తన జాతీయ వ్యూహాలలో భాగంగా ఈ పార్టీల పట్ల తన వైఖరి గురించి బీజేపీ కూడా ఉద్దేశపూర్వకంగానే తికమక సృష్టించింది. ఇంకా కొనసాగిస్తోంది కూడా. వాటికి అనుకూలమైన మీడియాలు కూడా తమవైన ఊహాగానాలతో కల్పనాకథలతో కాలక్షేపం చేశాయి. వీటిలో దేనిపైనా వీటి నాయకులు ఇదమిద్ధంగా ప్రకటన చేయకుండా అస్పష్టతకే బలం చేకూర్చడం ఇందులో భాగమే. బెంగళూరులో ఈ నెల మూడవ వారంలో జరిగే ప్రతిపక్షాల మలిసమావేశం, బీజేపీ ఆధ్వర్యంలో జరిగే ఎన్‌డీఏ విస్తృత సమావేశం వీటికి జాతీయ ప్రతిధ్వనిగా ఉన్నాయి.

తెలంగాణలో తాము అధికారంలోకి రాబోతున్నామని హడావుడి చేసిన బీజేపీ ముందుగానే చేతులెత్తేయడంతో ఈ ప్రహసనం మొదలైంది. బండి సంజయ్ అధ్యక్షుడైనాక దూసుకుపోతున్నామనీ, ఇతర పార్టీల నేతలు క్యూలు కడుతున్నారని పెద్ద హంగామా చేశారు. దుబ్బాక, జీహెచ్ఎంసీ, హుజూరాబాద్ ఎన్నికలలో విజయాలు ఇందుకు నిదర్శనాలుగా చెప్పబడ్డాయి. అయితే ఆ రెండు శాసనసభ ఉపఎన్నికలలోనూ రఘునందన్, ఈటల రాజేందర్ గెలుపులు ప్రత్యేక పరిస్థితులలో లభించాయనీ, జీహెచ్ఎంసీలో సంజయ్ మతతత్వం రెచ్చగొట్టడంతో అధికంగా సీట్లు వచ్చాయని అందరికీ తెలుసు. అయినా కావాలనే ఈ హైప్‌ను పెంచుతూ రావడానికి కొన్ని మీడియా సంస్థలు వ్యూహాత్మకంగా కారణమైనాయి. ఆ వూపులో కాంగ్రెస్ నుంచి వచ్చి చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ అసెంబ్లీకి రాజీనామా చేసి మునుగోడులో ఉప ఎన్నిక తీసుకు వచ్చి భంగపడ్డారు. కాకపోతే ఇక్కడ వామపక్షాలు బలపర్చి ఉండకపోతే టీఆర్ఎస్/బీఆర్ఎస్ గెలిచివుండేది కాదని కూడా తేలిపోయింది. ఈ ఎన్నికకు కాస్తముందుగా ఆపరేషన్ ఫాంహౌస్‌లో చిక్కిపోయిన బీజేపీ, బీఆర్ఎస్ ఎంఎల్సీ కవితను ఢిల్లీ లిక్కర్ స్కాంలో భాగస్వామిగా ఆరోపించి దాడిచేసింది. ఈడీ ఆమెను పలుసార్లు విచారించింది. కవితనే గాక కేసీఆర్‌ను కూడా అరెస్టు చేస్తామన్న స్థాయిలో బండి సంజయ్ వంటివారు రెచ్చిపోయి మాట్లాడారు. ప్రతిపక్షాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను కావాలని ఉసిగొలుపుతున్నారని బీఆర్ఎస్‌తో పాటు సుప్రీం కోర్టులో కేసు వాదించిన కాంగ్రెస్ రాష్ట్రంలో మాత్రం కేసీఆర్ ప్రభుత్వంపై చర్యతీసుకోవాలని విమర్శలు చేస్తూనే వచ్చింది. కర్నాటక విజయం తర్వాత జోష్ పెరిగినట్టుగా దాడితీవ్రం చేసింది. బీజేపీ చేరికల కమిటీ ఎన్ని

> బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై పార్టీలో అంతర్గతంగానే తీవ్ర అసంతృప్తి, అంతఃకలహాలు పెరుగుతూనే వచ్చాయి. ఈటల రాజేందర్‌ను అధ్యక్షుడిని చేస్తారని ఒక లాబీ చాలా కాలంగా చెబుతూవచ్చింది. దాన్ని మరోవర్గం వ్యతిరేకించడంతో మధ్యే మార్గంగా మళ్లీ కిషన్‌రెడ్డిని తీసుకొచ్చారు. అయితే ఈ లోగా విజయశాంతి, జితేందర్‌రెడ్డి, రాజగోపాలరెడ్డి, రఘునందనరావుతో సహా ప్రతివారూ బహిరంగంగానే ధిక్కారం చేశారు. రఘునందన్ అయితే సంజయ్‌కి రూ.వందకోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

తంటాలు పడినా చెప్పుకోదగిన వారెవరూ చేరకపోవడం వాస్తవ పరిస్థితిని వెల్లడించింది. బీఆర్ఎస్ నుంచి నిష్క్రమించిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి వంటివారు కూడా కాంగ్రెస్‌లోనే చేరడం బీజేపీకి మరీ ఇబ్బందిగా మారింది. కేసీఆర్ కూడా తమకు రాజకీయ ప్రత్యర్థి కాంగ్రెస్ తప్ప బీజేపీ కాదని పలుసార్లు ప్రకటించారు. కాంగ్రెస్, బీజేపీ రెండింటిపైనా సమానంగా విమర్శలు చేసే ఆ పార్టీని పాట్నా సదస్సుకు ఆహ్వానించలేదు కూడా. బీజేపీపై కేసీఆర్ విమర్శల తీవ్రత తగ్గిందనే అభిప్రాయమూ పెరిగింది. ఆ దశలో ఉభయ కమ్యూనిస్టుపార్టీలు సమావేశమై కేసీఆర్‌ను కలసి ఎన్నికల విషయమై స్పష్టతకు రావాలని నిర్ణయానికి వచ్చాయి. బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్‌తో కలసి పనిచేస్తామని ప్రకటించిన కమ్యూనిస్టులు ఇప్పుడు కాంగ్రెస్‌తో చేతులు కలుపుతారని కూడా కొన్ని మీడియాలు రాశాయి. తాము బీజేపీకి వ్యతిరేకంగా ఉండాలనే బీఆర్ఎస్‌కు చెబుతామనీ, సీట్ల చర్చలకోసం తాముగా అడగబోమని కూడా ఉభయపార్టీలు ప్రకటించాయి. నిజానికి కేరళలో సీపీఐ(ఎం) ఇప్పటికే విమర్శించినట్టుగా జాతీయ స్థాయిలో బీజేపీని ఓడించాలనే తన లక్ష్యానికి ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయ లౌకిక పార్టీల పట్ల తీసుకోవలసిన వైఖరికి మధ్య కాంగ్రెస్ సమతుల్యవైఖరి తీసుకోలేకపోవడం తెలంగాణలోనూ ఉంది. పైగా బీజేపీ బీఆర్ఎస్ ఒకటేనన్న వైఖరి ముదిరి మొన్న ఖమ్మంలో జరిగిన బహిరంగసభలో రాహుల్‌గాంధీ దానికి బీటీమ్‌గా ఆరోపించారు. సహజంగానే దీనిపై పాలకపార్టీ విరుచుకుపడి మీరిద్దరే ఒక టీమ్ అన్నట్టు ఎదురుదాడి చేసింది. ఈ మూడు పార్టీలూ తక్కిన ఇద్దరినీ ఒక టీమ్‌గా విమర్శించడం పరిపాటిగా మారింది.

ఇవన్నీ ఎలా ఉన్నా బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై పార్టీలో అంతర్గతంగానే తీవ్ర అసంతృప్తి, అంతఃకలహాలు పెరుగుతూనే వచ్చాయి. ఈటల రాజేందర్‌ను అధ్యక్షుడిని చేస్తారని ఒక లాబీ చాలా కాలంగా చెబుతూవచ్చింది. దాన్ని మరోవర్గం వ్యతిరేకించడంతో మధ్యే మార్గంగా మళ్లీ కిషన్‌రెడ్డిని తీసుకొచ్చారు. అయితే ఈ లోగా విజయశాంతి, జితేందర్‌రెడ్డి, రాజగోపాలరెడ్డి, రఘునందనరావుతో సహా ప్రతివారూ బహిరంగంగానే



ధిక్కారం చేశారు. రఘునందన్ అయితే సంజయ్‌కి రూ.వందకోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. నా వల్లనే పార్టీకి ఊపొచ్చిందని ఆయనా రాజేందర్ కూడాపోటీలు పడ్డారు. దాదాపు వారం సాగిన ఈ తంతు కాంగ్రెస్ కలహాలను కూడా మరపించింది. ఈ మొత్తం వ్యవహారం పదవుల కోసమే గాని వీరిలో ఎవరూ మత రాజకీయాలపై అభ్యంతరం పెట్టింది లేదు. బండి సంజయ్‌ని కేంద్రంలోకి తీసుకుంటారని కూడా దాదాపు నమ్మకంగా చెబుతున్నారు. తెలంగాణలో మొదలైన ఈ లొల్లి ఏపీకి పాకి అక్కడా అధ్యక్ష మార్పును తెరపైకి తెచ్చింది. సోము వీర్రాజుకు ఎసరు పెట్టింది. ఈ క్రమంలో సత్యకుమార్‌ను చేస్తారని ఒక లాబీ ప్రచారం నడిపింది. తనను తెలుగుదేశం అనుకూలుడుగా ప్రచారం చేసింది మరో వర్గం. టీడీపీ నుంచి వచ్చి చేరిన సుజనాచౌదరి వంటివారి పేర్లు కూడా వినిపించాయి. చివరకు ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురంధేశ్వరిని అధ్యక్ష పదవిలో నియమించారు. రాష్ట్ర విభజన నిర్ణయం వరకూ కాంగ్రెస్‌లో ఉండి తర్వాత బీజేపీలోకి మారిన ఆమె వ్యక్తిగతంగా కుటుంబపరంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు సరిపడని వ్యక్తిగా భావిస్తారు. బీజేపీతో మరోసారి పొత్తుపెట్టుకోవడం కోసం చంద్రబాబు ఆరాటపడుతూ అందుకోసం అమిత్‌షా, నడ్డాలను కూడా కలసి వచ్చిన నేపథ్యంలో ఈ నియామకం అందుకు విరుద్ధమైన సంకేతాలిచ్చింది. ఈ నిర్ణయం జరిగే సమయంలోనే ఏపీ ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీలో ఉండి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలను కలిసి కొన్ని నిధులు విడుదల కావడం కూడా రాజకీయ జోస్యాలను రక్తికట్టించింది. గోదావరి జిల్లాల్లో వారాహి యాత్ర చేస్తున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా ఈ పొత్తుల ముచ్చట గందరగోళం పెంచడానికి తన వంతు పాత్ర పోషించారు. ఏతావాతా బీజేపీ ద్వంద్వ రాజకీయ క్రీడలో మూడు ప్రాంతీయ పార్టీలు పాచికలుగా ఉపయోగపడ్డాయి. ఎవరితో పొత్తు పెట్టుకోకుండానే అందరి మద్దతు తీసుకోవచ్చనే బీజేపీ వ్యూహానికి భూమిక కల్పించాయి. అయితే ఇప్పటికీ ఈ విషయంలో అంతిమ నిర్ణయం మిగిలే ఉంది. ఎన్‌డీఏ సమావేశానికి టీడీపీ వెళ్తుందని కూడా అనుకూల ఛానళ్లు హడావుడి చేసినా చివరకు ఆహ్వానం రాలేదని ఆ పార్టీయే ప్రకటించాల్సి వచ్చింది. పంజాబ్‌లో అకాలీదళ్ విషయంలోనైతే తాము మళ్లీ ఎన్‌డీఏలో చేరబోమని వారే ప్రకటించారు గాని టీడీపీ మాత్రం ఆ పనిచేయడానికి సిద్ధంగా లేదు. వైఎస్

> ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ మరోసారి ఆయనపై విమర్శలు సంధించారు. ఈపర్యటనలో అధికారిక కార్యక్రమాలలో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనలేదు. బహిష్కరిస్తున్నట్టు ఆపార్టీ ప్రకటించింది. తమ పార్టీ సభల్లో ప్రధాని కేసీఆర్ ప్రభుత్వం అవినీతి మయమని తీవ్రంగా దాడి చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సభలలోనూ ఆయన కేసీఆర్ కుటుంబ అవినీతి ఆరోపణలంటూ ప్రస్తావించారు. అవినీతి కోసమే ఢిల్లీ తెలంగాణ ప్రభుత్వాలు సహకరించుకుంటున్నాయని ఆప్‌ను కూడా రంగంలోకి తెచ్చారు. ప్రతిపక్షాల జాతీయ సమావేశం జరగనున్న నేపథ్యంలోనే మోడీ ఇవన్నీ మాట్లాడారనేది స్పష్టమే.

షర్మిల పార్టీ బీజేపీకి దగ్గరైనట్టు ఒక దశలో కనిపించగా, తర్వాత కాంగ్రెస్‌లో కలసిపోతుందని లేదంటే చేతులు కలుపుతుందని కథనాలు కూడా ఏపీ, తెలంగాణలలో శీర్షికలయ్యాయి. ఏపీలో జగన్‌పై ఆమె రాజకీయంగా పోరాడుతుందని కూడా ఆ మీడియా కథనాలిచ్చింది. తాను తెలంగాణకే పరిమితమంటూ ఖండన విడుదల చేసిన షర్మిల కాంగ్రెస్‌తో బంధం విషయం మాత్రం తేల్చలేదు. అయితే వైఎస్ జయంతికి సోనియాగాంధీ ఇడుపులపాయ వస్తారనే వార్తలు నిజం కాకపోవడంతో ఈ కథలు కూడా తేలిపోయినట్టే. సీనియర్ నాయకుడు కెవిపి రామచంద్రరావు వంటివారు కూడా బలపర్చిన ఈ కథనం ఎందుకు విఫలమైందో లేక మరేదైనా మార్పువుందో చూడవలసిందే. అయినా ఆమె ప్రభావం చాలా పరిమితమే అన్నది ఒకటైతే, పాలేరులో పోటీపైనే దృష్టి పెట్టే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది. తెలంగాణలో టీడీపీ, జనసేనలతో పొత్తు ప్రసక్తి లేదని కూడా బీజేపీ ప్రకటించింది.

చివరగా ప్రధాని మోడీ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ మరోసారి ఆయనపై విమర్శలు సంధించారు. ఈపర్యటనలో అధికారిక కార్యక్రమాలలో కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనలేదు. బహిష్కరిస్తున్నట్టు ఆపార్టీ ప్రకటించింది. తమ పార్టీ సభల్లో ప్రధాని కేసీఆర్ ప్రభుత్వం అవినీతి మయమని తీవ్రంగా దాడి చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్, మహారాష్ట్ర సభలలోనూ ఆయన కేసీఆర్ కుటుంబ అవినీతి ఆరోపణలంటూ ప్రస్తావించారు. అవినీతి కోసమే ఢిల్లీ తెలంగాణ ప్రభుత్వాలు సహకరించుకుంటున్నాయని ఆప్‌ను కూడా రంగంలోకి తెచ్చారు. ప్రతిపక్షాల జాతీయ సమావేశం జరగనున్న నేపథ్యంలోనే మోడీ ఇవన్నీ మాట్లాడారనేది స్పష్టమే. ఒక విధంగా ఇది బీఆర్ఎస్ వారితో కలిసివున్నట్టు కాంగ్రెస్ చేసే ఆరోపణకు సమాధానం కూడా. మోడీతో పాటు సభలో పాల్గొన్న నేతలు కూడా బీఆర్ఎస్‌తో కలిసే ప్రసక్తిలేదని మరీ మరీ చెప్పారు. ఈ విధంగా తెలంగాణ రాజకీయ దృశ్యం మళ్లీ యథాస్థితికి వచ్చినట్టే. కానీ కాంగ్రెస్ మాత్రం తన ఆరోపణ కొనసాగిస్తుంటే బీఆర్ఎస్ ఈ ఉభయులనూ కలిపి ఖండిస్తున్నది. శాసనసభ ఎన్నికలు సమీపించిన సమయంలో బీజేపీ అంతర్గత సంక్షోభంలో చిక్కుకోవడం ముందే ఓటమిని అంగీకరించిన చందంగా ఉంది. అయినా తామే గెలుస్తామని హడావుడి సాగిస్తూనే ఉంది. కాంగ్రెస్ దూకుడు పెరిగినా విజయం సాధించేస్థాయిలో ఉందా అనేది ప్రశ్నార్థకమే. ఇక బీఆర్ఎస్ తాజా పరిణామాల దృష్ట్యా ఏ విధమైన కార్యాచరణ స్పష్టత ఇస్తుందోనని పరిశీలకులు గమనిస్తున్నారు. ఏపీలో బీజేపీ ప్రభావం నామమాత్రమైనా మూడు ప్రాంతీయ పార్టీలూ అనుకూలంగానే ఉన్నందున ఎలాంటి రాజకీయ యుక్తులకు పాల్పడుతుందనే విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎన్నికల్లో తాము వంటరిగానే పోటీ చేస్తామని ఎప్పటిలాగే వైసీపీ చెబుతున్నా ఇతర కోణాలు చూడవలసిందే. ఇవన్నీ ఒకటైతే ముందస్తు లేదా జమిలి ఎన్నికలంటూ బీజేపీ సృష్టించే సందేహాలు కూడా అస్పష్టత పెంచుతున్నాయి. ఈ మొత్తం కమలం కమాల్ ఇప్పట్లో తేలదేమో. ■

పశ్చాత్తాపం!

"ఏంతైనా ఈ దేశానికి దిశా నిర్దేశం చేయగలదమ్మున్న లీడర్ మా పెద్దాయన ఒక్కడే. ఆయనకు ఆయనే సాటి!" అన్నాడు పుష్పరాజ్.

"మీ పెద్దాయన కొత్తగా ఏం చేశాడు?" ఆశ్చర్యంగా అడిగాడు కనకరాజ్.

"మా పెద్దాయన కొత్తగా ఏమీ చేయలేదు అనుకుంటున్నావా? ఇప్పటికి చేసినవే ఎన్నో ఉన్నాయి! వాటిని అమలు చేయటమే మన బాధ్యత! ఒక నేషనల్ హైవేనే వేశాడు. ఆ మార్గంలో పయనించటమే మనం చేయాల్సిన పని!" అన్నాడు పుష్పరాజ్.

"ముందు ఆ ఘనకార్యం ఏమిటో చెప్పవయ్యా!" విసుగ్గా అన్నాడు కనకరాజ్.

"బాధితుల కాళ్ళు కడగటం అనే గొప్ప సంప్రదాయాన్ని మనకు పరిచయం చేసింది పెద్దాయనే కదా!" ఒక ప్రధానమంత్రి స్థాయిలో ఉండి మున్సిపల్ కార్మికుల కాళ్ళు కడిగి ఒక మహోన్నత సంప్రదాయాన్ని నెలకొల్పాడు కదా!" అన్నాడు పుష్పరాజ్ గర్వంగా.

"ఆ ఘనకార్యం ఎప్పుడో ముగిసింది కదా! మళ్ళీ ఇప్పుడు ఎందుకు తవ్వుకుని వచ్చావు!" అన్నాడు చిరాగ్గా కనకరాజ్.

"ఎందుకంటే ఆ మహోన్నత సంప్రదాయాన్ని మా పార్టీకి చెందిన మరో నాయకుడు కొనసాగిస్తున్నాడు. మూత్రం పోయబడిన గిరిజనుడిని తన స్వగృహానికి పిలిచి, ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి కూడా కాళ్ళు కడిగిన శివరాజ్‌సింగ్ చౌహాన్‌ది ఎంత విశాల హృదయమై ఉండాలో ఆలోచించావా?" తన్మయత్వంతో అడిగాడు పుష్పరాజ్.

"మొన్న ఆ గిరిజనుడిపై మూత్రం పోసింది మీ పార్టీ లీడరే కదా! ఆ విషయం చెప్పకుండా కాళ్ళు కడిగిన సంగతే చెబుతావేం?" అన్నాడు కనకరాజ్.

"మూత్రం పోసినవాడి సంగతి కాసేపు పక్కనపెట్టు! ఆ సంఘటన జరగకపోతే ఆ గిరిజనుడి గురించి ఎవరికైనా తెలిసేదేనా? వాడి జీవితానికి ఎప్పుడైనా ముఖ్యమంత్రి చేత కాళ్ళు కడిగించుకునే భాగ్యం పట్టేదేనా. ముఖ్యమంత్రే చెప్పినట్లు ఆ గిరిజనుడు సుధాముడంతటి వాడు అయ్యాడు తెలుసా?" గొప్పగా అన్నాడు పుష్పరాజ్.

"అంటే కాళ్ళు కడిగిన వాడు కృష్ణుడా?" అడిగాడు కనకరాజ్.

"అందుకు సందేహమా?" తిరిగి అడిగాడు పుష్పరాజ్.

"ఇంతకూ చెప్పదలుచుకున్నదేమిటీ సూటిగా చెప్పు" అడిగాడు కనకరాజ్.

"ఆ సంఘటన జరగటం ఆ గిరిజనుడి అదృష్టం అంటున్నాను!" పుష్పరాజ్ సమాధానమిచ్చాడు.

"అంటే దుర్మార్గం చేసిన వాడిని సమర్థిస్తున్నావా? పదే పదే గిరిజనుడిని అదృష్టవంతుడని అంటున్నావు!" ఆశ్చర్యంగా అడిగాడు కనకరాజ్.

"దుర్మార్గం చేసిన వాడి ఇల్లు బుల్డోజర్‌తో కూలగొట్టించాము. గిరిజనుడి కాళ్ళు స్వయంగా ముఖ్యమంత్రే కడిగాడు. ఇంకేమి కావాలి?" అన్నాడు కనకరాజ్.

"చేసిన గొప్పపని కూడా చెప్పుకోరాదా? మీరింతే ఈ దేశానికి పట్టిన చీడపురుగులు!" అన్నాడు పుష్పరాజ్.

"చీడ పురుగులు ఎవరో తెలుస్తూనే



ఉంది. సాటి మనిసిని గౌరవించలేని సంస్కారం మీది. గిరిజనుడన్న చిన్నచూపే ఆ పని చేయించింది. అదే పని అగ్రవర్ణాల వారు రేప్ చేసినా శిక్షించరాదన్న మనువాదం నిండిన మనుషులు మీరు! తప్పు చేయటం మీ వంతే, దాన్ని సమర్థించుకోవటమూ మీ వంతే! ఇదేనా మీ గొప్ప సంప్రదాయం!" తీవ్రంగా ప్రశ్నించాడు కనకరాజ్.

"చేసిన తప్పుకు పశ్చాత్తాపంగానే కాళ్ళు కడిగాము కదా!" అన్నాడు పుష్పరాజ్.

"మీరు చేసిన తప్పు కాళ్ళు కడిగితే పోయేటంత చిన్నది కాదు! మనుషుల మెదళ్ళను ఖరాబు చేశారు! అంతరాలు మానవ నిర్మితాలేనని ఎందరో పెద్దలు చెప్పారు. కాని ఆ తారతమ్యాలు స్మృతిబద్ధమని, నిచ్చెన మెట్ల వ్యవస్థే ఈ సమాజపు అసలు రూపమంటూ మీరు కొన్ని శతాబ్దాలుగా చేసిన ప్రచారం ఈ దేశ ప్రజల మెదళ్ళను కలుషితం చేసింది. హరిజనులు, గిరిజనులు హీనజాతి వారని, వారిపై ఏ అఘాయిత్యం చేసినా చెల్లుబాటయ్యే విధంగా సిద్ధాంతాలు నూరిపోస్తున్నది మీ పార్టీయే, అందుకే సమాజంలో మీరు బలపడుతున్న కొద్దీ, ఇలాంటి సంఘటనలు పెరుగుతున్నాయి!" అన్నాడు కనకరాజ్.

"ఇంత చెబుతున్నావు! బుల్డోజర్‌తో వాడి ఇల్లు కూలగొట్టి శిక్షించిన సంగతి మాట్లాడవే?" రోషంగా ప్రశ్నించాడు పుష్పరాజ్.

నజర్

"ఇల్లు కూలగొట్టడం అంటే వాడిని శిక్షించటమా? మరి ఉన్న మాటలేనా. నా కొడుకు తప్పుచేస్తే వాడికి ఉరిశిక్ష వేయండి! కాని నా కష్టార్జితంతో కట్టుకున్న నా ఇల్లు కూల్చితే నెనెక్కడుండాలి! అని ఆ తండ్రి పడ్డగోస మీకు అర్థం కాలేదా? గాయం ఒక చోట ఉంటే మందు మరోచోట రాస్తారా?" అన్నాడు కనకరాజ్.

"వాడి మీద పోలీస్ కేసు పెట్టాం కదా!" అన్నాడు పుష్పరాజ్.

"పోలీస్ కేసు పెట్టారు సరే! ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారా? అంత దుర్మార్గపు ఆలోచనకు కారణమైన భావజాలం, వాట్సప్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా వెదజల్లుతున్న మీపై ఎవరు కేసులు పెట్టాలి? మీరే అధికారం వెలగబెడుతున్నారు కదా? ఆ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న మీకు ఆ అర్హత ఉందా? మీ మనువాద భావజాలంతో ఈ దేశంలో మనుషులంతా సమానమే అన్న ఆలోచన చచ్చిపోయింది! మీకు నిజంగా పశ్చాత్తాపడే గుణమే ఉంటే, మీరు వెదజల్లుతున్న భావజాలమే ఈ దుశ్చర్యలన్నింటికీ ఏకైక కారణం! అందుకు సిగ్గుపడండి!" అన్నాడు కనకరాజ్.

పుష్పరాజ్ నిజమైన పశ్చాత్తాపంతో తలదించుకున్నాడు.

- ఉషాకిరణ్.

తిరగబడ్డ వాట్సాప్ వర్సిటీ

పాలుపోసి, పెంచి పోషించిన వ్యక్తిని చివరకు ఆ పామే కాటేసి చంపినట్టు...తన రాజకీయ లబ్ది కోసం బీజేపీ సృష్టించిన వాట్సాప్ యూనివర్సిటీ స్టూడెంట్స్ ఇప్పుడు బీజేపీ నేతలపైనే తమ పోస్టుల ద్వారా ఎదురుదాడికి దిగుతున్నారు. నేతల సైన్యాలుగా మారి రచ్చ చేస్తున్నరు. 'రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే' అని పాట పాడుతున్నరు. 'బండి సంజయ్ పదవి పీకేయించిన తర్వాత కండ్లు చల్లబడ్డయా?' అంటూ అసమ్మతి రాగం ఎత్తుకున్నరు. 'బీజేపీ నడ్డి విరిసిన నడ్డా.. 'ఐపాయే..ఆ ఊపు ఉండదిక' అంటూ రివర్స్ పంచ్‌లేస్తున్నరు. 'గతంలో కిషన్‌రెడ్డి అధ్యక్షునిగా ఉన్నాడు. అప్పుడు బీజేపీ గ్రాఫ్ పెద్దగా ఏం లేదు' అంటూ హార్డ్‌కోర్ బీజేపీ కార్యకర్తలే తమ వాట్సాప్, ఫేస్‌బుక్ పోస్టులు పెడుతున్నారు. మరోవైపు 'అయ్యో బాలి..అయ్యో బాలి', 'చాలు బండి..సెలవు బండి' అని మరికొందరు రచ్చ చేస్తున్నారు. తాము వదిలిన బాణాలే రివర్స్ అయ్యి గుచ్చుకుంటుండటంతో నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇన్నాళ్లు తప్పుడు, అసత్య ప్రచారాలతో కూడిన పోస్టులు పెట్టి మరీ ప్రజల మెదళ్ళను విద్వేషపూరితం చేసిన విద్యార్థులను నేతలు వద్దురయ్యా అని బతిమిలాడుకోవాల్సి వస్తున్నది. 'అలాంటి పోస్టులు పెట్టకండి ప్లీజ్.. మేమంతా కలిసే ఉన్నాం' అంటూ బండి సంజయ్ చేతులెత్తి దండంపెట్టినా ఆ పోస్టులు మాత్రం ఆగడం లేదు. ఇప్పటికే 'ఊరు ఉసిరికాయంత..తగువు తాటికాయంత' అన్నట్టుగా బీజేపీ పరిస్థితి ఉంది. ఈ పోస్టులతో నేతల మధ్య అగ్గి మరింత రాజుకుంటున్నది. 'చెడపకురా...చెడదవు' అని పెద్దలు ఊరికే అనలేదు సుమా!

- అచ్చిన ప్రశాంత్

రిపోర్టర్స్ డైరీ

కోటి డాలర్ల ప్రశ్న

ప్రభుత్వం అన్నాక అనేక లక్ష్మణరేఖలు ఉంటాయి. ప్రధాని అన్నాక పార్టీతో సంబంధం లేకుండా అందర్నీ సమదృష్టితో చూడాలి. రాజ్యాంగ నిర్దేశం కూడా అదే. వరంగల్ వ్యాగన్ రిపేరు ఫ్యాక్టరీ శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోడీ తాను మాత్రం బీజేపీ కార్యకర్తగా ఇక్కడికి వచ్చానంటూ నొక్కివక్కాణించారు. మరి పార్టీ కార్యకర్తగా వచ్చిన పెద్దమనిషి శంకుస్థాపనలు ఎలా చేశారనేదే కోటి డాలర్ల ప్రశ్న. ఢిల్లీ నుంచి మందీమార్బలంతో బయల్దేరి వచ్చిన ఆయన ఖర్చును ప్రభుత్వం భరించిందా...లేక కమలం భరించిందో తెలియాలి. ఇక ఆ మీటింగ్‌లో బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ తాను పార్టీ విధేయుడినని ప్రకటించుకొనేందుకు నానా తంటాలు పడ్డారు. తనను ఎందుకు తప్పించారో చెప్పండంటూ పరోక్షంగా అదే వేదికపై ఉన్న నడ్డాను, మోడీని అడగకనే అడిగినట్టు మాట్లాడారు. పార్టీ పాత, కొత్త కాపు కిషన్‌రెడ్డి కూడా తాను సీఎం కేసీఆర్‌కు దగ్గరేం కాదు అనిపించుకొనే ప్రయత్నం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి అనేక ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఒకే గాటన కట్టేసే ప్రయత్నం చేశారు. ఏంటో కూటికోసం కోటి తిప్పలు అని విన్నాం కానీ...పదవి, అధికారం కోసం ఈ పడరాని పాట్లు ఏంటో ఓ పట్టాన అర్థమైసావట్లే!!

-ఎస్ఎస్ఆర్ శాస్త్రి

చదువరులే కానీ...

పుస్తకాలు కొనేందుకు ఓ ప్రముఖ పుస్తక విక్రేయ కేంద్రానికి వెళ్లాను. పుస్తకాల దుకాణాన్ని కలియ చూసిన తర్వాత కొన్ని కథల పుస్తకాలు కొన్నాను. ఈ సందర్భంగా నేను ఒక జర్నలిస్టుగా కొన్ని విషయాలు తెలుసుకోవాలనే కుతూహలంతో పుస్తక విక్రేయ కేంద్రం నిర్వహకుడిని కొన్ని ప్రశ్నలు అడిగాను. అందులో ముఖ్యమైన ప్రశ్న ఏదంటే, ప్రతి ఒక్కరి దగ్గరా సెల్‌ఫోన్లు, యూట్యూబ్, గూగుల్ తల్లి ఉన్న కాలంలో పుస్తకాలు కొనడం, చదవడం తగ్గిపోయాయి కదా? 'అన్నాను'. లేదు మీ అవగాహన తప్పు. ఇటీవల కాలంలో పుస్తకాలు కొనడం, చదవడం విపరీతంగా పెరిగిందని చెప్పారు. అదేందండీ గిరాకీ లేక పుస్తకాలు షాపులు వెలవెలబోతున్నది వాస్తవం కదా? అని ప్రశ్నించగా, మారుతున్న పరిస్థితుల్లో జీవితాలు అభద్రతకు లోనవుతున్నాయి. ఈ నేపథ్యంలో సిద్ధాంత గ్రంధాలు చదవడం లేదు. కానీ డబ్బు సంపాదించడం ఎలా? విజయానికి ఏడు మెట్లు, ప్రశాంత జీవితం గడపడం ఎలా?, ఆరోగ్య సూత్రాలు, మెదడుకు మేత, వారం రోజుల్లో ఇంగ్లీష్, హిందీ నేర్చుకోవడమెలా?డబ్బు సంపాదించే మానసిక వికాసాన్ని పెంపొందించు కునేందుకు ఎక్కువగా కొంటున్నారు. మా వద్ద అవి ఎక్కువగా అమ్ముడుపోతున్నాయని తెలిపారు. పుస్తక పాఠకుల గురించి ఆయనే చెబుతూ...'తన చిన్నతనంలో స్వతంత్ర సమరయోధుల జీవితం చరిత్రలు, రష్యాను ప్రభావితం చేసిన అమ్మ నవల, దేశ చరిత్రను తెలుసుకునేందుకు ఎక్కువ పుస్తకాలు కొని చదివేవారు. తద్వారా రాజకీయ అవగాహన పెంచుకుని విద్యార్థి సంఘాల్లో చేరేవారు. ఈనాటి విద్యార్థులు, యువకులు మానసిక ఆందోళనలను తగ్గించుకునేందుకు చదువుతున్నారు. రాజకీయాలంటే మనకు సంబంధం లేదనే తీరుతో విద్యార్థులు వ్యవహరిస్తున్నారు. విద్యార్థి సంఘాలకు, రాజకీయ దూరంగా ఉంటూ...సమాజం ఎటుపోతే నాకేంటి? అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. తమ సమస్యను తాను పరిష్కరించుకోలేక ఆగమాగవు తున్నారు'. అని విశ్లేషించారు. చివరకు ఆయనే బాంబు పేల్చుతూ...అనీ అత్రుతో కొంటారండీ. ఒకట్రెండు పేజీలు తిప్పేసి మూలనపడేస్తారు. దుమ్మూధూళి పట్టాకా పాత పుస్తకాలోళ్లకు అమ్ముతున్నారు. అని సమాజ వాస్తవ పరిస్థితిని కండ్లకు కొట్టినట్టు చూపించారు. చివరకు ఆయన చెప్పిందంతా నిజమే కదా అనిపించింది.

-ఆర్. రఘు

బెంగళూరుకు చెందిన మేఘనా నారాయణన్ వయసు 18 ఏండ్లు మాత్రమే. అయినా అట్టడుగు ప్రజల కష్టాల గురించి ఆలోచిస్తున్నది. దానికోసమే 'అభయ' అనే ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. తద్వారా అట్టడుగు వర్గాలకు ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను అందుబాటులోకి తెచ్చింది. పేదల ఆర్థిక భారాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఆమె ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇటీవల ఎన్‌డీటీవీతో తన వ్యక్తిగత అనుభవం నుంచి ఈ అభయ ఎలా పుట్టు కొచ్చిందో వివరించింది. ఆ విశేషాలు నేటి మానవిలో...



అట్టడుగు ప్రజలకు మేఘన అభయం



మేఘన ప్రాజెక్ట్ అభయ ఇప్పుడు ఎంతో గుర్తింపు పొందింది. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఆమె న్యూయార్క్‌లో మూడు రోజుల ఇమ్మర్షన్‌లో పాల్గొంది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో వార్షిక 1M1B యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో తన ప్రాజెక్ట్ గురించి వివరించే అవకాశాన్ని కూడా పొందింది. భారతదేశంలోని వివిధ తెగలు, జాతు, భాషా, మైనారిటీలు, వైకల్యాలున్న వ్యక్తులు, వలసదారులు, మారుమూల ప్రాంతాల్లో నివసించే జనాభా, లింగం, లైంగికత గురించి శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని కూడా అభయ నొక్కి చెబుతున్నది. ప్రస్తుత కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో కరోనవైరస్ ఇన్‌ఫెక్షన్, ఇతర వ్యాధులను నివారించడానికి హ్యాండ్‌వాష్ చేయడం ఒక మార్గం కాబట్టి వాష్ (నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత) అవసరం కూడా ప్రచారం చేసింది.

అవగాహన పెంచడానికి

మహిళలు, పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యత, పోషకాహార లోపం, మానసిక క్షేమం, స్వీయ సంరక్షణ, సైన్స్, ఆరోగ్యం, కౌమార ఆరోగ్యం, లింగ అవగాహన వంటి వాటిపై దృష్టి సారించడంతో పాటు వీటిపై అవగాహన పెంచడానికి అభయ ప్రచారం కొనసాగుతున్నది. ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ ప్రచారం గుర్తించింది.

మానవ మనుగడకు ప్రమాదం

మన పర్యావరణం బాగా దెబ్బతుంటుంది. ఇది వనరులను అతిగా వాడుకోవడమే కాకుండా, ఆ వనరులను ఉపయోగించడం, వెలికితీసే ప్రక్రియలో అపారమైన కాలుష్యాన్ని కూడా సృష్టిస్తుంది. ఈ అసమతుల్యత జీవవైవిధ్య నష్టానికి దారితీసింది. ఇది మానవ మనుగడకు అతిపెద్ద ముప్పుగా మారింది. వాయు కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం, మాన్యువల్ స్కావెంజింగ్, పారిశుద్ధ్య కార్మికులు, రుతుస్రావ పరిశుభ్రత వంటి సమస్యలను కవర్ చేయడానికి కూడా అభయ ప్రచారం చేస్తున్నది.

ప్రాజెక్ట్ అభయ ఆధ్వర్యంలో పేదలకు మరిన్ని సేవలు అందించాలనే ఉద్దేశంతో మేఘన నిరుపేద మహిళల కోసం కృషి చేసే సుచరిత అనే ఎన్‌జీఓతో భాగస్వామి అయ్యింది. మరింత మంది లబ్ధిదారుల నమోదుకు ఇది సహాయపడింది. బెంగళూరు ఆధారిత సంస్థ 1M1B (1 మిలియన్ కోసం 1 బిలియన్) ఫ్యూచర్ లీడర్స్ ప్రోగ్రామ్‌లో నమోదు చేసుకుంది. 1M1B అనేది ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన ఎన్‌జీఓ. ఇది 1 బిలియన్ జనాభాకు సహాయం చేయగల 10,00,000 మంది నాయకులను తయారు చేయడానికి పని చేస్తుంది. ఇది యువతను ఎక్కువగా ప్రోత్సహిస్తుంది.



ఇంత చిన్న వయసులో ఇలాంటి ఆలోచన ఎలా వచ్చింది?

మా అపార్ట్‌మెంట్‌లో పనిచేసే మాలా అనే గృహకార్మికురాలి భర్త మెదడు దెబ్బతినడంతో ఆస్పత్రిలో చేరాడు. పేదరికంతో వారు సరైన వైద్యం చేయించుకోలేకపోయారు. ఈ సంఘటనే మన దేశంలో పేదల బీమా పాలసీల స్థితిగతుల గురించి పరిశోధన చేయడానికి నన్ను పురికొల్పింది. భారతదేశంలోని 90 శాతం మంది పేదలకు జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు అందుబాటులో లేవు. దాని వల్ల వైద్యం పొందలేకపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకే 'అభయ'ను ప్రారంభించాను.

మీ ప్రాజెక్ట్ ఎవరి కోసం పని చేస్తుంది?

ప్రధానంగా రోజువారీ వేతన కార్మికులు, గృహ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రజలందరి కోసం పని చేస్తున్నది.

మీ యాక్షన్ ప్లాన్ ఏమిటి?

ముందు నా పని జీవిత బీమాతో ప్రారంభించాను. ఇప్పుడు ప్రభుత్వ బీమా పాలసీల గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తాను. అంతేకాకుండా జీవిత, వైకల్య బీమా పాలసీలను కూడా గుర్తించాను. వాటి కింద దాదాపు 105 మంది గృహ కార్మికులను చేర్చుకున్నాను. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ఆరోగ్య బీమా పాలసీలపై కూడా దృష్టి సారించాను. ఆంధ్రప్రదేశ్‌లోని లక్కవరం ప్రాంతంలో టైలరింగ్ యూనిట్‌లో పనిచేస్తున్న పలువురు మహిళలకు బీమా చేశాను. దాదాపు 259 మంది పారిశుధ్య కార్మికుల కోసం కోవిడ్-19 బీమా కోసం డబ్బును సేకరించాను.

ప్రభుత్వ బీమా పాలసీలకు, అభయకు తేడా ఏమన్నా ఉందా?

ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పథకాలు చాలా సమగ్రమైనవి, అనేక రకాల సమస్యలను కవర్ చేస్తాయి. కానీ ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే ఈ పథకాలను పొందేందుకు నిరుపేద ప్రజలకు అవగాహన, అక్షరాస్యత లేకపోవడం. ప్రాజెక్ట్ అభయ ద్వారా నేను బీమా సంబంధిత అవగాహన సెషన్‌లను నిర్వహిస్తున్నాను. ఈ స్కీమ్‌లలో వాళ్ళ పేర్లు నమోదు చేయిస్తాను. దీనికోసం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో కలిసి పని చేస్తున్నాను.

అభయ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి?

దేశంలోని వివిధ ప్రాంతాలలో బహుళ బృందాలను నిర్మించాలనుకుంటున్నాను. ప్రతి బృందం అఖిల భారత, రాష్ట్ర నిర్దిష్ట బీమా పాలసీలను పొందడంపై దృష్టి సారిస్తుంది. లబ్ధిదారులతో సన్నిహితంగా పనిచేసే మరిన్ని ఎన్‌జీఓలు, సంస్థలతో భాగస్వామిగా ఉండాలనుకుంటున్నాను. ఇది అభయ భౌగోళిక విస్తరణలో సహాయపడుతుంది. అలాగే ప్రాజెక్ట్‌ను కొనసాగించడంలో కూడా సహాయపడుతుంది.

లెదర్ వస్తువులను కాపాడుకోండిలా...

లెదర్ అంటే ఇష్టపడని వారుండరు... బ్యాగ్స్, జాకెట్స్, షూస్ ఇలా... చాలా రకాల వస్తువులు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఉపయోగించేప్పుడు చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. అయితే వర్షాకాలంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే అవి పాడైపోతాయి. ఎక్కువ ధర పెట్టి కొన్న లెదర్ వస్తువులు పాడైపోతే చాలా బాధగా ఉంటుంది. వర్షాకాలంలో ఏ సమయంలో వాన పడుతుందో తెలియదు. కాబట్టి ముందుగానే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటిని పాడవకుండా కాపాడుకోవచ్చు.

పాలిష్ : లెదర్ జాకెట్, లెదర్ షూస్ ధరించాలనుకున్నా లేదా లెదర్ బ్యాగ్ వెంట తీసుకెళ్లాలనుకున్నా దానికి కాస్త పాలిష్ చేయడం మంచిది. దీని కోసం వెజిటబుల్ ఆయిల్ లేదా వ్యాక్స్‌తో తయారైన పాలిష్ ఉపయోగించాలి. ఇది లెదర్ బ్యాగ్‌ను మెరిసేలా చేస్తుంది. అలాగే వాన నీరు బ్యాగ్‌పై నిలవకుండా చేస్తుంది. దాంతో బ్యాగ్ పాడవకుండా ఉంటుంది.

పూర్తిగా ఆరేలా : లెదర్ వస్తువులు తడిచినప్పుడు వాటిని వీలైనంత త్వరగా ఆరేలా చూసుకోవాలి. లేదంటే దాని మీద ఫంగస్ పెరిగి పాడైపోతాయి. బ్యాగ్ పైన ఆరితే సరిపోదు. లోపల కూడా తడి లేకుండా చూసుకోవాలి. కాబట్టి బ్యాగ్ లోపల న్యూస్ పేపర్లు పెట్టి బ్యాగును ఫ్యాను కింద ఉంచితే లోపల, బయట పూర్తిగా డ్రైగా మారిపోతుంది.

దుమ్ము చేరకుండా : వర్షాకాలంలో గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. మనం ఉపయోగించే వస్తువులు సైతం కాస్త చెమ్మగా ఉన్నట్టనిపిస్తాయి. ఈ తడికి దుమ్ము, ధూళి తోడైతే లెదర్ బ్యాగులు చాలా త్వరగా పాడయ్యే అవకాశాలుంటాయి. కాబట్టి వర్షాకాలంలో లెదర్ వస్తువులు తీసుకుని బయటకు వెళ్లి.. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత వాటిని శుభ్రం చేయడం మరచిపోవద్దు. వర్షం కురిసినా, కురవకపోయినా మెత్తటి బ్రష్ లేదా వస్త్రంతో బ్యాగ్‌ను తుడిచి పెట్టుకోండి.

వేడికి దూరంగా : త్వరగా ఆరిపోతాయి కదా.. అని లెదర్ వస్తువులను ఎండలో మాత్రం ఆరేయద్దు. ఇలా చేయడం వల్ల అవి ఆరడం ఎలా ఉన్నప్పటికీ పూర్తిగా నాశనమైపోతాయి. ఎండలోనే కాదు హీటర్, బ్లో డ్రయర్ లేదా ఐరన్ బాక్స్ వంటివి ఉపయోగించి కూడా ఆరబెట్టడానికి ప్రయత్నించవద్దు. వీటి వల్ల అవి నిర్జీవంగా మారిపోతాయి. అంతేకాదు ఈ వస్తువుల మన్నిక కాలం తగ్గిపోయేలా చేస్తాయి.



నేడు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు.మహంకాళి దేవాలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. దేవాలయం మొత్తం విద్యుత్ దీపాలు, పువ్వులు, పండ్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. దేవాలయం చుట్టు పక్కల ప్రాంతాల్లో స్వాగత తోరణాలు, విద్యుత్ దీపాలు పెట్టారు. ఆదివారం ఉదయం 3.30 గంటలకు అమ్మవారికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సమేతంగా తొలిపూజ నిర్వహించనున్నారు. అనంతరం హారతిలో పాల్గొంటారు. 4.15 నిమిషాలకు సందర్శకులు దర్శనం చేసుకునేందుకు అనుమతిస్తారు.

6 లైన్లు ఏర్పాటు

బోనాల జాతరకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా 6 లైన్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి పాత రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్, మరొకటి బాటా వైపు నుంచి ఏర్పాటు చేశారు. అలాగే పాత రాంగోపాల్‌పేట్ వైపు ఒకటి సాధారణ ప్రజలకు, టొబాకో బజార్ నుంచి దాతల కోసం, అంజలీ థియేటర్ నుంచి వీఐపీ పాస్‌లతో వచ్చే వారికి ఒకటి, సాధారణ ప్రజల కోసం మరో లైన్ ఏర్పాటు చేశారు. వీవీఐపీలు మాత్రం దేవాలయంలోకి నేరుగా వస్తారు. అమ్మవారిని దర్శించుకున్న తర్వాత భయటకు వెళ్లేందుకు గతంలో మూడు గేట్లు ఉండగా.. ఈ ఏడాది అదనంగా మరొక గేటు ఏర్పాటు చేశారు. దేవాలయం చుట్టు పక్కల 6 చోట్ల మంచినీటి శిబిరాలు ఏర్పాటు చేసి అందించనున్నారు. 7 లక్షల వాటర్ ప్యాకెట్లతో పాటు 250 ఎంఎల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేయనున్నారు. మహంకాళి పోలీస్ స్టేషన్, బొమ్మన బ్రదర్స్, సోలాపూర్ స్వీట్ హౌజ్ ప్రాంతంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఉండి మందులు ఉచితంగా అందిస్తారు.

బీబీసీ, వికీమీడియాలకు సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉన్నదని బీజేపీ నాయకుడు తన ఫిర్యాదులో ఆరోపించారు. వికీమీడియా ఫౌండేషన్ వికీపీడియా వెబ్‌సైట్‌కు నిధులు సమకూరుస్తుంది. వికీమీడియా, ఇంటర్నెట్ ఆర్కైవ్ రెండూ అమెరికన్ కంపెనీలు. బీబీసీ ఒక బ్రిటిష్ మీడియా సంస్థ. ఈ ఏడాది మే 3న కోర్టు మొదట సమన్లు జారీ చేసినప్పుడు.. యూఎస్, యూకేలలో ఉన్న రెండు విదేశీ సంస్థల న్యాయవాదులు తమపై పరువునష్టం కేసును డీల్ చేసే అధికారం లేదని చెప్పారు. హేగ్ కన్వెన్షన్, భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. విదేశీ దేశాలలో సమన్లు లేదా నోటీసులు న్యాయ వ్యవహారాల శాఖ, న్యాయ మరియు న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా మాత్రమే అమలు చేయబడతాయని అదనపు జిల్లా జడ్జి రుచికా సింగ్లా వివరించినట్టు సమాచారం. అందువల్ల, రెండూ విదేశీ సంస్థలు అని గుర్తించిన తర్వాత కేంద్ర న్యాయ, న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా తాజా సమన్లు జారీ చేయబడ్డాయి. బీబీసీ రెండు భాగాల డాక్యుమెంటరీ ' ఇండియా: ది మోడీ క్వశ్చన్' మొదటి ఎపిసోడ్‌ను ఈ ఏడాది జనవరి 17న విడుదల చేసిన విషయం విదితమే. 2002 గుజరాత్ అల్లర్లలో మోడీ పాత్ర గురించి ఇందులో చూపించారు.

బెంగాల్ పంచాయతీ హింసాత్మకం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలోని దిన్‌హటాలో అల్లరి మూకలు బ్యాలెట్ బాక్సులను అపహరించారు. బరవిత ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ పత్రాలకు నిప్పుపెట్టారు. బర్నాచినాలోని పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తూ స్థానికులు బ్యాలెట్ బాక్సుకు, బ్యాలెట్ పత్రాలకు నిప్పంటించారు. సింద్రానిలో కొందరు దుండడుగు బ్యాలెట్ బాక్సులో నీరు పోశారు. బీజేపీ, తృణమూల్ మద్దతుదారుల మధ్య ఘర్షణలు జరగడంతో ముర్షీదాబాద్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ నిలిచిపోయింది.

మాల్దా జిల్లా ఇంగ్లీష్ బజార్‌లోని రెండు పోలింగ్ కేంద్రాలపై అల్లరి మూకలు బాంబులు విసిరారు. అదనపు కేంద్ర బలగాలను మోహరించాలని డిమాండ్ చేస్తూ పలు ప్రాంతాలలో ప్రదర్శనలు జరిగాయి. నందిగ్రామ్‌లో కేంద్ర బలగాలను నియమించాలని కోరుతూ మహిళా ఓటర్లు పోలీస్ అధికారిని ఘెరావ్ చేశారు. రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఉత్తర 24 పరగణాల జిల్లాలోని పలు ప్రాంతాలను సందర్శించి అల్లర్లలో గాయపడిన వారిని పరామర్శించారు. 'ప్రజలు నా కాన్వాయ్‌ని ఆపారు. తమను పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లకుండా గూండాలు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. హింసాకాండలో కొందరు చనిపోయారని చెప్పారు. తమ గోదును ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు' అని ఆయన చెప్పారు.

సీపీఐ (ఎం) కార్యకర్త మృతి

బర్ధమాన్ జిల్లా ఆష్‌గ్రామ్ బ్లాక్‌లో తృణమూల్ గూండాలు జరిపిన దాడిలో సీపీఐ (ఎం) కార్యకర్త రజీబుల్ హక్ ప్రాణాలు కోల్పోయారు. దాడిలో తీవ్రంగా గాయపడిన హక్‌ను ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయారు. తెరిచి ఉన్న బ్యాలెట్ బాక్సులు, పత్రాలు రోడ్డుపై పడివున్న దృశ్యాలతో ఉన్న ఓ వీడియోను సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం షేర్ చేశారు. 'ఓటింగ్ అయిపోయింది. కానీ బ్యాలెట్ పత్రాలు, బాక్సులు మాత్రం ఇలా పడి ఉన్నాయి. ఇది డైమండ్ హార్బర్‌లోని పరిస్థితి' అని ఆయన ట్వీట్ చేశారు. స్థానిక ఎన్నికల పోలింగ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించే నేర చరితులను అరెస్ట్ చేయాలని సలీం డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) పనితీరులో పారదర్శకత లోపించిందని ఆయన విమర్శించారు. స్థానిక ఎన్నికలలో 747 జిల్లా పరిషత్ స్థానాలకు, 6,752 పంచాయతీ సమితి స్థానాలకు, 35,411 గ్రామ పంచాయతీ స్థానాలకు సీపీఐ (ఎం)పోటీ చేస్తోంది.

మణిపూర్‌లో చల్లారని హింస

ఇంఫాల్ : ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో అల్లర్లు తగ్గుముఖం పట్టటం లేదు. రాష్ట్రంలో గత 24 గంటల్లో బిష్ణుపూర్, చురచంద్‌పూర్ జిల్లాల మధ్య సరిహద్దు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు సంఘటనలలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒక పోలీసు, మరొక యువకుడు ఉన్నారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించారు. కిందటి రోజు సాయంత్రం అనుమానిత ఉగ్రవాదులతో జరిగిన కాల్పుల్లో పోలీసు మరణించగా, ఉదయం మరో ముగ్గురు మరణించారు. గత రెండు నెలలుగా ఈ రెండు జిల్లాల మధ్య సరిహద్దు ప్రాంతాల్లో హత్యలు, హింస, దహన ఘటనలు పెరిగాయి.ఆర్మీ వర్గాల సమాచారం ప్రకారం.. బిష్ణుపూర్ జిల్లా పరిధిలోని కంగ్వాయ్ ప్రాంతం రెండు వర్గాలకు దగ్గరగా ఉండటంతో అది సున్నితమైన ప్రాంతంగా ఉన్నది. భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో 'బఫర్ జోన్'ను సష్టించాయి. పరిస్థితిని తీవ్రతరం చేయకుండా నిరోధించడానికి భారీ సంఖ్యలో బలగాలు మోహరించాయి. అయితే రెండు వైపుల నుంచి దుండగులు ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకోవడానికి కొండ ప్రాంతాలు, లోయ ప్రాంతాల్లోని గ్రామాల గుండా చొరబడతారు. "శుక్రవారం రాత్రి నుంచి రెండు వైపుల నుంచి ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. ఈ గుంపులు బయటి నుంచి గుమిగూడాయి. తిరిగి వెళ్లాలన్న స్థానికుల అభ్యర్థనకు వారు లొంగలేదు. భద్రతా దళాలు సంయుక్తంగా ప్రతిస్పందించాయి. అయితే, కాంగ్వాయ్, సాంగ్డో, అవాంగ్ లేఖాయ్ గ్రామాల నుంచి స్టాండ్-ఆఫ్ పరిధుల నుంచి ఇరు పక్షాల దుండగులు ఒకరిపై ఒకరు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు మతి చెందడంతో పాటు మరికొందరికి గాయాలయ్యాయి" అని గ్రౌండ్ ఆపరేషన్‌లో పాల్గొన్న సీనియర్ భద్రతా అధికారి తెలిపారు.బలగాలు మోహరించినా రాష్ట్రంలోని కొన్ని చోట్ల పరిస్థితి ఉద్రిక్తంగానే ఉన్నది. కాల్పుల సంఘటనలు నివేదించబడ్డాయి. గత 24 గంటలుగా కొన్ని చోట్ల గుంపులు గుమిగూడడంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, చురచంద్‌పూర్, బిష్ణుపూర్, కక్చింగ్ జిల్లాల్లో దుండగులు, ఉగ్రవాదులు ఏర్పాటు చేసిన 18 అక్రమ బంకర్‌లను శుక్రవారం మణిపూర్ పోలీసులు, కేంద్ర భద్రతా బలగాల సంయుక్త బందం ధ్వంసం చేసింది. గడిచిన 24 గంటల్లో దాదాపు 50 అక్రమ బంకర్లను ధ్వంసం చేశారు. గత 24 గంటల్లో, ఇంఫాల్ తూర్పు జిల్లాలో ఐదు అధునాతన ఆయుధాలు, 74 రకాల మందుగుండు సామగ్రి మరియు ఐదు అత్యంత పేలుడు హ్యాండ్ గ్రెనేడ్‌లు స్వాధీనం చేసుకున్నారు. మణిపూర్‌లోని వివిధ జిల్లాల్లో కొండ, లోయలో సుమారు 126 చెక్‌పాయింట్లు ఏర్పాటు చేశారు.వివిధ జిల్లాల్లో చట్టాలను ఉల్లంఘించినందుకు 270 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రాష్ట్రంలో పరిస్థితి అధ్వాన్నం
మణిపూర్ మాజీ గవర్నర్ ఆందోళన

న్యూఢిల్లీ: మణిపూర్ మాజీ గవర్నర్ గుర్బచన్ జగత్ మణిపూర్‌లో నెలకొన్న అల్లకల్లోల పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఒక వార్తసంస్థతో ఆయన మాట్లాడుతూ.. పంజాబ్, జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాల్లో నెలకొన్న ఘర్షణల కంటే ఈశాన్య రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉన్నదని తెలిపారు. జమ్మూకాశ్మీర్, పంజాబ్‌లో ఐపీఎస్ అధికారిగా ఆయన పని చేశారు. " రాష్ట్రవ్యాప్తంగా పోలీసు స్టేషన్‌లు, పోలీసు ఆయుధాల మీద దాడులు జరిగాయి. వేలాది తుపాకీలు, భారీ మొత్తంలో మందుగుండు సామగ్రిని దోచుకున్నారు. ఇలా జమ్మూకాశ్మీర్, పంజాబ్, ఢిల్లీ, గుజరాత్‌లలో కఠిన సమయాల్లోనూ జరగలేదు. దొంగ ఆయుధాలు రాష్ట్ర భద్రతా దళాలకు సవాలుగా కొనసాగుతాయి" అని ఆయన హెచ్చరించారు.

మోడీ హయాంలో యథేచ్ఛగా హింస

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మితో కలిసి వారు మాట్లాడారు. మోడీ తొమ్మిదేండ్ల పాలనలో మహిళల అభివృద్ధిని మరింత వెనక్కు నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మనిషి బతకటానికి కూడు, గూడు, గుడ్డ కనీస అవసరమని చెప్పారు. పేదల మౌలిక అవసరాలు తీర్చలేని సర్కార్ ఎవరి కోసం పనిచేస్తున్నదని ప్రశ్నించారు. తినటానికి తిండిలేక, సరైన పౌష్ఠికాహారం లేక మహిళలు రోగాలు, నొప్పులు, రక్తహీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార ధాన్యాలను సరఫరా చేయటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆహార భద్రతా చట్టాన్ని అది నిర్వీర్యం చేస్తోందని వాపోయారు. కరోనా కాలంలో ఉచితంగా 5కిలోల బియ్యం ఇచ్చారనీ, ఇప్పుడు అనేక రాష్ట్రాల్లో ఉచిత బియ్యం, గోదుమలు, ఇతర సరుకుల పథాన్ని ఎత్తేశారని వివరించారు. పేదలకు కావాల్సిన కనీస అవసరాలను తీర్చలేని మోడీ ప్రభుత్వం మహిళలు, దళితులు,ఇతర తరగతులపై హింసను ప్రేరేపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషణ్ వ్యవహారంపై అంతపెద్ద పోరాటం జరిగినా ఈ ప్రభుత్వం స్పందించలేదంటే ప్రభుత్వం మహిళల పట్ల ఎంత మొండిగా వ్యవహరిస్తున్నదో అర్థమవుతున్నదని చెప్పారు. మణిపూర్‌లో కుకీలకు, మైటీలకు మధ్య మంటపెట్టింది బీజేపీ సర్కారేనని తెలిపారు. దీంతో అక్కడ ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారనీ, గాయాల పాలవుతున్నారనీ,వేల మంది రోడ్డుపాలయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరి విభజన రాజకీయాల్లో మహిళలు సమిథలవుతున్నారని చెప్పారు. ఈ పాపం బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. మరో పక్క కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులను అత్యంత దారుణంగా హత్య చేస్తున్నారని వివరించారు. మత దురహంకారం వ్యక్తిగత జీవితాన్ని శాసించే స్థితికి దేశంలో వైషమ్యాలు పెరిగాయని చెప్పారు. దేశ ప్రజలు లౌకికత్వం కోసం, సర్వమానవ సమానత్వ ఆకాంక్షతో ఎన్నో ఏండ్లుగా కలిసి బతుకుతున్నారని గుర్తు చేశారు. కానీ.. ఆ వాతావరణాన్ని బీజేపీ కలుశితం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాల్లో ఆధ్యాత్మిక భావాజాలాన్ని జొప్పించటమేగాక, డార్విన్ సిద్ధాంతాన్ని తొలగిస్తున్నారని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతిని సమానత్వం కోసం తీసుకొస్తున్నామంటూ నమ్మబలుకుతున్నారనీ, ఇదంతా పచ్చి మోసమని విమర్శించారు. వాస్తవంగా ఉమ్మడి పౌరస్మృతి లక్ష్యం వేరుగా ఉందని చెప్పారు. దేశంలో 40శాతం మంది జనాలు ఆకలి, దారిద్ర్యంతో అల్లాడిపోతున్నారన్నారని గుర్తు చేశారు. దేశంలో నిరుద్యోగం రాజ్యమేలుతున్నదని చెప్పారు. వీటి గురించి మాట్లాడకుండా..యూసీసీ గురించి ప్రధాని ప్రస్తావించడం అత్యంత శోచనీయమని అన్నారు. ఇది లౌకిక దేశమని చెప్పారు. ఇక్కడ అనేక మతాలు, జాతులు, సంస్కృతులు, సంప్రదాయాలు, జీవన విధానాలున్నాయన్నారు. వీటన్నింటిని కాదని యూసీసీని తీసుకురావటమేంటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై ఆగస్టు రెండో వారంలో జాతీయ స్థాయి సింపోజియాన్ని నిర్వహిస్తున్నామనీ, అదే నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. మల్లు లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని ప్రజలు గణనీయంగా ఉన్నారని చెప్పారు. వారు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. వారికి వెంటనే పక్కా ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలనీ, పట్టాల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలపై ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.కేరళ తరహాలో 14రకాల నిత్యావసర వస్తువులు అందించాలన్నారు. మహిళా పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పాత చింతకాయ పచ్చడిలా....

(మొదటిపేజీ తరువాయి)

ఎద్దేవా చేశారు.శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడారు. 'కేసీఆర్ జుటా, మోడీ జుటా దోనో మిల్కే దేశ్ కో లూటా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన ప్రతి బిల్లుకి బీఆర్ఎస్ మద్దతిచ్చిందని విమర్శించారు. సీఎం కేసీఆర్ అవినీతి గురించి మాట్లాడుతున్న మోడీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావద్దనే కుట్రతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటని మోడీ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీని తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు బొంద పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

విభజన హామీలపై పెదవి విప్పని మోడీ

- కేసీఆర్ కుటుంబంపై ఎదురుదాడికే అధిక సమయం
- ఆశించిన జనం లేక ప్రాంగణం వెలవెల
- సభలో నిలదీస్తారనే అనుమానంతో..
- కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ నేతల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ- వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా విమర్శలకే అధిక సమయం కేటాయించారు. రాష్ట్ర విభజన సమయంలో విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీలను మాట మాత్రమైనా ప్రస్తావించలేదు. ఇప్పటికే ఎన్నోసార్లు రాష్ట్రానికి వచ్చిన మోడీ ఈ సారైనా తప్పకుండా మాట్లాడతారని ఆశించిన రాష్ట్ర ప్రజలకు మళ్లీ నిరాశే ఎదురైంది. అవినీతి గురించి బీజేపీ నేతలు, ఇతర పార్టీల నేతలు గతంలో చెప్పిన అంశాలనే పునరుద్ఘాటించా రు. ప్రధాని పర్యటనలో నిరసన తెలుపుతారనే అనుమానం తో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ నేతలను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లకు తరలించడం విమర్శలకు తావిచ్చింది. విభజన చట్టంలో ఇచ్చిన హామీలపై సభలో మోడీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ డిమాండ్ చేసిన సంగతి తెలిసి ందే. ఇక ఈ విజయ సంకల్ప సభలో ఆశించిన మేర జనం లేక సభా ప్రాంగణం వెలవెలబోయింది. కార్యకర్తలు కూడా తక్కువ సంఖ్యలో హాజరుకావడం గమనార్హం. వేసిన కుర్చీలు కూడా ఖాళీగా కనిపించాయి. వచ్చినవారూ సభ ముగిసేవర కూ కూర్చోలే దు. కొంతమంది మధ్యలోనే లేచి వెళ్లిపోవడం కనిపించిం ది.ఇదిలావుండగా ప్రధాని నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనలో విభజన చట్టంలో ఇచ్చిన హామీలపై పెదవివిప్పకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమ వుతున్నాయి. రాష్ట్ర ఏర్పాటులో భాగంగా పార్లమెంటులో ప్రవేశపెట్టి న విభజన చట్టంలో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేయలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్రాన్ని ప్రశ్నించింది. సీఎం కేసీఆర్ సైతం వీటిపై బహిరంగంగానే ప్రశ్నించారు. వామప క్షాలు ఆందోళనలు చేశాయి. విభజన హామీలపై సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బస్సుయాత్ర జరిగింది. అయితే, రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు కాజీపేటలో వ్యాగన్ తయారీ కేంద్రం నిర్మాణానికి మోడీ శంకుస్థాపన చేయడం గమనార్హం. విభజన హామీల నుంచి ప్రజలను పక్కదారి పట్టించడం కోసమే మోడీ.. కేసీఆర్ కుటుంబం అవినీతి అంటూ మాట్లా డటం విడ్డూరంగా ఉందని విపక్ష నేతలు మండిపడ్డారు.

నిరసన తెలిపిన ఎల్‌హెచ్‌పీఎస్

గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయకపోవడాన్ని నిరసిస్తూ లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మోడీ పర్యటన సందర్భంగా నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించింది. వరంగల్ నగరంలో పలు ప్రాంతాల్లో 'గిరిజన విశ్వవిద్యాలయం ఏమైంది..?', 'మామునూరు ఎయిర్‌పోర్ట్ ఏమైంది?' అంటూ ఫ్లెక్సీలు ప్రదర్శించారు. ఈ ఫ్లెక్సీలు, పోస్టర్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.

విపక్ష నేతల అరెస్టులు

ప్రధాని పర్యటన సందర్భంగా ముందస్తుగా కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, నేతలను పోలీసులు అరెస్టు చేసి పలు పోలీసుస్టేషన్‌లకు, మడికొండలోని పోలీసు ట్రైనింగ్ కాలేజీకి తరలించారు. హన్మకొండ డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డిని, కాంగ్రెస్ నేత జంగా రాఘవరెడ్డిని గృహ నిర్బంధం చేశారు. సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, కార్యదర్శివర్గ సభ్యులు నలిగంటి రత్నమాల, ముక్కెర రామస్వామి, సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి, నాయకులు బానోతు, మంద సంపత్, కాడబోయిన లింగయ్య తదితరులను మడికొండ పీటీసీకి తరలించారు. ప్రధాని తిరిగి వెళ్లిపోయాక సాయంత్రం 4.00 గంటలకు నేతలను వదిలిపెట్టారు.

అలసిపోలేదు.. రిటైర్ కాలేదు

- జిత్ రిటైర్‌మెంట్‌పై వ్యాఖ్యలపై శరద్ పవార్ స్పందన

ముంబయి : వయసు రీత్యా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవాలని అజిత్ పవార్ చేసిన ప్రకటనపై ఎన్సీపీ అధినేత, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శరద్ పవార్ స్పందించారు. తాను అలసిపోలేదు, పదవీ విరమణ చేయలేదని చెప్పారు. "వయస్సుకి దీనికీ సంబంధం ఏమిటి? నేనూ అలసిపోలేదు.. రిటైర్డ్ కాలేదు. మొరార్జీ దేశాయ్ ఏ వయసులో ప్రధాని అయ్యారో తెలుసా? ఇప్పుడు 70 ఏండ్లు దాటిన నాయకులు కూడా చాలా మంది ఉన్నారు. నాకు ప్రధాని కావాలనే ఆశయం లేదు. నేను ప్రజల కోసం పని చేయాలనుకుంటున్నాను' అని శరద్ పవార్ అన్నారు. "నన్ను పదవీ విరమణ చేయాలని చెప్పడానికి వారు ఎవరు? నేను ఇంకా పని చేయగలను"అని 83 ఏండ్ల శరద్ పవార్ తెలిపారు. అజిత్ పవార్ పక్షాన నిలిచిన ఛగన్ భుజబల్ నియోజకవర్గమైన యోలాలో తన ర్యాలీకి ముందు నాసిక్‌లో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రాన్ని మోసగించిన ప్రధాని

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించినప్పటికీ ఆ ఫ్యాక్టరీని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు తరలించుకుపోయి తెలంగాణకు తీరని అన్యాయం చేసిన ఘనుడు నరేంద్ర మోడీ. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ట్రైబల్ యూనివర్సిటీ, ఐటీఐఆర్ ప్రాజెక్టు గురించి మాట మాత్రమైనా ప్రస్తావించలేదు. తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ చేయకుండా, కృష్ణా-గోదావరి బోర్డును ఏర్పాటు చేయడం ద్వారా మోడీ ప్రభుత్వం రాష్ట్రాల మధ్య తగాదాను పెంచింది. ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ ప్రాజెక్టు హోదా ఇవ్వలేదు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను కేంద్రం తన అధీనంలోకి తీసుకుంటూ గెజిట్ పబ్లికేషన్ చేసింది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న విద్యుత్తు ఉత్పత్తి, ఆస్తుల పంపిణీకి పరిష్కారం చూపలేదు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానన్న నరేంద్ర మోడీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడంలేదని మాట్లాటం హాస్యాస్పదం. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించి కేంద్ర ప్రభుత్వం కూలీల పొట్ట కొడుతున్నాడు. రైతు ఉత్పత్తులకు మోడీ ప్రకటించిన కనీస మద్దతు ధరలు కార్పొరేట్లకు లాభం చేయడానికే తప్ప అందులో శాస్త్రీయత లేదు. తొమ్మిదేండ్లుగా రాష్ట్రం ప్రకృతి వైపరీత్యాలతో అతలాకుతలమై 32వేల కోట్లు నష్టపోగా కేంద్రం కక్షపూరితంగా ఎలాంటి సహాయమూ చేయలేదు. తక్కువ నష్టం జరిగినా బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రం నిధులు కేటాయించింది. ఇప్పటికైనా రాష్ట్రానికి రావాల్సిన నిధులును వెంటనే విడుదల చేయాలి. విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలి' అని తమ్మినేని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలి

ఓబీసీల సమస్యలను పరిష్కరించాలి

- ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళన
- పోస్టర్‌ను అవిష్కరించిన మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం కుల గణనను వెంటనే చేపట్టాలనీ, బీసీల సమస్యలు పరిష్కరించాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. మరికొన్ని సమస్యల పరిష్కారం కోసం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత పోస్టర్‌ను అవిష్కరించారు. కుల గణన , ఓబీసిల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15న హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో జాతీయ కన్వెన్షన్‌ను నిర్వహించనున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. దేశంలో అత్యధిక జనాభా ఉన్న బీసీలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవటం లేదని తెలిపారు. బీసీల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవటమేంటని ప్రశ్నించారు. తమ సమస్యలపై దేశంలోని వివిధ యూనివర్సిటీలలో ఉన్న ఓబీసీ విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని స్వాగతించాలని పేర్కొన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా కుల గణన చేపట్ట వచ్చని వెల్లడించారు. తద్వారా ఆయా వృత్తుల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు. దీంతో వారి అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించ వచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు జి. కిరణ్ కుమార్, జాతీయ కోశాధికారి ఓ. కొండల్, రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట దాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ దత్త, వెంకటేష్, మదన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హై పర్ఫార్మింగ్ కంప్యూటింగ్ సౌకర్యాలు పెంచాలి :కిరణ్ చంద్ర



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

దేశంలో హై పర్ఫార్మింగ్ కంప్యూ టింగ్ క్లస్టర్లను ప్రోత్సహించాలని స్వేచ్ఛ (దేశంలో ఫ్రీ సాఫ్ట్ వేర్ ఉద్యమ సంస్థ) ప్రధాన కార్యదర్శి కిరణ్ చంద్ర డిమాండ్ చేశారు. శనివారం స్వేచ్ఛ సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టెక్ మహీంద్రా ప్రాంగణంలో కృత్రిమ మేధస్సు - మిషన్ లెర్నింగ్ (ఏఐ, ఎంఎల్)-2023, భవిష్యత్తు అనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ చంద్ర సెకెండ్ మిషన్ ఏజ్-ఏఐ, డిజిటల్ ఎకో సిస్టం అనే అంశంపై కీలకోపన్యాసం ఇచ్చారు. ఆటో మేషన్, ఏఐ, సమాజంలో ఏఐ పాత్రను వివరించారు. నేటి సమాజానికి ఏఐ, ఎంఎల్ కీలకమని తెలిపారు. మైక్రోసాఫ్ట్‌లో పదేండ్ల అనుభవమున్న జానకిరాం మాట్లాడుతూ లాంగ్వేజ్ మోడల్స్ ను వివరించారు. ఈ కార్యక్రమంలో గూగుల్ వెబ్ ఎంఎల్ లీడ్ జేసన్ మయేస్, స్వేచ్ఛ డెవలపర్ చాప్టర్ కన్వీనర్ రంజిత్ రాజ్ వాసం తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఓ శాస్త్రవేత్తపై ఏటీఎస్ ఛార్జిషీట్

- పాక్ స్పై ఏజెంట్‌తో లింక్

పూణె : భారత్‌కు చెందిన డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ప్రదీప్ కురుల్కర్ మారుపేరుతో పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్‌తో సంబంధాలు పెట్టుకుని భారత రక్షణ ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారమందించిన నేరానికి గాను అతనిపై మహారాష్ట్ర పోలీసులకు చెందిన యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) గత వారం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. అధికారిక రహస్యాల చట్టం కింద మే 3న గూఢచర్యానికి పాల్పడినందుకు అతన్ని అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈయన జ్యూడీషియల్ కస్టడీలో ఉన్నారు.

కాగా, ప్రదీప్ కురుల్కర్ పూణెలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) ల్యాబ్‌లలో ఒకదానికి డైరెక్టర్‌గా పనిచేశారు. ఇతను 'దాస్ గుప్తా'గా పేరు మార్చుకుని వాట్సాప్ మెసేజ్‌లతోపాటు వీడియో కాల్స్ ద్వారా పాక్ ఇంటెలిజెన్స్ ఏజెంట్ అయిన జరా అనే మహిళని సంప్రదించినట్టు ఏటీఎస్ ఛార్జిషీట్‌లో పేర్కొంది. దాస్ గుప్తా తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌నని, తాను లండన్‌లో ఉంటున్నానని ఓ మహిళకు అసభ్యకర సందేశాలు, వీడియోలు పంపుతూ స్నేహం పెంచుకున్నాడు. అతను పంపిన మెసేజ్‌లు, వీడియోలు ఆ మహిళ ఐపి అడ్రస్ పాకిస్తాన్‌కు చెందినదని విచారణలో తేలిందని ఏటీఎస్ చార్జిషీట్‌లో పేర్కొంది. బ్రాహ్మోస్ లాంచర్, డ్రోన్, యుసివి, అగ్ని క్షిపణి లాంచర్‌తోపాటు మిలటరీ బ్రిడ్జింగ్ సిస్టమ్‌కు సంబంధించిన రహస్య సమాచారాన్ని పొందేందుకు పాకిస్తాన్ ఏజెంట్ ప్రయత్నించినట్లు ఏటీఎస్ విచారణలో తేలింది. పాకిస్తాన్ మహిళా ఏజెంట్ జారా పట్ల ఆకర్షితుడై.. కురుల్కర్ తన ఫోన్‌లో భద్రపరచుకున్న రహస్య సమాచారాన్ని ఆమెకు పంపినట్లు ఏటీఎస్ ఛార్జిషీట్‌లో పేర్కొంది. వీరిద్దరూ జూన్ 2022 నుండి డిసెంబర్ 2022 వరకు కాంటాక్ట్‌లో ఉన్నారని ఏటీఎస్ తెలిపింది.

రాజేష్ అకాల మరణం
వ్యవసాయ కార్మికోద్యమానికి తీరనిలోటు

ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి రాజేష్ మరణం వ్యవసాయ కార్మికోద్యమానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటని ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. రాజేష్ అకాల మరణానికి సంతాపం తెలుపుతూ బి వెంకట్ శనివారం ప్రకటన విడుదల చేశారు. రాజేష్ తన ఆరోగ్యం ప్రమాదకరమైన పరిస్థితిలోకి వెళ్లిందని తెలిసినా చలించలేదని, జీవితంపై నిరాశ చెందలేదని అన్నారు. తరచు తనతో మాట్లాడుతుండేవాడని, ఆరోగ్యం గురించి అడుగుతున్నా... ఉద్యమాల గురించి చెప్పేవాడని తెలిపారు. ఇటీవల ఆరోగ్యం కొంత కుదుట పడిందని, త్వరలో కోలుకుంటాడని ఆశిస్తున్న తరుణంలో ఇలాంటి విషాదకర వార్త వినాల్సి వచ్చిందని అన్నారు. అత్యంత చిన్న వయసులోనే తన పోరాట పటిమతో, అంకితభావంతో ఎదిగిన రాజేష్ అకాల మరణం తనను ఎంతగానో బాధించిందన్నారు. తమ సంఘం ఒక ఆణిముత్యాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. నిరుపేదల కుటుంబంలో పుట్టిన రాజేష్, పేదల సమున్నత మార్పుల కోసం పరితపించాడని, అందుకు పోరాటాలే మార్గమని పోరు జెండా పట్టాడని అన్నారు. పేదల భూములు పెత్తందారులు అక్రమంగా కాజేసి ఆక్వాతో ఆ గ్రామాలను విషపూరితం చేస్తే ఆ ప్రమాదం నుండి పేదలను రక్షించుకునేందుకు అనేక పోరాటాలు సాగించారని తెలిపారు. రాజేష్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రాష్ట్రంలో అవినీతి కుటుంబ పాలన

(మొదటిపేజీ తరువాయి)

పోస్టులు ఖాళీగానే వున్నాయని, పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకుండా విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారన్నారు. టీఎస్‌పీఎస్సీ కుంభకోణంతో నిరుద్యోగుల ఆశలను వమ్ము చేశారన్నారు. ఇలాంటివి చూసేందుకేనా యువత బలిదానాలు చేసింది ? అంటూ ప్రశ్నించారు. అవినీతిపై దృష్టి సారించకుండా ప్రజల దృష్టిని కేసీఆర్ మళ్లిస్తున్నారని విమర్శించారు. దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకమైందన్నారు. ప్రపంచ దేశాలకు హైదరాబాద్ లోనే వ్యాక్సిన్ రూపొందించి అందించడం జరిగింద న్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. తొమ్మిదేండ్లలో రాష్ట్రాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశామన్నారు. కాజీపేటలో వ్యాగన్ తయారీ కేంద్రం ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందన్నారు.

జాతీయ రహదారులు 5 వేల కిలోమీటర్లకు పెంపు

తెలంగాణలో జాతీయ రహదారులను 2,500 కిలోమీటర్ల నుంచి 5 వేల కిలోమీటర్ల మేరకు పెంచామని మోడీ అన్నారు. శనివారం రూ.6,100 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామన్నారు. హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఇండస్ట్రియల్ కారిడార్‌లు, ఎకనామికల్ కారిడార్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైల్వే ఉత్పత్తుల విషయంలో దేశం రికార్డులు సృష్టిస్తుందని చెప్పారు.

తెలంగాణలో రహదారుల కనెక్టివిటిని పెంచుతున్నామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుటుంబ పార్టీలని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఆ రెండింటిని ఓడించి వాటి అడ్రస్ గల్లంతు చేయాలని పిలుపునిచ్చారు.

మద్దతు ధరపై ఇచ్చిన హామీని నిలబెట్టాం

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదని, సర్పంచ్‌లంతా ఆగ్రహంతో వున్నారని మోడీ అన్నారు. గ్రామీణాభివృద్ధికి నేరుగా నిధులు అందించాలనే కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లను పంచాయతీలకు ఇచ్చినట్టు చెప్పారు. కనీస మద్దతు ధరపై హామీని నిలబెట్టుకున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, పేదలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

తెలంగాణకు మెగా టెక్స్‌టైల్స్ పార్క్ ఇచ్చామన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఆరు లైన్ల రహదారులను నిర్మిస్తున్నామన్నారు. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుంది ? అని ప్రశ్నించారు.

రూ.1.10 లక్షల కోట్ల ప్రాజెక్టులు : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

తెలంగాణ రాష్ట్రంలో రూ.1.10 లక్షల కోట్ల ప్రాజెక్టులను చేపట్టామని, ఇందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పురోగతిలో వున్నాయని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. పీఎం గతిశక్తి ద్వారా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు.

2024 నాటికి రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్తరాది, దక్షిణాదిని అనుసంధానిస్తూ రహదారులు నిర్మిస్తున్నామన్నారు. సూరత్ నుంచి హైదరాబాద్, వరంగల్, కర్నూలు మీదుగా రహదారులు నిర్మిస్తున్నామన్నారు.

ఎందుకు బహిష్కరిస్తున్నవ్ కేసీఆర్..? : మంత్రి కిషన్‌రెడ్డి

ప్రధాని సభను ఎందుకు బహిష్కరిస్తున్నవో చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. కాజీపేటలో వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేసి 3 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు సభను బహిష్కరించావా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి రెండు వందే భారత్ రైళ్లను ప్రారంభించినందుకు బహిష్కరిస్తున్నావా ? సమాధానం చెప్పాలన్నారు. ముందు కల్వకుంట్ల కుటుంబాన్ని బహిష్కరించాలన్నారు.

అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపనలు

తొలుత ప్రధాని ఉదయం 10.15 గంటలకు మామునూరు ఎయిర్ స్ట్రిప్‌లో హెలికాప్టర్ దిగారు. అక్కడి నుంచి నేరుగా భద్రకాళి దేవాలయం చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హన్మకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానానికి 11.15 గంటలకు చేరుకున్నారు. రూ.521 కోట్లతో తలపెట్టిన కాజీపేట రైల్వే వ్యాగన్ తయారీ కేంద్రానికి, రూ.2,147 కోట్లతో తలపెట్టిన జగిత్యాల, కరీంనగర్, వరంగల్ ఇంటర్ కారిడార్‌లోని 68 కిలోమీటర్ల కరీంనగర్-వరంగల్ (ఎన్‌హెచ్ 563) నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి, నాగ్‌పూర్-విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో 108 కిలోమీటర్ల మేరకు మంచిర్యాల-వరంగల్ మధ్య రూ.3,441 కోట్లతో తలపెట్టిన నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, మాజీ ఇన్‌చార్జి తరుణ్ చుగ్, జాతీయ ఉపాధ్యక్షులు డికె.అరుణ, ఎన్నికల నిర్వాహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాబురావు, మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొన్నారు.

మోడీ..ఓ విఫల ప్రధాని...

(మొదటిపేజీ తరువాయి)

మోడీకి.. ఆయన సవాల్ విసిరారు. గుజరాత్ కోసం రూ.20 వేల కోట్ల పెట్టుబడితో లోకోమోటివ్ ఫ్యాక్టరీని తన్నుకుపోయిన పీఎం... తెలంగాణలో కేవలం రూ.520 కోట్లతో వ్యాగన్ రిపేర్ షాపును పెట్టటం ఇక్కడి ప్రజలను అవమానించటమే అవుతుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న 16 లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా కేంద్రం చోద్యం చూస్తోందని తెలిపారు. ఈ వాస్తవాన్ని మరుగుపరిచిన మోడీ... రాష్ట్రంలో 2.20 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన బీఆర్ఎస్ సర్కార్‌పై నిందలేయటం శోచనీయమని పేర్కొన్నారు. ఉద్యోగాలడిగితే పకోడీలు వేసుకోవాలంటూ సూచించిన ప్రధాని... యువత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం పంపిన యూనివర్సిటీల బిల్లును ఆమోదించకుండా చోద్యం చూస్తున్న గవర్నర్‌ను పీఎం మందలిస్తే బావుండేదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీల్లో కీలకమైన గిరిజన విశ్వ విద్యాలయ ఏర్పాటు, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. నల్లచట్టాలతో 700 మంది రైతులను పొట్టనబెట్టుకున్న పీఎం... వ్యవసాయం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు. తమది కుటుంబ పాలన అంటూ మోడీ వ్యాఖ్యానించటాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా తప్పుబట్టారు. రాష్ట్ర ప్రజలంతా తమ కుటుంబ సభ్యులనీ, వారి సర్వతోముఖాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలతో విచారణ జరిపిస్తామంటూ ప్రధాని హెచ్చరించటంపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలకు తాము భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇలాంటి ఉడత ఊపులకు, పిట్ట బెదిరింపులకు తమ ప్రభుత్వం కలవరపడబోదని వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వాటిని నెరవేర్చటం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు.

మోడీ సభకు ముగ్గురు నేతల డుమ్మా

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి చంద్రశేఖర్ కూడా తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే బాధలో ఉన్నారు. త్వరలో వీరిలో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోబోతున్నారనీ, ఒకరు కారెక్కబోతున్నారనే ప్రచారం ఇప్పటికే జోరుగా సాగుతున్నది. ప్రధానమంత్రి సభకు హాజరుకాకపోవడంతో ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చినట్టు అయింది.

మరోవైపు జిల్లాస్థాయి నేతల్లో కూడా కొందరు గైర్హాజరు అయినట్టు ప్రచారం జరుగుతున్నది. కిషన్‌రెడ్డి అధ్యక్ష పీఠం ఎక్కాక అందర్నీ సమన్వయం చేసుకుని ముందుకెళ్తారనీ, ఇక గ్రూపు తగాదాలుండవని భావించిన అధిష్టానానికి ఇది పెద్ద ఎదురుదెబ్బే. ప్రక్షాళనలో భాగంగా కిషన్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షులుగా నియమించినా, పార్టీ వీడకుండా ఈటలకు ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ పదవి కట్టబెట్టినా... చివరి నిమిషం వరకూ కాంగ్రెస్ గూటికి చేరకుండా అడ్డుకోవాలనే ప్రయత్నంలో భాగంగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని జాతీయ కార్యవర్గ సభ్యులుగా ప్రమోట్ చేసినా ఆశించిన ఫలితం మాత్రం కనిపించడంలేదు. ఆధిపత్యపోరు రగులుతూనే ఉన్నది. మేమంతా ఒక్కతాటిపై ఉన్నామని కిషన్‌రెడ్డి, ఈటల చెబుతున్నా...కిషన్‌రెడ్డి తమ గురువు అని బండి ప్రబోధిస్తున్నా లోలోన అంతర్గత పోరు నడుస్తూనే ఉన్నట్టు కనిపిస్తున్నది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభలో ఈటల రాజేందర్, బండి సంజయ్ ఎడమొహం, పెడమొహంగానే ఉన్నారు. రఘునందన్‌రావుదీ అదే పరిస్థితి. వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్ నేత చింతా సాంబమూర్తిని వేదికపైకి పిలవకపోవడమూ వివాదాస్పదమైంది. తన నియోజక వర్గంలో జరుగుతున్న సభలో తనను వేదికపైకి పిలవకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తికి గురైనట్టు ఆ పార్టీ వర్గాలే గుసగుసలాడు కుంటున్నాయి. పదవుల పంపిణీ నేతల మధ్య ఐక్యతను తేకపోగా మరింత వైషమ్యాలను పెంచి పోషించినట్టు స్పష్టంగా అర్థమవుతున్నది.

మరోవైపు కరీంనగర్‌లో బండి సంజయ్‌కు వ్యతిరేకంగా అసంతృప్త సీనియర్ల వరుస సమావేశాలు, దుబ్బాకలో పాత, కొత్త గ్రూపులుగా విడిపోయిన తీరు స్పష్టంగా కనిపిస్తున్నది. వివేక్, విజయశాంతి, చంద్రశేఖర్ మాత్రమే కాకుండా రాజగోపాల్‌రెడ్డి, పలువురు కీలక నేతలు పక్కపార్టీలవైపు చూస్తున్నారనేది జగమెరిగిన సత్యం.

ప్రధానిది రెండు నాల్కల ధోరణి..

బీఆర్ఎస్ ఎంపీ వెంకటేశ్ నేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాని మోడీ వరంగల్ సభ ద్వారా తెలంగాణపై మరోసారి తన రెండు నాల్కల ధోరణిని ప్రదర్శించారని బీఆర్ఎస్ ఎంపీ బి.వెంకటేశ్ నేత విమర్శించారు. సీఎం కేసీఆర్‌కు జాతీయ రాజకీయాల్లో వస్తున్న స్పందనను చూసి తట్టుకోలేకే ఆయన ఇలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ టి.భానుప్రసాద్‌తో కలిసి వెంకటేశ్ నేత మాట్లాడారు. వరంగల్ సభలో ప్రధాని అన్నీ అబద్ధాలు, అసత్యాలే మాట్లాడారని విమర్శించారు. పీఎం స్థాయిలో ఇలా మాట్లాడటం సరికాదన్నారు. దేశాన్ని నియంతలా పాలిస్తున్న మోడీని ప్రజలంతా నిలదీయాలని పిలుపునిచ్చారు.



ట్రాక్టర్ నడిపి.. నాట్లు వేసి...

- హర్యానా రైతులతో రాహుల్ ముచ్చట్లు

సోనేపట్ : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శనివారం హర్యానాలోని సోనేపట్ జిల్లా రైతులతో మమేకమయ్యారు. బరోడా, మదీనా ప్రాంతాలలో వ్యవసాయ క్షేత్రాలలోకి వెళ్లారు. కొద్దిసేపు ట్రాక్టర్ నడిపారు. రైతులతో కలిసి వరి పొలంలో నాట్లు వేశారు. అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీ నుంచి హిమాచల్‌ప్రదేశ్ వెళుతూ మార్గమధ్యంలో ఆయన పంట పొలాల వద్ద ఆగారు. రాహుల్ తమ పొలాల్లోకి రావడం ఆశ్చర్యాన్ని కలిగించిందని, తొలుత ఆయనను గుర్తించలేదని సంజయ్ కుమార్ అనే రైతు తెలిపారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారని, తమతో కలిసి అల్పాహారం తీసుకున్నారని చెప్పారు. కాగా రాహుల్‌కు సంఘీభావంగా ఈ నెల 12న మౌనదీక్ష చేపట్టాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వివిధ రాష్ట్రాలకు చెందిన పార్టీ అధ్యక్షులకు లేఖలు రాశారు. పరువునష్టం కేసులో రాహుల్‌కు విధించిన శిక్షపై స్టే ఇచ్చేందుకు గుజరాత్ హైకోర్ట్ నిరాకరించిన నేపథ్యంలో ఆయన ఈ లేఖలు రాశారు. రాహుల్ వెనుక లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, కోట్లాది మంది భారత ప్రజలు ఉన్నారని చాటడానికి ఈ దీక్షలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధానులలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పార్టీకి చెందిన సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు దీనికి హాజరవుతారు.

నష్టపరిహారం కోసం.... 17న హర్యానాలో రైతుల నిరసన

చండీగఢ్ : దెబ్బతిన్న పంటలకు తగిన నష్టపరిహారం ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని సంయుక్త కిసాన్‌మోర్చ (ఎస్‌కేఎం) హర్యానా రాష్ట్ర శాఖ నిర్ణయించింది. సబ్-డివిజన్ స్థాయిలో ఈ నిరసన ప్రదర్శనలు చేపడతారు. 'పంటల రిజిస్ట్రేషన్‌ను ప్రైవేటు బీమా కంపెనీలు అనుమతించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది రూపాయల మేర పంట నష్టానికి సంబంధించిన బీమా క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్క మహేంద్రఘర్ జిల్లాలోనే 17 వేల మంది రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద నష్టపరిహారం కోసం గత కొన్ని నెలలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇతర జిల్లాలలో కూడా ఇదే పరిస్థితి' అని ఆల్ ఇండియా కిసాన్‌సభ (ఏఐకేఎస్) సీనియర్ ఉపాధ్యక్షుడు ఇందర్‌జిత్ సింగ్ చెప్పారు. రైతులు తమ పంటలకు బీమా సౌకర్యం పొందేందుకు ప్రీమియంలు చెల్లించినప్పటికీ నష్టపరిహారం పొందలేకపోతున్నారని ఆయన తెలిపారు.

రోహ్‌తక్‌లో శుక్రవారం జరిగిన ఎస్‌కేఎం సమావేశంలో ఆందోళన కార్యక్రమాన్ని ఖరారు చేశారు. పంటలకు కనీస మద్దతు ధర పొందడం, రుణాల నుండి రైతులకు విముక్తి కల్పించేందుకు ఒక విధానాన్ని రూపొందించడం వంటి వ్యవసాయ సంబంధమైన డిమాండ్ల సాధన కోసం వారు భవిష్యత్ కార్యాచరణను కూడా ఖరారు చేశారు.

మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డికి రాహుల్ గాంధీ నివాళి

న్యూఢిల్లీ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నివాళులర్పించారు. ఈ మేరకు శనివారం రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయనకు నా నివాళులు. ఆంధ్రప్రదేశ్ ప్రజల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనికత కలిగిన నాయకుడు. ఎప్పటికీ గుర్తుంచుకోదగిన వ్యక్తి' అని రాహుల్ గాంధీ ట్విటర్ వేదికగా తెలిపారు.

భోజ్‌పురి గాయనిపై కేసు

- 'మూత్రవిసర్జన'పై పోస్ట్ పెట్టారని ఆరోపణ

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లో జరిగిన 'మూత్ర విసర్జన' ఘటనకు సంబంధించి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ పెట్టారని ఆరోపిస్తూ భోజ్‌పురి గాయని నేహా రాథోడ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బీజేపీ మధ్యప్రదేశ్ ఎస్సీ విభాగం మీడియా ఇన్‌ఛార్జ్ సూరజ్ ఖారే ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమెపై ఐపీసీ సెక్షన్ 153 ఏ (వివిధ గ్రూపుల మధ్య శతృత్వాన్ని పెంచడం) కింద కేసు నమోదు చేశామని హబీబ్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ మనీష్ రాజ్ భరోడియా చెప్పారు. అర్ధనగ్నంగా ఉన్న ఓ వ్యక్తి మరొకరిపై మూత్ర విసర్జన చేస్తున్నట్లు రాథోడ్ సామాజిక మాధ్యమాలలో ఓ కారికేచర్‌ను పోస్ట్ చేశారు. మూత్ర విసర్జన చేస్తున్నట్లు చూపిన వ్యక్తి తెల్ల చొక్కా, నల్ల టోపీ ధరించాడు. అతని ఖాకీ నిక్కరు నేలపై పడి ఉంది. కారికేచర్ కింద 'మధ్యప్రదేశ్‌లో ఏం జరుగుతోంది?' అని రాశారు.

తనపై ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత రాథోడ్ ట్విటర్‌లో బీజేపీపై మండిపడ్డారు. మూత్ర విసర్జన ఘటనను విమర్శించినందుకు తనపై కేసు పెట్టారని అంటూ గిరిజనులపై వారికి ఎంత ప్రేమో అని ఎత్తిపొడిచారు. నివాస గృహాన్ని బలవంతంగా ఖాళీ చేయించిన సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లో తల్లీకూతురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై యోగి ప్రభుత్వాన్ని విమర్శించినందుకు ఫిబ్రవరిలో ఆమెకు నోటీసు జారీ చేశారు.

మరో ఇద్దరి పైనా...

ఇదిలావుండగా ఆర్ఎస్ఎస్ కార్యకర్త సురేంద్ర సింగ్ అలావా ఇచ్చిన ఫిర్యాదు మేరకు గిరిజన నేత లోకేష్ ముజల్దా, పాత్రికేయుడు అభిషేక్‌పై ఇండోర్ పోలీసులు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశారు. మూత్ర విసర్జన ఘటన నేపథ్యంలో ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో కార్టూన్లు షేర్ చేసినందుకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఆర్ఎస్ఎస్ యూనిఫారం ధరించిన ఓ వ్యక్తిని కార్టూన్‌లో అభ్యంతర కరమైన రీతిలో చిత్రించారని, దానిని వీరిద్దరూ ఫేస్‌బుక్, ట్విటర్‌లో షేర్ చేశారని వివరించారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తర్వాత అభిషేక్ ట్విటర్‌లో పోస్ట్ పెడుతూ తాను షేర్ చేసిన కార్టూన్ కొందరి మనోభావాలను దెబ్బతీసినందున దానిని తొలగించి, క్షమాపణలు చెప్పానని అన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- వారి పట్ల నిర్లక్ష్యం తగదు
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్
- కొనసాగిన సమ్మె

నవతెలంగాణ- విలేకరులు

గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పంచాయతీ కార్మిక ఉద్యోగ, సిబ్బంది యూనియన్ జేఏసీ రాష్ట్ర చైర్మెన్ పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల సమ్మె కొనసాగింది. జీపీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్లో చేపట్టిన రిలే నిరవధిక సమ్మె శిబిరాన్ని శనివారం సీఐటీయూ నాయకులతోపాటు పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంపూర్ణ సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో, ప్రభుత్వ కార్యక్రమాల్లో విశేషమైన సేవలు అందిస్తున్న జీపీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైందికాదన్నారు. అనేక ఏండ్లుగా అరకొర వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్న వారి వేతనాలలో మార్పు లేకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం వారి న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఆలోచన చేయాలని కోరారు.



వికారాబాద్ జిల్లాలో కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో....

తల్లాడలో గ్రామపంచాయతీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సుమారు 50 వేల మంది జీపీ కార్మికులకు శ్రమకు తగిన ఫలితం అందడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా లాంటి చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంఘీభావం తెలిపారు. కొణిజర్లలో సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సంఘీభావాన్ని ప్రకటించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జీపీ కార్మికుల సమ్మెకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు అండగా ఉంటామన్నారు. చర్లలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికుల సమ్మె మూడో రోజు కొనసాగింది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన ద్వారా ప్రభుత్వానికి నిరసన తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం సమ్మెకు సీపీఐ జిల్లా నాయకులు చెక్క వెంకటేశ్ సంఘీభావం తెలిపారు. భువనగిరి మండల ఎంపీడీవో ఆఫీస్ ముందు సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్‌రెడ్డి సందర్శించి మద్దతు తెలిపారు. వలిగొండలో సమ్మెకు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాధారపు మల్లేశం మద్దతు తెలిపారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులకు చౌళ్లరామారం సర్పంచ్ నిమ్మనగోటి జోజి, లక్ష్మీదేవికాల్వ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్ మద్దతు తెలిపారు. కార్మికులకు చౌళ్లరామారం సర్పంచ్ నిమ్మనగోటి జోజి రూ.8 వేలు, లక్ష్మీదేవికాల్వ సర్పంచ్ నారగోని అంజయ్యగౌడ్ రూ.5 వేలు విరాళం అందజేశారు.

సూర్యాపేట జిల్లా మోతెలో సమ్మె ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంట నాగయ్య మద్దతు తెలిపారు. నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయం ముందు జీపీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మద్దతు తెలిపారు.

నవతెలంగాణ 7
ఎల్బీనగర్
ఆదివారం 09 జులై 2023

'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి'



నవతెలంగాణ- సంతోష్ నగర్

ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని దుర్గాభవాని నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్ రెడ్డి అన్నారు. శనివారం కాలనీ ఉపాధ్యక్షులు వెంకట్‌తో దుర్గాభవాని నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ఇనుప, సిమెంటు స్తంభాలు ప్రమాదకరంగా మారడంతో ఎమ్మెల్యే, కార్పొరేటర్ల దృష్టికి తీసుకెళ్లగా.. వాటిని మంజూరు చేశారని తెలిపారు. రోడ్ నెంబర్ 2, 3, 6, 7లలో పాత స్తంభాలను తొలగించి, కొత్తవి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. దీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో చర్చించి.. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

హరి అడావాత్‌కు సీఐగా ప్రమోషన్



నవతెలంగాణ-సంతోష్‌నగర్

మలక్‌పేట్ ట్రాఫిక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న 2009 బ్యాచ్ హరి అడావాత్‌కు సీఐగా పదోన్నతి పొందారు. ఈ మేరకు శనివారం ఆయనకు బంధువులు, స్నేహితులు, తోటి సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు హరి అడావాత్ కు పూల బొకే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలక్ పేట్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల



నవతెలంగాణ - సంతోష్ నగర్

మలక్ పేట్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా అని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ ఎంసీహెచ్ కాలనీలో శనివారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, పాల్ మెట్యం పార్కులో ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లో ప్రజల ఆరోగ్య భద్రత బస్తీ దవఖానను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీ అధికారులదే అని అన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కాలనీ పరిశ్రమల ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఓల్డ్ మలక్ పేట్ కార్పొరేటర్ మహమ్మద్ సైఫుద్దీన్ షఫీ, పలు జీహెచ్ఎంసీ అధికారులు, ఎంఐఎం ఆక్టివ్ సభ్యులు, స్థానిక సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌కు రెండు కండ్లు

- తెలంగాణ రాష్ట్రానికే పీర్జాదిగూడ ఆదర్శం
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- రూ.4.39 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-బోడుప్పల్

అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ పార్టీకి రెండు కండ్లు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4.39 కోట్లతో చేపట్టనున్న వివిధ రకాల అభివృద్ధి పనులకు శనివారం పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు పీర్జాదిగూడ ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అభివృద్ధిలోనే కాదు అవార్డులు సాధించడం లాంటి విషయాలలో కూడా ముందుందని చెప్పారు. రూ.7.5 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తి అయ్యే దశకు చేరుకుందని, త్వరలోనే ప్రజలకు అందు బాటులోకి వస్తుందన్నారు. అదే విధంగా రూ.26 కోట్లతో నిర్మిస్తున్న పర్వతపుర్ రోడ్డు అందుబాటులోకి తెస్తామని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గాను చేపట్టిన ఎస్ఎన్డీపీ పనులువేగంగా నడుస్తున్నాయన్నారు.

ల్యాండ్ పూలింగ్ నిధులతో మరింతగా అభివృద్ధి...

బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో దళిత గిరిజన భూములను ల్యాండ్ పూలింగ్‌లో తీసుకుని ఎకరానికి 600 గజాల చొప్పున ఇచ్చేందుకు ప్రభుత్వం ఒప్పుకుందని తెలిపారు. త్వరలోనే ప్లాట్ల వేలం జరుగుతుందని, అలా వచ్చిన నిధులతో కార్పొరేషన్లు మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు దర్గా దయాకర్ రెడ్డి, పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు అధికారులు పాల్గొన్నారు.

26వ డివిజన్‌ను అభివృద్ధి చేస్తా

- కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరీ అంజిరెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ ను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తానని కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరీ అంజిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని శంకర్ నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మంత్రి మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు దర్గా దయాకర్ రెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్ బండి రమ్య, బీఆర్ఎస్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, బండి సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 కేసులు నమోదు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

సంతోష్ నగర్ చంపాపేట్ చౌరస్తా, యాదిరెడ్డి గార్డెన్ వద్ద మీర్ చౌక్, సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మీర్‌చౌక్ ట్రాఫిక్ సీఐ సైదిరెడ్డి, సంతోష్ నగర్ ట్రాఫిక్ సీఐ విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా...సుమారు 8 కేసులను నమోదు చేసినట్టు ట్రాఫిక్ సీఐలు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 8 మంది ద్విచక్ర వాహనదారుల పై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించినా వాహనదారుల్లో మార్పు రావడం లేదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ, మీర్ చౌక్ ట్రాఫిక్ ఎస్ఐ గణేష్, పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- మంత్రి సబితా ఇంద్రా రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో జల్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీలో సుమారు రూ.6కోట్ల నిధులతో చేపట్టబోయే పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఒక విజన్‌తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ లో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేయటం జరిగిందన్నారు. శ్రీరామ్ కాలనీలోని 17, 18,19,20 వార్డులో రూ.2.40 కోట్లతో సీసీ రోడ్లు, నిత్యా ఎనక్లేవ్ లో రూ.24.50 లక్షలతో మంచినీటి సరఫరాను ప్రారంభించినట్లు తెలిపారు. సీసీ, బీటీ రోడ్లతో పాటు పలు చోట్ల రోడ్ల వెడల్పు పనులు మొత్తం 132 పనులకు గాను రూ.43.585 కోట్ల వ్యయంతో నియోజకవర్గ వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. రూ.100 కోట్లతో జల్‌పల్లిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో నాళాలు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.320 కోట్లతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.110 కోట్లతో నాళాల పనులు జరుగుతున్నాయన్నారు. రూ.210 కోట్లతో మిషన్ భగీరథలో భాగంగా నూతన పైప్ లైన్లు, ట్యాంకులు, రిజర్వాయర్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో బడంగ్ పేట్, మీర్ పేట్, జల్ పల్లి పరిధిలోని 10 చెరువులలో రూ.40 కోట్లతో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్, కమిషనర్ వసంత, డీఈఈ వెంకన్న, ఏఈ అయేషా, కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు కే.లక్ష్మి నారాయణ, పల్లపు శంకర్, బాషమ్మ,షేక్ పమీద అఫ్జల్, ఎం.డి.శంషోద్దీన్, దూడల సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వై. జనార్దన్, యువ నాయకులు అర్జున్, వివిధ కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీ కార్మికుల పట్ల పాలకుల వివక్ష'



నవతెలంగాణ-ఘట్కేసర్

గ్రామ పంచాయతీ కార్మికులలో అత్యధికులు దళితులు కావడం వలనే ప్రభుత్వం చర్చలకు పిలవకుండా వివక్ష పాటిస్తుందని.. తక్షణమే జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి, సమ్మెను విరమింపజేయాలని గ్రామ పంచాయతీ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె శనివారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు కరోనా వంటి కష్ట కాలంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పల్లెలను పరిశుభ్రంగా ఉంచారని గుర్తుచేశారు.

సమ్మెకు పలు పార్టీల సంఘీభావం

గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ టీడీపీ, బీఎస్పీ పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య, సీపీఐ జిల్లా నాయకులు జయచంద్ర, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రెస్ యాదవ్, మండల అధ్యక్షులు, కర్రి రాజేష్, ముత్యాలు యాదవ్, తెలుగుదేశం పార్టీ మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు చేర్యాల అశోక్ కుమార్ గౌడ్, మండల అధ్యక్షులు వేముల సంజీవ గౌడ్, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు చిర్యాల జంగయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ సబిత, ఏఐ టీయూసీ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్, సీఐటీయూ మండల నాయకులు, కడమంచి యాదగిరి, నల్లవెల్లి దాసు, నాయకులు సోమన్న, కార్మిక నాయకులు, దానయ్య, లక్ష్మి భిక్షపతి, చంద్రమౌళి, ముత్తమ్మ, భారతమ్మ, నరేష్, కనకరాజు, కిష్టమ్మ పద్మ, కార్మికులు పాల్గొన్నారు.

రికవరీ చేసిన మొబైల్స్ అందజేత



నవతెలంగాణ-సంతోష్ నగర్

చోరీకి గురైన మొబైల్స్‌తో పాటు వివిధ కారణాల వల్ల పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు మాదన్న పేట పోలీసులు తిరిగి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాదన్నపేట పోలీసు స్టేషన్ సీఐ జానయ్య మాట్లాడుతూ బాధితులు టెలికం శాఖకు చెందిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ ఫోన్ల ఆచూకీ కొనుగొన్నారని తెలిపారు. మొత్తం 9 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు చెప్పారు. రద్దీ ప్రాంతాలలో జేబుదొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



నవతెలంగాణ - సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ అగ్నిమాపక కేంద్రం కార్యాలయం వద్ద చంచల్గూడ రోడ్డు మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. మలక్‌పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మలక్ పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరి అదావత్ హెచ్చరించారు. ఈ డ్రైవ్ లో ట్రాఫిక్ రద్దీకి ఇబ్బందులు కలిగిస్తున్న దుకాణదారులపై, గుడ్స్ ఆటోలపై కేసులు నమోదు చేసి జరిమానాలను విధించినట్లు తెలిపారు. రోడ్డుపైనే ఇరువైపుల వాహనాలను నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులను సృష్టిస్తున్నారని, అదే విధంగా పండ్ల బండ్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులపై ఫిర్యాదులు..దీనిపై కూడా ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపించకుండా చేసినట్లయితే వాహన యజమానిపై మోటర్ వెహికల్ యాక్ట్ 129 (2) రూ. 2వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందని చెప్పారు. 40 ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకున్నట్లు తెలిపారు. తల్లీదండ్రులు, వాహన యజమానులు ఎట్టి పరిస్థితులలో మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. అనంతరం డ్రైవింగ్ లైసెన్సులు ఇతర పత్రాలు లేని పలువురు వాహనాలపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'పార్కుల్లో పచ్చదనం పెంపునకు చర్యలు'



నవతెలంగాణ-సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ పరిధిలోని పార్కుల్లో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హార్టికల్చర్ అధికారులతో కలిసి కార్పొరేటర్ సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్-ఏ, ఏపీఏయూ కాలనీల్లోని పార్కులను సందర్శించారు. ఆయా పార్కుల్లో కొనసాగుతున్న అభివృ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలు, బస్తీలవాసులకు ఆహ్లాదకర వాతావరణం అందేలా పార్కులను ఆధునీకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీన, హార్టికల్చర్ మేనేజర్ యమున, ఫీల్డ్ అసిస్టెంట్ మధు, మల్లారెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ నమస్తే పేరుతో ఎమ్మెల్యే పాదయాత్ర



నవతెలంగాణ -ఉప్పల్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ఉప్పల్ నమస్తే పేరుతో ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి పాదయాత్ర చేప ట్టారు. దీనిలో భాగంగా శనివారం చిల్కానగర్ డివిజన్లోని డివిజన్ బీరప్ప గడ్డ, అన్నపూర్ణ కాలనీ, న్యూ ప్రశాంత్ నగర్, లైబ్రరీ, బీరప్ప గడ్డ ప్రాంతాలలో కార్పొరేటర్ బన్నాల గీతతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులు బీరప్ప గడ్డ ప్రాంతంలో డ్రైనేజీ , ఓపెన్ నాలా ఆధునీకరణ, మ్యాన్ హెూల్ల ఏర్పాటు, సీసీ రోడ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తర్వాత బీరప్ప గడ్డ వాటర్ ట్యాంక్ ఆవరణంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి..వెంటనే సంబంధిత అధికారులకు పై మస్యలను తెలియజేసి.. వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాన్నాల ప్రవీణ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పల్లే నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి కొక్కొండ జగన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, లేతాకుల రఘుపతి రెడ్డి, గుడి మధుసూదన్ రెడ్డి, నేర్డం భాస్కర్, జల్లి మోహన్, పిట్టల నరేష్ ముదిరాజ్, పండ్ల కిషన్, ఈరెల్లి రవీందర్ రెడ్డి, కొంపల్లి రవీందర్, రాజు కుమార్, ఎదుల్ల కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు హస్తకళలలో రాణించాలి'



నవతెలంగాణ-ఘట్కేసర్

మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, చేనేత హస్తకళల డిజైనింగ్‌లో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని నా బార్డ్ డీడీఎం సురభి అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఈఎస్ ఆధ్వర్యంలో శనివారం వీవింగ్ బ్యాగ్ మేకింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నా బార్డ్ డీడీఎం సురభి మాట్లాడుతూ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులు చాలా బాగున్నాయని, వీరు ఒక బ్రాండ్ తో వస్తువులను తయారు చేసి మార్కెటింగ్ చేసే స్థాయికి ఎదగాలని కోరారు. నాబార్డు సహకారంతో శిక్షణ పొందిన మహిళలు తమ శిక్షణ ఉపయోగించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. చేనేత ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాస్ సంస్థ సెక్రటరీ శ్రీనివాస్, సంస్థ నిర్వాహకులు మంజుల తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇండ్ల కోసం నా వంతు ప్రయత్నం చేస్తా

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



నవతెలంగాణ- సంతోష్ నగర్

జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. జర్నలిస్టుల కుటుంబాలతో మాట ముచ్చట కార్యక్రమం పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో జర్నలిస్టులందరికీ సరిపడే ప్రభుత్వ స్థలం లేని కారణంగా కొంత ఆలస్యం జరుగుతుందని అన్నారు. గత మూడు నెలలుగా తాను జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ఈ విషయమై పక్క నియోజకవర్గం మంత్రి సబితా ఇంద్రారెడ్డిని, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని కలిసి తమ జర్నలిస్టుల కోసం కొంత ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరినట్లు వెల్లడించారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సంతోష్ నగర్ :

అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

అభివృద్ధి పనులకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో జోరుగా చేరికలు జరుగుతున్నాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్



పరిధిలోని బూడు బుక్కల సంఘం రామచిలుకల బస్తీ వాసులు బస్తీ అధ్యక్షులు మోహన్, సెక్రటరీ గణేష్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు సీనియర్ నాయకులు నల్ల రఘుమారెడ్డి, చంపాపేట్ డివిజన్ అధ్యక్షులు రాజ్ కుమార్ రెడ్డి, సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్క గడపకూ అందుతున్నాయన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చంపాపేట్ మహిళా అధ్యక్షురాలు రోజా రెడ్డి, యూత్ అధ్యక్షులు కళ్యాణ్, బీసీసెల్ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, స్థానిక నాయకులు ప్రభాకర్, పార్టీ శ్రేణులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హయత్ నగర్ :

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తా

దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సరస్వతి నగర్, శ్రీ రామ నగర్ కాలనీల్లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా



పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు జగదీష్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, నాయకులు రామాచారి, యాదగిరి నేత, రామచంద్ర రెడ్డి, బాలరాజు గౌడ్, విజయ్ భాస్కర్ రెడ్డి, వెంకన్న, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యవర్గ సభ్యులు, ఉద్యమకారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే లక్ష్యం

- కార్పొరేటర్ స్వాతి క్రిష్ణ గౌడ్



నవతెలంగాణ-బోడుప్పల్

డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని పీర్జాదిగూడ 5వ డివిజన్ కార్పొరేటర్ బోడిగే స్వాతిక్రిష్ణ గౌడ్ అన్నారు. శనివారం రూ.50 లక్షల నిధులతో డివిజన్ పరిధిలో చేపట్టిన భూగర్భ డ్రెయినేజీ పనులకు మంత్రి మల్లారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ జక్క వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు దర్గా దయాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బోడిగే క్రిష్ణ గౌడ్, కానీల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



నవతెలంగాణ-నేరేడ్‌మెట్:

వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ వెస్ట్ వెంకటాపురానికి చెందిన వజ్రరాణి ఇంటర్ చదువుతోంది. ఆమె ఆర్థిక పరిస్థితి బాగా లేక చదువుకోవటానికి ఇబ్బందులు పడుతున్నట్టు సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాలు మేరకు కార్పొరేటర్ సబితాఅనిల్ కిశోర్ సదరు విద్యార్థిని తండ్రికి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయ కులు అనిల్ కిశోర్‌గౌడ్, లోకేష్, మోసిన్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ దంపతులను కలిసిన కీసర ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మి నారాయణ గౌడ్ దంపతులను కీసర ప్రెస్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దంపతు లను శాలువాతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ విలేకరుల సమస్యల సాధన కోసం నూతన కమిటీ కృషి చేయాలని ఎంపీపీ దంపతులు కోరారు. అంతకుముందు చీర్యాల లక్ష్మి నృసింహ్మ స్వామి వారిని నూతన కమిటీ సభ్యులు దర్శిం చుకున్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, పరుశు రాం, ప్రధాన కార్యదర్శి బందెలా యాదగిరి, కోశాధికారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్జయినీ మహాకాళికి పద్మశాలీల పట్టు వస్త్రాల సమర్పణ



నవతెలంగాణ-బేగంపేట్

కోరిన కోరికలు నెరవేర్చే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి మొట్ట మొదటిసారిగా పద్మశాలీలు తయారు చేసిన చేనేత పట్టు వస్త్రాలు అందించడం పద్మశాలీల అదృష్టమని సికింద్రాబాద్ గణేష్ దేవాలయం మాజీ చైర్మన్ జయరాజ్, అఖిలభారత పద్మ శాలి సంఘం జాతీయ అధ్యక్షురాలు వనం దుష్మంతలు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆషాడ మాసంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రముఖ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని, ఈ మహోత్సవంలో పద్మశాలీలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని, అమ్మవారికి నేతన్నలు నేచిన పట్టు చీర, పట్టు వస్త్రాలను మొ దటిగా అమ్మవారికి సమర్పిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా అఖిల భారత పద్మ శాలి సంఘం తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో గణేష్ దేవాలయం ధర్మకర్త జయరాజ్ సౌజన్యంతో పద్మశాలీల భాజా భజంత్రీలతో ర్యాలీగా వెళ్లి మహాకాళి అమ్మవారికి చేనేత పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీపీఎస్ జాతీయ మహిళా అధ్య క్షురాలు వనం దుష్మంతల, ప్రధాన కార్యదర్శి చిలువేరు సునీత, రాష్ట్ర మహిళా అధ్యక్షు రాలు గుంటక రూపలు మాట్లాడుతూ.. రాష్ట్రంలోనీ ప్రముఖ దేవాలయాల బ్రహ్మోత్స వా లు, కళ్యాణ మహోత్సవాలలో పద్మశాలీలు తయారుచేసిన పట్టు వస్త్రాలు సమర్పించడం, తరతరాల నుండి ఆనవాయితీగా వస్తుందని, ఆ గౌరవం మా మహిళలకు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందగట్ల స్వామి. ఉపాధ్యక్షులు చిలువేరు పురుషోత్తం, రాష్ట్ర మీడియా అధ్యక్షులు బొమ్మ అమరేందర్. సంఘం మహిళా ప్రతినిధులు గాడి పల్లి సంధ్య, బొమ్మ ప్రవల్లిక, భూసాని పద్మ శశికళతో పాటు పెద్ద ఎత్తున మహిళలు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ పరిసరాల్లో అమల్లోకి ట్రాఫిక్ ఆంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా ఈనెల 9, 10 తేదీల్లో ఆలయ సమీపంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు నగర ట్రాఫిక్ బాస్, అదనపు సీపీ సుధీర్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ ఆంక్షలు 10వ తేదీ జాతర పూర్తయ్యే వంకు అమలులో ఉంటాయన్నారు. భక్తులతో ఆలయ సమీపంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాలను దారి మళ్లి స్తున్నట్టు పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోకి ప్లాట్ ఫామ్ నంబర్.1 నుంచి వెళ్లే వారు రద్దీ ఎక్కువ ఉండడంతో చిలకలగూడ వైపు నుంచి వచ్చి ప్లాట్ ఫామ్ నం బర్.10ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆలయానికి రెండు కిలో మీటర్ల పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉంటుంద న్నారు. కర్బాల మై దాన్, రైల్వేస్టేషన్, తాడ్‌బన్, ప్యాట్నీ, ప్యా రడైజ్, రాణిగంజ్, రసూ ల్‌పురా తదితర ప్రాంతాల్లో వాహ నాలను మళ్లిస్తారు. ఇం దుకు ప్రజలు సహకరించాలని సుధీ ర్‌బాబు కోరారు. రోడ్ల మూసి వేత మహంకాళి ఆలయం, టోబాకో బజార్, హిల్ స్ట్రీట్ రూట్‌లో ట్రాఫిక్ రాకపోకలు పూర్తిగా నిలిపివేసి, రోడ్లను మూసివేస్తారు. సుభాష్ రోడ్డు, బాటా చౌరస్తా, రాంగో పాల్‌పేట్ పీఎస్, సికింద్రాబాద్ మార్గా లను



మూసివేస్తారు. అడవయ్య రోడ్డు మార్గాలను మూసివేస్తారు. జనరల్ బజార్ నుంచి ఆలయ మార్గం రోడ్డు మూసివేస్తారు.

బేగంపేట ముస్లీంల దశాబ్దాల కల సాకారం

● మంత్రి తలసాని శ్రీనివాస్‌కు సత్కారం



నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట ముస్లీంల దశాబ్దాల కల సాకారమైంది. బేగంపేట ప్రాంతంలోని ముస్లీం లు గ్రేవ్ యార్డ్ కోసం స్థలం కేటాయించాలని గత 50, 60 సంవ త్సరాల నుండి కోరుతూ వస్తున్నారు. ఈ ప్రాంతం నుండి గెలుపొంది ముఖ్య మంత్రి, మంత్రులుగా పని చేసిన వారు కూడా తాము పడుతున్న ఇబ్బందులను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ దీర్ఘకాలిక డిమాండ్ అయిన గ్రేవ్ యార్డు ఏర్పాటు కోసం ఓల్డ్ కస్టమ్ బస్తీలో 2 ఎకరాల భూమిని కేటాయిం చడంతో పాటు నిర్మాణ పనుల కోసం రూ.3 కోట్లను రాష్ట్ర పశుసం వర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అభినందనలు తెలిపారు. నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బేగంపేటకు చెందిన పలువురు ముస్లీం లు శనివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన నివా సంలో ఆయనను కలిసి గజ మాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక మంలో మసీద్ ఇమామ్ తస్లీం, ముస్లీం ప్రతినిధులు ఫారూ ఖ్, ఆరీఫ్, అష్రఫ్, వాహీద్, ఇమ్రాన్, సీనియర్ నాయకులు శ్రీహరి, నరేందర్ రావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ జ్యోతిబసు జయంతి



నవతెలంగాణ-కాప్రా

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ జ్యోతిబసు 109వ జయంతి సంస్మరణ సభ కమలానగర్ జిల్లా ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా మాజీ పార్టీ కార్యదర్శి సీనియర్ నాయకులు పీఎస్ఎన్ మూర్తి , పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటిరవి జ్యోతిబాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మానికి పార్టీ సీనియర్ నాయకులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. పీఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు ఉద్యమంలో స్ఫూర్తిదాయకమైన పాత్రను కామ్రేడ్ జ్యోతిబసు నిర్వహించారని, స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. ధనిక కుటుం బంలో పుట్టినా, పేద ప్రజల ఉన్నతి కోసం పోరాడారన్నారు. ట్రేడ్ యూనియన్ ఉద్య మం లో ఆయన ఉన్నంతవరకు క్రియాశీలకంగా ఉన్నారని అఖిలభారత సీఐటీయుకు ఉపాధ్య క్షుడు కొనసాగారన్నారు. ఆయన క్రమశిక్షణ కలిగిన నిబద్ధత కలిగిన గొప్ప నా యకులని ఈ సందర్భంగా వారు అన్నారు. కోమటి రవి మాట్లాడుతూ ప్రజలలో మమేకమై, ప్రజా జీవితమే సుసం పన్నమనదని ఆచరణలో రుజువు పరిచిన గొప్ప విప్లవ యోధుడన్నారు. అనంతరం సభ్యులం దరూ జ్యోతిబాసు చిత్రపటానికి పూలను వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, ఆర్ ఎస్ ఆర్ ప్రసాద్, ఎబి చారి బంగారు నర్సింగరావు, జి శివరామకష్ణ, శ్రీనివాసరావు,గౌస్య, శోభ, శారద పాల్గొన్నారు.

ప్రధానికి స్వాగతం పలికిన కేంద్ర మంత్రులు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

వరంగల్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనల ప్రారంభో త్సవాలు చేసేందుకు భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మేడ్చల్- మల్కా జిగిరి జిల్లాలోని హకీంపేట విమానాశ్రయానికి శనివారం చేరుకొన్నా రు. విమానాశ్రయంలో ప్రధాన మంత్రి మోదీకి ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, మాజీ ముఖ్య మం త్రులు కిరణ్‌కుమార్‌రెడ్డి, నాదెండ్ల భాస్కంరావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

దివ్యాంగులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వినతి



నవతెలంగాన-జవహర్‌నగర్

దివ్యాంగులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వికలాంగుల రాష్ట్ర అధ్యక్షుడు గుత్తి కొండా కిరణ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మేరుగు శివ అన్నారు. శనివారం గ్రేటర్ హైదరా బాద్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీరోనాల్డ్ రోస్ ఐఏఎస్‌ని వివిధ సంఘాల బృందంతో కలిసి దివ్యాంగుల సమస్యలను వివరిం చారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం, స్థానిక సంస్థలు, స్థానిక ప్రభుత్వాలు గ్రేటర్ హైదరాబాద్ లాంటి మున్సిపల్ సంస్థలు బాధ్యతగా వారి కోసం స్వతంత్రంగా కార్యక్రమాల కోసం 5శాతం బడ్జెట్ కేటా యిం చాలని, వికాసం విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పనిచేసే వారికి ప్రత్యేక సౌకర్యాలు, కల్పించాలని, డబుల్ బెడ్ రూమ్ కేటాయింపులో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 5శాతం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమం లో నల్గొండ శ్రీను దివ్యాంగుల నెట్‌వర్క్ కిరణ్ గుత్తికొండ, బండ జగన్, గ్రేటర్ హైదరా బాద్ ఉద్యోగుల సంఘం నాయకులు, మహేశ్, ఇండియా, వికంగుల క్రికెట్ క్యాప్టన్, మేడ్చల్ జిల్లా ప్రెసిడెంట్ మెరుగు శివ కష్ణ పాల్గొన్నారు.

'రోడ్డు మధ్యలో ట్రాన్స్‌ఫార్మార్ సమస్యకు పరిష్కారం



నవతెలంగాణ-కంటోన్మెంట్

చర్లపల్లి డివిజన్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ శ్రీశైలం, అసో సియేషన్ మెంబెర్స్ చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కలిశారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ రోడ్డు మధ్యలో ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు వాహ నదారులు తెలిపి వినతి పత్రాన్ని అందజేశారు. కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీ.ఆర్.ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా షెట్టర్లు ఏర్పాటు

పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని వాసవి శివానగర్, శుభోదయంనగర్‌కాలనీ,సోనియాగాంధీ కాలనీ ప్రధాన రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా షట్టర్లను ఏర్పాటు చేస్తున్నారని కాప్రా సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికా రులు పట్టించుకోవడం లేదని స్థానిక కాలనీ వాసులు తెలి పారు. బుధవారం కాలనీవాసులు మాట్లాడుతూ సర్వే నెంబర్199 స్థలాల్లో ఏర్పాటు చేస్తున్న షెట్టర్లకు, వాణిజ్య సముదాయాలకు జీహెచ్‌ఎంసీ నుండి పన్ను లను విధిం చాల్సిన అవసరం ఎంతైనా ఉందని, స్థానిక అధికార పార్టీ నాయకుల అండతో డబ్బులు దండుకొని చూసి చూ డనట్లు గా వదిలేస్తున్నారని, దాని వల్ల జీహెచ్‌ఎంసీకి రా వాల్సిన ఆదాయానికి గండి పడుతున్నన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధి,కారులు స్పందించి చర్యలు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాన-మల్కాజిగిరి

గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మీర్జాల్ గూడ పవన్ మోటార్స్ దగ్గర రూ.26 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావు, కార్పొ రేటర్ మేకల సునీత రామూ యాదవ్‌తో కలిసి శనివారం పనులు ప్రారంభించారు. అనంతరం మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నాదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, కార్పొ రేటర్ ప్రేమ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకుడు మేకల రామూయాదవ్, నాయ కులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట



● కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

యువత అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేత రాజు ఆధ్వర్యంలో రాజీవ్ గృహకల్ప ఏరియా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి హాజ రయ్యారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేసి వారిని ప్రోత్సహిస్తున్న ఈగ శ్వేత రాజును ప్రత్యేకంగా అభినంది ంచారు. కాంగ్రెస్ పార్టీ యువతకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు ముప్పా రామారావు, ఏనుగు సంజీవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సుమేష్, కీసర మండల నాయకులు దయానంద్ గౌడ్, కందాడి సత్తిరెడ్డి,నల్ల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని జొన్న బండసాయి బృందావన్ కాలనీలో మౌలిక వస తులు కల్పించాలని వెల్ఫేర్ అసోసియేషన్ నాయ కులు శనివారంస్థానిక కార్పొరేటర్ రాజ్ జితేం ద్రనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలో అంతర్గత రోడ్లు(వైట్ టాపింగ్),డ్రయినేజీ, పార్క్ అభివృద్ధి చేయాలని కోరారు. స్పందించిన కార్పొ రేటర్ మాట్లాడుతూ ప్రతీ కాలనిని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని స్పష్టం చేశారు. కాలనీ వాసులు తనకు చెప్పిన సమస్యలన్నీ ఎమ్మెల్యే హన్మంతరావు దృష్టికి తీసుకెళ్లి ఆయన సహకా రంతో అభివృద్ధి చేస్తానని ఆయన కాలనీవాసులకు హమీని చ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ ఎం జోగి రాజు, గౌరీ శంకర్, వెంకటేష్ గౌడ్, కొండల్ రెడ్డి, రఘుపతిరెడ్డి, కిరణ్ కుమార్ ,బాలరాజ్, శ్రీనివాస్, శ్రీనాథ్ , వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్ హమాలి కార్మికుడు మృతి



నవతెలంగాణ-ధూల్‌పేట్

గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో హమాలి కార్మికుడిగా పనిచేస్తున్న కృష్ణ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందు రాత్రి మృతి చెందాడు. హమాలి యూనియన్ నగర కార్యదర్శి బి.రాములు, సీఐ టీయు నగర్ నాయకులు విఠల్, హమాలి కార్మి కులతో కలిసి గుడిమల్కాపూర్ అల్లూరి సీతారామరాజు ఆయన నివా సంలో ఆయనకు నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేవారని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-మేడ్చల్



మేడ్చల్ మున్సిపాల్టీ బస్తీకి చెందిన తాజముల్ హక్‌కు రూ.40వేలు, డి.విజయలకు మంజూరైన రూ.25వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మేడ్చల్ మున్సిపల్ యువ నాయకుడు అత్వెలి సందీప్ గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి, ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నాయకులు సందీప్ గౌడ్, వార్డు అధ్యక్షుడు నాచారం మహేష్ యాదవ్, ఉపలాంచి భాస్కర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా కృషి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ధరణి నగర్‌లో డ్రయినేజీ పనులు, అలాగే రోడ్లకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకు రాగా కార్పొరేటర్ స్పందించారు. శనివారం ధరణి నగర్‌లో పాదయాత్ర చేసి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని హైటెన్షన్ లైన్ రోడ్డులో డ్రయినేజీ, వాటర్ లైన్ సమస్యలు, కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో సీఈసీ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అతి త్వరలో నిర్మాణ పనులు చేపట్టే విధంగా కృషి చేస్తానని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, కాలనీ అధ్యక్షులు రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ తీగలను కమ్మేసిన చెట్ల కొమ్మలు !

- స్తంభాలను చుట్టుకున్న కేబుల్ వైర్లు
- వానా కాలం కావడంతో షాక్ కొట్టే అవకాశం

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ తీగలను చెట్ల కొమ్మలు కమ్మేస్తున్నాయి. కేబుల్ వైర్లు స్థంబాలను చుట్టుకుని ఉంటున్నాయి. అయితే ప్రస్తుత వర్షా కాలం కావడంతో ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం మొదలవడానికి ముందే విద్యుత్ వైర్లపై అల్లుకున్న తీగ జాతి మొక్కల తీగలను, చెట్ల కొమ్మలను, తొలగించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. స్థానిక ప్రజలు భయం గుప్పిట్లో ఉంటూ తమ పిల్లలని ఎప్పటికప్పుడు గమనిస్తు ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఫేస్ వన్ కమ్యూనిటీ హాల్ పక్కన ఉండే స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు, ఇండ్ల ముందు ఉండి వాటి కొమ్మలలో నుంచి కరెంట్ వైర్లు ఉండటంతో తమ పిల్లలు ఆడుకుంటూ చెట్ల వద్దకు పోవడం వల్ల



, వర్షాలు పడ్డ సమయంలో ఎర్తింగ్ రావడం, కరెంట్ షాక్ కొట్టడం జరుగుతుందనీ స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కాబట్టి విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి, కరెంట్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మలను, వాటికి అల్లుకున్న తీగలను తొలగించాలని కోరుతున్నారు. అలాగే విద్యుత్ స్తంభాలకు చుట్టిన కేబుల్ వైర్లు ఒక్కో చోట స్తంభాల నుంచి కిందకు వెలాడుతు ఉండటం వల్ల, ద్విచక్ర వాహనాలపై వచ్చే వారు ఏ మాత్రం అజాగ్రత్తగా నడిపినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి విద్యుత్ స్తంభాల కేబుల్ వైర్లను విద్యుత్ స్తంభాలకు చుట్టకుండా ఉండేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవలసిందిగా స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆల్విన్ కాలనీ సబ్ స్టేషన్ ఏఈ. శరత్‌బాబును వివరణ కోరగా ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా ఇబ్బంది కరంగా ఉన్న చోట తప్పకుండా కొమ్మలు కొట్టేస్తామని తెలిపారు. సంవత్సరానికి రెండు సార్లు కరెంట్ తీగలపై పడే చెట్ల కొమ్మలను కొట్టేయడం జరుగుతుందని, ఒకటి జనవరి నెలలో, మరోసారి జూలై నెలలో చేపడతామన్నారు. అందులో భాగంగా ఈ నెల 11వ



తేదీ నుంచి 18 వ తేదీ వరకు విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉండే కొమ్మలను కొట్టేస్తామని తెలిపారు. ఆ సమయంలో 4-5 గం॥ల వరకు విద్యుత్ అంత రాయం ఏర్పడుతుందని చెప్పారు. విద్యుత్ స్తంభాలకు చుడుతున్న కేబుల్స్ కారణంగా, సిబ్బందికి సైతం స్తంభాలు ఎక్కడానికి, దిగడానికి ఇబ్బంది కరంగా ఉందని, వాటికి సంబంధించి ప్రత్యామ్నాయ చర్యలకు పై అధికారులకు, ఎమ్మెల్యేకు తెలియజేశామని.. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటులో సీపీఐ పాత్ర

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో ప్రభుత్వ సూపర్ స్పెషాల్టీ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని గతంలో సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం, ధర్నాలు నిర్వహించామనీ, అందులో భాగమే నేడు వైద్య కళాశాల మంజూరైందని సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యద ర్శి ఈ.ఉమా మహేష్ అన్నారు. ప్రభుత్వం మేడ్చల్- మల్కా జిగిరి జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటుకు చేసిన ప్రకటనను సీపీఐ హర్షిస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు గతంలో హామీ ఇచ్చినట్టు బస్ డిపో, జూనియ ర్ కళాశాల, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులుగా ఎన్ని పోరాటాలు, ఉద్యమాలైనా చేసి సాధిస్తామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. డివిజన్ పరిధిలోని నందమూరి నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో, కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్ల వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టా లన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయ శక్తుల కృషి చేస్తా నన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మీ కాలనీలో కానీ, మీ బస్తీలో కానీ ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను కానీ, కార్పొరేటర్ కార్యాలయాన్ని కానీ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో దోహదం



- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతగానో దోహదపడుతుందని హైదర్నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రాంనరేశ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో కల్వరి టెంపుల్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కల్వరి టెంపుల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాజేష్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలతో కూడిన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన వైద్యులు, స్త్రీల వైద్యులు, చిన్న పిల్లల వైద్యులు, ఎముకలకు సంబంధించిన వైద్యులు, చర్మ వైద్యులు, నేత్ర వైద్యులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితంగా అందించారన్నారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో 18 రకాల రక్త పరీక్షలు, బీపీ, షుగర్, గైనకాలజీ, ఆర్థో, ఈసీజీ, ఈఎన్టీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, ఎక్సరే అర్హులైన వారికి ఉచిత కండ్ల జోడులు, ఉచిత మందులు పంపిణీ వంటి మొదలగు సేవలు ఒకే చోట ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆరోగ్యం వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో సామాజిక దక్పథంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమ ంలో డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కుమార స్వామి, నాయకులు సింధం శ్రీకాంత్, వెంకటేష్ యాదవ్, రాఘవేందర్ రెడ్డి, నర్సింగరావు, రాము, రషీద్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్ ముఖ ద్వారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ ప్రధాన రహదారిలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ముఖద్వారాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన ముఖ ద్వారాన్ని అత్యంత సుందరంగా రూపొందించారని జూపల్లి సత్యనారాయణకు అభినందనలు తెలిపారు.

రవి చంద్రకళకు నివాళ్లర్పించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కూకట్‌పల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు రవి చంద్రకళ అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మృతి చెం దారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శనివారం ఆమె భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లుగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్‌కు చెందిన బీజేపీ మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ ఎస్.కె.హుస్సేన్, డివిజన్ మహిళా జనరల్ సెక్రెటరీ ఎస్.సితార, జగద్గిరిగుట్ట డివిజన్ సోమయ్యనగర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు డి.మల్లేష్, కె.ఈశ్వరమ్మ వారి బందం 250 మందితో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో శనివారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకుడు ఆబిద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ యావత్ దేశానికే ఆదర్శవంతంగా దూసుకుపోతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి తమ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి పథకాలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. అతి తక్కువ కాలంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. పార్టీలో కష్టపడిన వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను పార్టీలో చేరిన కార్యకర్తలు ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లేలా కృషి చేసి రాబోయే రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండా ఎగరేసేలా పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుట్టుగా నగరంలో గంజాయి సరఫరా



- ఏడుగురు నిందితుల అరెస్టు
- 4.1కిలో గంజాయి, ఆరు సెల్‌ఫోన్ల స్వాధీనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సరఫరా చేస్తున్న ఏడుగురు నిందితులను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్సు తోపాటు నారాయణగూడా, లాలాగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4.1 కిలో గంజాయి, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం డీసీపీ రాధాకిషన్‌రావు వివరాల ప్రకారం ఒడిస్సాకు చెందిన షేక్ ఆసీఫ్, ఆరీఫ్‌ఖాన్, మహ్మద్ అబ్దుల్ రహెమాన్, ఎం.అలీఖాన్, తౌఫిక్ దివాన్, న్యూ బోయిగూడాకు చెందిన ఏ.సుశీల్ కుమార్, హెచ్ సాయి కార్తిక్‌లు ఒక ముఠాగా ఏర్పాడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్న ఈ ముఠా నారాయణగూడా, విఠల్‌వాడీ, లాలాగూడా తోపాటు నగరంలోని వివిధ ప్రాంతాలల్లో ఇండ్లను అద్దెకు తీసుకుని నివాసముంటున్నారు. ఒడిస్సా రాష్ట్రం నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేస్తున్న నిందితులు గుట్టుచప్పుడు కాకుండా నగరంలో అధిక ధరలకు సరఫరా చేస్తున్నారు. సమాచారం అందు కున్న టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ టీ.శ్రీనాథ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ కే.శ్రీకాంత్, ఎస్ఐలు బీ.అశోక్‌రెడ్డి, పీ.గనదీప్‌లు నిందితులపై ప్రత్యేక నిఘా వేసి పక్కా సమాచారంతో నిందితులను అరెస్టు చేశారని డీసీపీ రాధాకిషన్ రావు తెలిపారు.

నిమ్స్ డాక్టర్ స్వర్ణలతకు పురస్కారం

నవతెలంగాణ-సిటీబ్యూరో



పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్ నెఫ్రాజిబి భాగం విభాగాధిపతి డాక్టర్ స్వర్ణలతకి అరుదైన పురస్కారం దక్కింది. శుక్రవారం నగరంలోని మారిగోల్డ్ హెూ టల్‌లో 'ఇండి గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సంస్థ సీఈవో, ఎడిటర్ ఇన్ చీఫ్ సుధీర్ గౌతమ్, పంజాబ్ ప్రభుత్వ వైద్యారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ కార్తీక్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, ఇతర ప్రముఖులు హాజరై వివిధ విభాగాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించిన వైద్యులను పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిమ్స్ హాస్పిటల్ ప్రొఫెసర్ స్వర్ణలతకి 'బెస్ట్ హార్డ్ వర్కింగ్ ఉమెన్' విభాగంలో పురస్కారం లభించింది. నిమ్స్ హాస్పిటల్‌కి ఈ పురస్కారం దక్కడం పట్ల డైరెక్టర్ బీరప్ప స్వర్ణలతను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ డాక్టర్ గంగాధర్, జమ్మూ కాశ్మీర్ డిజిటల్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ శఫ్కత్ ఖాన్, వరల్డ్ బ్యాంక్ ఎకనామిక్ అడ్వైజర్ డాక్టర్ సుధా చంద్రశేఖర్, పాల్గొన్నారు.

నేతాజీ పాఠశాలలో కెప్టెన్ ఎలక్షన్స్, ఫ్రెషర్స్ డే కార్యక్రమాలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఓటు గొప్పతనం తెలియజేసేందుక, ఓటు గొప్పతనాన్ని చిన్ననాటి నుంచే తెలియజేయాలనే ఉద్దేశంతో నేతాజీ పాఠశాలలో శనివారం ఎన్నిక ద్వారా కెప్టెన్, వైస్ కెప్టెన్‌ని రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా 2023-24 సంవత్సరానికి గాను ఎం.సంకీర్తన కెప్టెన్‌గా, ఎం.గ్రీష్మ వైస్ కెప్టెన్‌గా గెలుపొందారు. నూతన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్ మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాస్ రావు పాల్గొని విద్యావిధానంపైన సూచనలు చేశారు. సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి గురువులు చెప్పినట్టు నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులు విద్యను ఇష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రికగ్నైజ్ స్కూల్స్ మేనేజిమెంట్ అసోసియేషన్ (ట్రస్మా) స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చింతల మల్లేశం, కరస్పాండెంట్ మహేష్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ నందిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఎస్‌సీ 2023లో మంచి గ్రేడ్ సాధించి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేసి అభినందించారు.

డప్పు వాయిద్య కళాకారులకు డప్పులు పంపిణీ

నవతెలంగాణ-శామీర్‌పేట



మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో శనివారం స్థానిక ఉప సర్పంచ్ కటికెల వైద్యనాథ్ అదే గ్రామానికి చెందిన డప్పు వాయిద్య కళాకారులకు డప్పులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దండు రాజేష్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కటికేల వెంకటస్వామి, గ్రామ పెద్దలు కీసరి నర్సింహులు, వీరేశం సీటు, బందెల యాదగిరి, కటికేల గోపి, కటికెల సంజీవ, కావలి సందీప్ పాల్గొన్నారు.

మహెూన్నత నేత వైఎస్సార్

నవతెలంగాణ-శామీర్ పేట



నిరుపేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహెూన్నత నేత స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 74 వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో శనివారం తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాజశేఖర్ రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డికాంగ్రెస్ నాయకులతో కలిసి వైఎస్సాఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్



- ఐటీ విద్యార్థి ఎ.సాయి సింధూరకు రూ.11లక్షల ప్యాకేజీ

నవతెలంగాణ-మేడ్చల్

మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 2019 నుంచి 2023 బ్యాచ్ విద్యార్థుల ప్లేస్ మెంట్ సక్సెస్ మీట్‌ని కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ డా.ఎన్ శ్రీకాంత్ మాట్లాడుతూ తమ కళాశాలలో 519 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ సాధించారనీ, అందులో అత్యుత్తమ ప్యాకేజీ రూ.11 లక్షలు సాధించగా, యావరేజ్ రూ.4 లక్షల ప్యాకేజీతో 100శాతం స్టూడెంట్స్ ప్లేస్‌మెంట్స్ పొందినట్టు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.శ్రీలత మాట్లాడుతూ అర్హత గల విద్యార్థులందరూ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. గతంలో కరోనా ఉన్నప్పటికీ ఆన్‌లైన్ ద్వారా క్లాసులు నిర్వహించామనీ వాటిని విద్యార్థులు సద్వినియోగించుకుని ఉద్యోగాలు సాధించినందుకు విద్యార్థులను అభినందించారు. అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ ప్రథమంగా మీరు మీ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలపాలన్నారు. టెక్నాలజీలో ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి మాట్లాడుతూ పనిచేసే చోట నిబద్ధతతో పని చేయాలనీ, డ్రెస్ కోడ్, ఆలోచనా విధానం చాలా ముఖ్యమని తెలిపారు. సెక్రెటరీ టి.వి.రెడ్డి మాట్లాడుతూ చేస్తున్న సంస్థలో నిబద్ధత కలిగి పని చేయాన్నారు. ఉద్యోగంలో చేరిన తర్వాత వారి అమూల్యమైన విలువలు కాలేజీకి అందించాలని కోరారు. అనంతరం టీపీఓ డా.ఎన్ శ్రీకాంత్‌ని అభినందించారు. అత్యధిక ప్లేస్‌మెంట్స్ సాధించడానికి కారణమయ్యారని కొనియాడారు. 2019లో పాసైన ఈసీఈ విద్యార్థి ప్రేమ్ కాలేజీ ప్లేస్‌మెంట్‌లో రూ.3.5 లక్షలకు ప్లేస్‌మెంట్ సాధించి ఇప్పుడు ఆ విద్యార్థి రూ.1.25 కోట్లు సంపాదిస్తున్నట్టు తెలిపారు. గెస్ట్ ఆఫ్ ఆనర్ ఎ.రాజశేఖర్ రెడ్డి, సీనియర్ హ్యూమన్ రీసోర్స్ ఎగ్జిక్యూటివ్, వెస్ట్ అజై ల్ లాబ్స్ మాట్లాడుతూ ప్లేస్‌మెంట్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు. క్రమశిక్షణ, నడవడిక ప్రాముఖ్యతను వివరించారు. ఎక్స్పీరియన్స్ ఉన్న వారి కంటే నైపుణ్యం ఉన్నవారికే విలువ ఉంటుందనీ, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ఐటీ విద్యార్థిని ఎ.సాయి సింధూర రూ.11లక్షల ప్యాకేజీతో ఎంపికైన సందర్భంగా తల్లితండ్రులు లక్ష్మి నారాయణ, నాగలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. ఎక్కడ నుంచి వచ్చాం అనేది మర్చిపోకూడదు అనీ, డబ్బులను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. మీరు మీ జీతంలో చదువుకోలేని పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ టి.బాలరెడ్డి, కళాశాల సెక్రెటరీ టి.వి.రెడ్డి, ప్రిన్సిపల్ డా.కె.శ్రీలత, అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, డైరెక్టర్ ఉప్పల రాజేశ్వర్, టిపిఓ డా.ఎన్ శ్రీకాంత్, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవో 59 బాధితుల సమస్యలను పరిష్కరిస్తాం

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లో 59 జీఓ ప్రకారం, ప్రభుత్వం కల్పించిన ఇండ్ల క్రమబద్ధీకరణలో బాగంగా, రుసుం చెలింపులో ఒక్కొక్కరికి ఒక్కో విధంగా రూ.లక్షల్లో డబ్బులు చెల్లించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. రుసుం చెల్లించని యజమానుల ఇండ్లను జేసీబీ లతో కూల్చేందుకు శనివారం సిబ్బందితో కలిసి తహశీల్దార్ వచ్చారు. సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఘటనా స్థలానికి చేరుకుని ఇండ్లు ఎలా కూలుస్తారని వారించి అధికారులను తిరిగి పంపించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పాల్పడుతున్న ప్రభుత్వంలో పలువురు అధికారుల అవగాహనా లోపం ప్రజలకు ముప్పుగా వాటిల్లిందని తెలి పారు. 58, 59 జీఓ లో 80, 160 గజాలు గల వారికి ఒక్కొక్కరికి రూ.2 లక్షలు ఆపై వస్తే మరి కొందరికి రూ.20, 30, 40, 80 లక్షల వరకు రావడం అధికారుల పొరపాటేనని గాంధీ తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డితో కలిసి సంబంధిత కలెక్టర్, మంత్రుల కు నివేదిక సమర్పించామని తెలిపారు. విషయం తెలియని తహశీల్దార్ అధికార సిబ్బంది సొంత నిర్ణయాలతో, ఉన్నతా ధికారులకు సరైన సమాచారం అందించకుండా, ఇండ్లను కూల్చేందుకు రావడంపై గాంధీ మండిపడి అధికారులను అక్కడి నుంచి పంపించారు.

IN THE COURT OF THE XXII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS: AT HYDERABAD.
O.S. No.1403 OF 2020

BETWEEN:-
Canara Bank, R.K.Muth Branch, Hyderabad ...Plaintiffs

And

Sri. B.Raju and another. ...Defendant-2

To
Sri. Praveen Kumar S/o.Raj Lingaiah, aged about 42 years, R/o. H.No.1-2-366/B/137, Domalguda, Hyderabad.

Take notice that the above named Plaintiffs have instituted the above suit against you for recovery of Rs. 80,604/- together with costs and future insterest. You are hereby summoned to appear before the Hon'ble Court in person on the **07th August, 2023, at 10.30 am.** In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

BY ORDER OF THE COURT
N. VENUGOPALA RAO
ADVOCATE
1-2-234/2/1, Plot No.2/p, Road No.4, SRL Colony, Kothapet, Hyderabad.

IN THE COURT OF HON'BLE XI ADDL JUNIOR CIVIL JUDGE:CCC : : AT HYDERABAD
O.S.NO.131 OF 2022

Between:
Mrs.Parasa Santha Kumari, &Others ...Plaintiff/s No.1 to 3

And

1. All Concerned & Another
2. The Thasildhar, Secunderabd,Telangana-09. ...Defendant/s

To,
1. All Concerned
2. The Thasildhar, Secunderabd,Telangana-09.

Whereas the Plaintiffs No.1 to 3 have filed suit for Declaration to declare them as Legal heirs of Late Sri Tata Venkata Vittal who died on 04-10-2010 for legal status and for other reliefs in respect of schedule property to show before authorities and if Defendants No.1 & 2 or any person having any claim or any objection towards the same to appear either in person or through Pleader on 12 th Day of July, 2023 at 10:30a.m. forenoon before the above mentioned Court. If No.1 &2 or any person fail to appear the Court shall proceed and decide the matter ex-parte against you.

SCHEDULE OF PROPERTY

All that the Equity Shares No.100, with Distinctive Nos.0994501 to 0994600, Registered Folio No.V00451, Certificate No.03857, held in BMD Foundry Machinery Limited, 57, Road, Bangalore-560046 by shareholder Late Sri.Tata Venkata Vittal

"BY THE ORDER OF THE COURT"
M/s. SRIHARI BATHINA
Advocate
H.NO.11-7-83(C-82), HUDA COLONY, SAROORNAGAR, HYD-BAD, TELANGANA-035.

IN THE COURT OF THE M.A.C.T CUM XXV ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.P.No. 1589 of 2022

Between:
P.Kalyan @ Kalyan Kumar ...Claimant

And

M/S Sarvahitha Educational Society & Others ...Respondents

To,
Pittala Govindu S/O P.Venkataiah
R/O S.R.Digi School, Plot No.9 Jayanthi Nilayam, Opp Sampurna Super Market, O.U.Colony, Lacho Hills Road
Manikonda, Gandipet, Hyderabad

Whereas the above petitioner has filed petition ror compensation under Motor vehicle Act against M/S Sarvahitha Educational Society & Others. The said case is posted on **19-07-2023** for your appearance before the above said court at **10-30 AM** if you failed to appear on that day either in person or through advocate before the said court the matter will be heard exparte,

// BY ORDER OF THE COURT //
M. RAM MOHAN
ADVOCATE
Plot No. 174, Venkateshwara Nagar Colony, Suchitra, Sec-bad

IN THE COURT OF THE ADDL. DIST. JUDGE-CUM-SPL. SESSIONS JUDGE (FOR TRAIL OF CASES AGAINST WOMEN) AT NALGONDA
M.V.O.P.No. 2 OF 2022

Between:-
MASIMUKKU @ SARNALA PALLAVI & OTHERS ....Petitioner

And

MOHAMMED ASHFAQ AHMED & OTHERS ....Respondents

To,
BALU KOMBLAY, S/o. Mukeed, Aged 27 years, Occ. Driver of LORRY bearing No. MH 12 KP 1214,R/o. H.No. 10/9, Katewadi TQ, Basavakalyan District, BIDAR, KARNATAKA State-585 327. (R3)

Take notice that the above named petitioner filed the above M.V.O.P. against you and the other Respondents for compensation due to RTA accident and the case is posted on 28-07-2023 for your appearance.

Therefore you are hereby informed to be present on 28-07-2023 at 10-30 A.M in person or through pleader failing which the matter will be decided against you in your absence.

// BY ORDER OF THE COURT //
NETHI RAGHUPATHI
Advocate,Nalgonda.
Cell:9848924869.

IN THE COURT OF THE VIII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 4323 of 2021

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager (Law) & Authorized Officer, ...Plaintiff

And

Sri.M.Sathyam, ...Defendant

To
Sri.M.Sathyam, S/o.M.Yadagiri,
Aged about 41 Years, Occ: Business,
R/o. H.No.1-8-139/5, Ram Mandhir Line, Temple Alwal, Secundrabad, T.S-500010.
& H.No.7-12, Near Pochamma Temple, (Vill) Nagapuri, (M.O) Cherial, Dist.Warangal, T.S-506223.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.1,81,806-33ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 14-07-2023.

In case of your failure to attend before the Court on **14-07-2023 at 10-30 A.M.** either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYDERABAD-50.

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL SENIOR CIVIL JUDGE- CUM – IV ADDL. ASSISTANT SESSION JUDGE RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR
O.S.NO. 1465 OF 2018

Between:
M/s Vijaya Bank
(Now Bank of Baroda)
(Gachibowli Branch) ...Petitioner/Plaintiff

And

Shri Srihari Nandi, and Another ...Respondents/Defendants

TO
1). Shri Srihari Nandi, S/o Narayana, R/o H. No. 1-4-880, Chakkilams Ayesha Mansion, G-2, Bakaram, Gandhi Nagar, Hyderabad-500 080.
2). Smt. Aruna Devi Nandi, W/o Shri Srihari Nandi, R/o H. No. 1-4-880, Chakkilams Ayesha Mansion, G-2, Bakaram, Gandhi Nagar, Hyderabad- 500 080. ...DEFENDANTS

Whereas, the Plaintiff Bank has instituted the suit for recovery of money against the above referred Defendants for a sum of Rs. 5,36,239/- (Rupees Five Lakhs Thirty Six Thousand Two Hundred and Thirty Nine Only) together with current and future interest, costs and for other reliefs. The above mentioned Defendants are therefore hereby directed to appear before the Hon'ble Court on **20.07.2023 at 10.30 AM** in person or by a Pleader/Advocate duly instructed as to why the relief prayed for should not be granted. Take notice that in case of default the suit will be heard and determined ex-parte in your absence

///BY ORDER OF THE COURT//
M.SRINIVAS
COUNSEL FOR PLAINTIFF
Flat No. 501, 5th Floor, Maturi Bhavan, H.No. 3-4-764 & 499/4, Barkatpura, Hyderabad– 500 027

చీరలను పంపిణీ చేసిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

ఆషాఢ బోనాలు మహోత్సవం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి తార్నాకలోని డిప్యూటీ క్యాంపు కార్యాలయంలో తార్నాక డివిజన్‌కు చెందిన జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు శనివారం చీరలు పంపిణీ చేశారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ దేశవ్యాప్తంగా చేయాలి



నవతెలంగాణ-అంబర్‌పేట్

దేశవ్యాప్తంగా ఫీజు రియంబర్స్ పథకాన్ని అమలు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ ఆధ్వర్యంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నీ కలిసి మధ్యప్రదేశ్ రాష్ట్రంలో బీసీలకు కావాల్సిన ఫీజు రియంబర్స్‌మెంట్, గురుకుల పాఠశాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

'ప్రతి పేదవాడి గుండెలో వైఎస్ఆర్ ఉంటారు'



నవతెలంగాణ-బంజారాహిల్స్

వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతి పేదవాడి గుండెల్లో ఉంటాడని పలువురు కాంగ్రెస్ నేతలు అన్నారు. శనివారం వైఎస్ఆర్ జయంతి ఉత్సవాలను బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లో పంజాగుట్ట సెంట్రల్ సర్కిల్ వద్ద విగ్రహానికి భట్టి విక్రమార్క, మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి, విజయారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదల గుండెలో చిరస్మరణీయంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉంటారని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేశాయన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయాలనే వైఎస్ఆర్ ఆశయం త్వరలోనే నెరవేతుందని తెలిపారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలోని మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణలో ప్రధాని మోడీ అడుగుపెట్టడం సిగ్గుచేటు

- నేటికీ రాష్ట్ర విభజన హామీలు అమలు చేయలేదు
- మోడీ గో బ్యాక్ అంటూ సీపీఐ, ప్రజా సంఘాల నిరసన

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణలో అడుగుపెట్టడం సిగ్గుచేటని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల మల్లేష్ విమర్శించారు. ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ హైదరాబాద్, మఖ్దూమ్ భవన్ నుంచి హిమాయత్‌నగర్ 'వై' జంక్షన్ వరకు సీపీఐ ప్రజా సంఘాలు బీకేఎంయూ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, ఏఐటీయూసీ, డీహెచ్‌పీఎస్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, తెలంగాణ ప్రజానాట్య మండలి, ఐఏఎల్, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య, తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం, తెలంగాణ రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి ఇతర ప్రజా సంఘాలు శనివారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. విభజన హామీలు నెరవేర్చాలి, 'మోడీ గో బ్యాక్' అంటూ పెద్ద ఎత్తున సీపీఐ శ్రేణులు నినాదాలు చేశారు. అనంతరం పశ్య పద్మ, ఎస్.బాలమల్లేష్ మాట్లాడుతూ..కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారం, ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయకుండా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వరంగల్‌కు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. కేవలం వరంగల్ ప్రాంతా ప్రజలను మభ్యపెట్టి ఓట్లు కొల్లగొట్టేందుకు మాత్రమే మోడీ వచ్చారని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే వారన్నారు. తెలంగాణలోని నిరుద్యోగులకు వేలాది మందికి ప్రత్యక్షంగాలో పరోక్షంగానూ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర విభజన చట్టంలో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశాన్ని పొందుపరచాలన్నారు. కానీ మోడీ ఫ్యాక్టరీ ఏర్పాటు అంశాన్ని పక్కనపెట్టి కేవలం వ్యాగిన్, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం కోసం రావడం అంటే తెలంగాణ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, కార్యదర్శి బి.వెంకటేశం, ఐఏఎల్ జాతీయ కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకట్ రాములు, బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షులు కె.కాంతయ్య, తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ వలీల్లా ఖాద్రి, ప్రజా సంఘాల నేతలు ఓరుగంటి యాదయ్య, వెంకటేష్, కోహెడ సృజన్ కుమార్, బోయిని అశోక్, లొడంగి శ్రవణ్, ఎ.రాజ్ కుమార్, ఉషశ్రీ, సహదేవ్, ఆరుట్ల రాజ్ కుమార్, కమతం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని పనులు నిలివేత

- ఆఫీస్ గోడలపై వాల్‌పోస్టర్లు అంటించిన వైనం
- రూ. 5కోట్లతో జీహెచ్ఎంసీ సర్కిల్ 19 నూతన భవనం,సెల్లార్, జీప్లస్ త్రి భవనం పనులు ప్రారంభం, మధ్యలోనే నిలుపుదల



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఆరు నెలలుగా జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించుటలేదని పనులు నిలిపివేసి, శేరిలింగంపల్లి జోన్‌లోని అన్ని సర్కిల్ ఆఫీసుల వద్ద గోడలపై యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బిల్లులు చెల్లించాలని వాల్ పోస్టర్లు అంటించారు. బిల్లులు చెల్లించే వరకు పనులు చేయబోమని తేల్చి చెబుతున్నారు. బిల్లుల విషయంపై అధికారులను అడిగితే బిల్లులు చెల్లించటం మా పరిధి కాదని చెబుతున్నారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 2వేల మంది కాంట్రాక్టర్లు పనిచేస్తున్నారని అసోషియేషన్ సభ్యులు చెబుతున్నారు. వారందరికీ రూ.9వేల కోట్ల బకాయిలు చెల్లించలేదని పేర్కొన్నారు. శేరిలింగంపల్లి జోన్ లో వెయ్యి మంది కాంట్రాక్టర్లకు రూ.2వేల కోట్లు బకాయి బిల్లులు చెల్లించాలి. ఆ బకాయిలు చెల్లించనందున జులై ఒకటో తారీకు నుంచి పనులు నిలిపివేసినట్టు తెలిపారు. అన్ని సర్కిల్ ఆఫీసుల వద్ద వాల్ పోస్టర్లు అంటించి నిరసన తెలుపుతున్నారు. కాంట్రాక్టర్ల సమస్యలను సీఎం కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములు, ఇండ్లు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చి పనులు చేస్తున్నామని వాపోతున్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండానే మళ్లీ జులైలో రూ.వెయ్యి కోట్ల పనులకు టెండర్ వేశారని తెలిపారు. పాత బిల్లులు చెల్లించాకే కొత్త టెండర్ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలస్యమైతే తమకు వచ్చే డబ్బు వడ్డీలకు మాత్రమే సరిపోతుందని ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో వాల్ పోస్టర్లకు, బ్యానర్లకు వేల కోట్లు ఖర్చు పెట్టారని, కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు చెల్లించుటలేదని మండిపడుతున్నారు. ఇంకా ఆలస్యం అయితే కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.



మోడీ ఫాసిస్టు విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మోడీ ఫాసిస్టు నిరంకుశ విధానాలపై యువత ఐక్యంగా ఉద్యమించాలని, ఉపాధి కల్పించని పాలకులను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ వర్క్‌షాప్ సెషన్ శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన యువజన సంఘం జెండాను ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు సుఖేందర్ మహేసరి ఎగురవేశారు. అనంతరం సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ..సమాజంలోని అన్ని బలహీన వర్గాలు, శ్రామిక వర్గాలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై యువత ఉద్యమించాలని సూచించారు.దక్షిణ భారతంలో బీజేపీ గేట్‌వే మూసుకుపోయిందన్నారు. మోడీ తన వ్యక్తిత్వ వికాసానికి లక్షలాది నిధులు వెచ్చిస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మతపరమైన నినాదాలు, విభజన రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు రాబోతున్నాయని, దీనిపైనే బీజేపీ దృష్టి సారిస్తోందన్నారు. విపక్షాల ఐక్యతతోనే బీజేపీని ఓడించవచ్చని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. కొంత మంది బి-టీమ్ నాయకులు అతనికి సహాయం చేయవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.దేశంలోని అనేక సమస్యలను బలమైన ఉద్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. అనంతరం ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు సుఖేందర్ మహేసరి, ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటుకు పాలకులను ఉద్యమాల ద్వారా యువత మేల్కొల్పాలని సూచించారు.ప్రధాని మోడీ మత ఛాందస విధానాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జాతీయ ఆఫీస్ బేరర్స్ టి.జిస్మాన్, లెనిన్ బాబు, అరుణ్, విక్కీ, హరీష్, భారతి, కరంవీర్ కౌర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నేర్లకంటి శ్రీకాంత్, లింగం రవి, యుగంధర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సల్మాన్ బైగ్, ప్రధాన కార్యదర్శి టి.సత్య ప్రసాద్, 23 రాష్ట్రాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఈవో రోహిణిపై చర్యలు తీసుకోవాలి

- బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రభుత్వ పాఠశాలల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరినందుకు తనను బెదిరిస్తుందని తెలంగాణ స్టేట్ బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విషయంపై గతంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశానని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై హైదరాబాద్ విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణికి దృష్టికి తీసుకెళ్తే గత ఏడాది డిసెంబర్ 20న ఆఫీస్‌కు పిలిపించుకుని బెదిరింపులకు పాల్పడిందని ఆరోపించారు. డీఈవోపై ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణ, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీ దేవసేనలు చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్.టీ.ఐ యాక్ట్ 2005 పిటిషన్స్ వేస్తున్నావు.. నిన్ను సస్పెండ్ చేస్తానంటూ బెదిరించిందని తెలిపారు. డీఈవో వలన తనకు ప్రాణహాని ఉందని వాపోయారు. జనవరి 5న అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రక్షణ కల్పించాలని రాష్ట్ర గవర్నర్, డీజీపీ, సీపీలకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

సాయిచంద్ కుటుంబానికి అండగా ప్రభుత్వం

నవతెలంగాణ-ఓయూ

ఇటీవల అకాల మరణం చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సాయిచంద్ కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటిన్నర నగదు, ఆయన సతీమణి రజినికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాల ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ చైర్మెన్ డాక్టర్ మంచాల లింగస్వామి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. సాయిచందు మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన పోరాటాన్ని, త్యాగాన్ని, అంకిత భావాన్ని గుర్తించి సాయిచంద్ సతీమణి రజినికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్‌గా నియమించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని తెలిపారు.

సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని వినతి



నవతెలంగాణ-ఓయూ

ఓయూలో సైన్స్ కళాశాలలో 2వ, 4వ, సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థులు శనివారం సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.వీరయ్యకు వినతిపత్రం అందజేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 4 నెలలు తరగతులు నిర్వహించిన తరువాతనే పరీక్షలు నిర్వహించాలని కోరారు. నెల పాటు అధ్యాపకులకు సెలవులు ప్రకటించి సిలబస్ పూర్తిముందే పరీక్షలు నిర్వహించడం బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. అదే తేదీల్లో ప్రభుత్వం నిర్వహించే టీజీటీ, పీజీటీ, పరీక్షా తేదీలు ఆగస్టు 1 నుంచి 22 ఆగస్టు వరకు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సైన్స్ కాలేజీ విద్యార్థులు వెంకట్ శివ, ప్రతాప్ రెడ్డి, రాము, సంతోష్, శివ, ప్రసాద్, పవన్, అనిల్, నిఖిల్,పార్థు, పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

పేద విద్యార్థులకు చేయూత నిచ్చేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని విశ్రాంత బీహెచ్ఈఎల్ ఉన్నతాధికారి, రాజపేట చారిటబుల్ ట్రస్టు వ్యవ స్థాపక అధ్యక్షుడు ఆర్. ఆంజనేయులు అన్నారు. బోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ జీహెచ్ఎంసీ సామాజిక భవనంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పేద విద్యార్థులకు స్థానిక బైబిల్ హౌస్ యూపీ హెచ్ సీలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం లక్ష్మీబాయి నోటుపుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. చదువుకు మించిన సంపదలేదన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్య పడుతుందని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎందరో గొప్ప మేధావులయ్యారని గుర్తు చేశారు. పేదలకు చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కె.సువర్చల, వైద్యాధికారి డా.రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

- పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

వివిధ కారణాలతో చీలిపోయిన పీవోడబ్ల్యూ నాలుగు సంఘాలన్ని ఒక్కటిగా ఏర్పాటు చేసి పీవోడబ్ల్యూ అర్ధ శతాబ్ది వార్షికోత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ వెల్లడించారు. శనివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కామన్ సివిల్ కోడ్, ఫాసిజం, మహిళల హక్కులు అణచివేత, విద్య కాషాయీకరణ, మహిళల సమస్యలు తదితర అంశాలపై సదస్సులు, సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత జాతీయత, దేశభక్తి ముసుగులో మతోన్మాదాన్ని రెచ్చగొట్టడంతో పాటు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా మహిళలు, యువతులపై అఘాయిత్యాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో కె.సంధ్య, ఎం.లక్ష్మీ, స్వరూప, అంభిక, శిరోమణి, దీప తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచ రవాణా పరిశోధన సదస్సు'కు ప్రొఫెసర్ కుమార్‌కు ఆహ్వానం'



నవతెలంగాణ-ఓయూ

జూలై 17 నుంచి 21వ తేదీవరకు కెనడాలోని మాంట్రియాల్‌లో జరగనున్న 16వ "ప్రపంచ రవాణా పరిశోధన సదస్సు"లో పాల్గొనేందుకు ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్, పట్టణ, పర్యావరణ ప్రాంతీయ అధ్యయన కేంద్రం, డైరెక్టర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారంకు ఆహ్వానం లభించింది. డబ్ల్యూసీటీఆర్‌లో జరిగే ఓ చర్చలో పాల్గొననున్నారు. "అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ ద్వారా ప్రయాణ ఆలస్యాన్ని తగ్గించటం" అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పిస్తారు. ఈ సదస్సులో 175 దేశాల నుంచి పరిశోధకులు, ప్రొఫెసర్లు, పారిశ్రామిక నిపుణులు పాల్గొంటున్నారు. ప్రతి మూడేండ్లకో సారి ఒక్కో దేశంలో జరిగే ఈ సదస్సులో పాల్గొనేందుకు ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్కరికి మాత్రమే అవకాశం దక్కటం విశేషం. ఇప్పటికే పదహారు దేశాల్లో పర్యటించిన ప్రొఫెసర్ కుమార్ 30పైగా పరిశోధనా పత్రాలు సమర్పించారు.

గోషామహల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు సీకే. మూర్తి అన్నారు. శనివారం కోఠి ఇసామియా బజార్‌లోని మేఘరాజ్ భవన్‌లో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ గతంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ గడపగడపకు కాంగ్రెస్ పార్టీ అనే కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభివృద్ధి చేసిన కమ్యూనిటీహాల్, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, యువతకు ఉపాధి లాంటి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అందించినవే కొనసాగుతున్నాయని చెప్పారు. కొత్తగా ఎలాంటి పథకం ప్రజలకు అందడం లేదని అన్నారు. మళ్లీ గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్‌లలో పార్టీ కార్యకర్తలు బలంగా ఉన్నారని చెప్పారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పార్టీకి పని చేయాలని పులుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికలు త్వరలోనే రానున్నాయని, నియోజకవర్గంలోని ప్రతి గడపకు వెళ్లి, ప్రతి ఓటర్‌ను కలిసి కాంగ్రెస్ అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌తోనే ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పీసీసీ మాజీ కార్యదర్శి బండ అశోక్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ యాదవ్, మైనార్టీ సెల్ సిటీ వైస్ ప్రెసిడెంట్ ఖదీర్, పీసీసీ మీడియా కో-ఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్, గన్ ఫౌండ్రీ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్ యాదవ్, గోషామహల్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ కన్నయ్య లాల్ యాదవ్, అధ్యక్షుడు కైలాస్ సింగ్, దత్తాత్రేయ నగర్ డివిజన్ అధ్యక్షుడు జహంగీర్, జాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్, మంగళహాట్ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్ సింగ్, గోషామహల్ మహిళా అధ్యక్షురాలు రోశీ, హరి, పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

అగ్రకుల అహంకారంతో కులం పేరుతో దూషించిన బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రేణుకుంట్ల ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితుడు కుతాడి కృష్ణ ఎరుకలతో కలిసి మాట్లాడారు. 'రిలయన్స్ బిల్డర్స్' అనే పేరుతో బిల్డర్ సోమూరి రాజేశ్ కిరణ్ కుటుంబ సభ్యులు రియల్ ఎస్టేట్ స్థాపించి కొండాపూర్‌లో ఓనర్స్ ప్లాట్ చూపించి రూ.31 లక్షలు తీసుకున్నారని ఆరోపించారు. ఈ ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే బిల్డర్ రాజేష్ డబ్బు ఇవ్వలేదని ప్లాట్ రిజిస్ట్రేషన్ ఆపేశామని తెలిపారు. అసలు ఓనర్లు వి.కల్పనారెడ్డి భర్త జి.కిరణ్ రెడ్డి తెలిపారని పేర్కొన్నారు. సోమూరి రాజేశ్ కిరణ్‌ను రూ.31 లక్షలు ఇవ్వాలని నిలదీయగా కులం పేరుతో దూషించి పోలీస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకు తెలుసంటూ రెండేండ్లుగా ఇబ్బంది పెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వల్ల ప్రాణహాని ఉందని తక్షణమే వారందరిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బిర్రు యాకస్వామి, కూతాడి కుమార్, చెరుకు రమేష్, కె.విష్ణు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కృషి చేయండి: డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. శ్రీ సత్యసాయి సేవ సంస్థ తార్నాకలోని దక్షిణ మధ్య రైల్వే ఆరోగ్య సంస్థ, మౌలాలి రైల్వే గృహ సముదాయంలో మొక్కలు నాటారు. బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి ఈ కార్యక్ర మానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవీ, సెక్రటేరియట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సాయిల్ హెల్త్ మేనేజ్మెంట్ శశి, శ్రీ సత్యసాయి సేవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రగులుతున్న భూగోళం పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

జాగృతి ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎస్.మల్లారెడ్డి, భీమ్‌రెడ్డి, వేముల గౌరీశంకర్ రావులు పర్యావరణం వాటి స్థితిగతులు, ప్రభుత్వాలు అవలంభిస్తున్న తీరు వివిధ అంశాలపై రచించిన రగులుతున్న భూగోళం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ..సామాజికవేత్తలు రచయితలు దేశ స్థితిగతులను అధ్యయనం చేసి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.


నాయీ బ్రాహ్మణ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాయీ బ్రాహ్మణ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ జన సంస్థ గౌరవాధ్యక్షులు పి. వినోద్ కుమార్, అధ్యక్షులు శ్రీధర్, ఉపాధ్యక్షులు డాక్టర్ సుశీల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న నాయీ బ్రాహ్మణులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఆసక్తి, అర్హత గల వారు 9703168480లో నంబర్‌ను ఉసంప్రదించాలని సూచించారు

పేద ప్రజల కోసమే టీహెూప్ స్వచ్ఛంద సంస్థ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

30 ఏండ్లుగా పేద ప్రజల కోసమే టీ హెూప్ స్వచ్ఛంద సంస్థ స్థాపించి సేవ చేస్తున్నాని టీహెూప్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. వెంగళరావు నగర్ డివిజంలో నివసించే అమీర్ సుల్తాన్‌పై ఆమె భర్త యాసిడ్ దాడి చేశాడు. విషయం తెలుసుకున్న ఉపేందర్‌రెడ్డి ఆమె ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. రహమత్ నగర్‌లో నివసించే ఇటీవల మున్నీ అనారోగ్యం బారిన పడింది. ఆమెకు కూడా వైద్యం కోసం ఆర్థిక సహాయం చేశారు.

బోనాల నిర్వహణకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోనాలను ఘనంగా నిర్వహించాలని వెంగళరావు నగర్ డివిజన్‌లోని జీపీఎస్ దేవాలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే గోపీనాథ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోనాల పండుగను ఎంతో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఆయన వెంట కార్పొరేటర్ దేదీప్‌రావు, రహమత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, తదితరులున్నారు.

త్వరలో అందుబాటులోకి స్టీల్ బ్రిడ్జి

నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

ఇందిరాపార్కు టూ వీఎస్‌టీ వరకు నాలుగు లైన్ల స్టీల్ బ్రిడ్జి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరవాసులకు త్వరలో స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ఎస్ఆర్‌డీపీ చేపట్టిన పనులు ఒక్కొక్కటి అందుబాటులోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ఇందిరాపార్కు టూ వీఎస్‌టీ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఈ బ్రిడ్జి వినియోగంలోకి వస్తే ఇందిరాపార్కు నుంచి విద్యానగర్‌నగర్ వరకు ట్రాఫిక్ కష్టాలు తీరడంతోపాటు వీఎస్టీ నుంచి లక్డీకాపూల్ వైపు ప్రయాణికులకు ఇప్పుడున్న అడ్డంకులు తగ్గే అవకాశాలున్నాయి.

2.8 కిలోమీటర్లు, రూ.3.50 కోట్లు

నగరంలో సిగ్నల్ రహిత ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు అమలు చేస్తున్న ఎస్ఆర్‌డీపీ కార్యక్రమం సుమారు రూ.350 కోట్లతో ఇందిరాపార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని వీఎస్టీ వరకు (ఆజామాబాద్ మీదుగా) చేపట్టిన స్టీల్ బ్రిడ్జి ఏర్పాటు పనులు తుది దశకు చేరుకున్నాయి. 2.8 కిలోమీటర్లు, నాలుగు లైన్లుగా స్టీల్‌తో నిర్మించిన ఈ బ్రిడ్జి పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి కానున్నట్టు సమాచారం.

బ్రిడ్జి పనులు పూర్తి కాగా, బ్రిడ్జిపై బీటీ రోడ్డు వేసే పనులను జీహెచ్ఎంసీ అధికారులు చేస్తున్నారు. ఈ నెలాఖరులోగానీ, వచ్చే నెల మొదటి వారంలోగానీ బ్రిడ్జిని ప్రారంభించేందుకు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అపాయింట్‌మెంట్ తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులు భావిస్తున్నారు. 81 స్టీల్ పిల్లర్లతో ఎంవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఈ స్టీల్ బ్రిడ్జి పనులు చేపట్టింది. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే ఇందిరాపార్కు జంక్షన్‌తోపాటు అశోక్‌నగర్ చౌరస్తా, ఆర్టీసీ క్రాస్ రోడ్, వీఎస్టీ మెయిన్ రోడ్డులో కూడా ట్రాఫిక్ తగ్గుతుంది.



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ట్రాఫిక్ సులభతరం

ఇందిరాపార్కు, విద్యానగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు ప్రస్తుతం వాహనాలతో కిక్కిరిసిపోతుంది. ఐదు కిలోమీటర్ల దూరానికి గంటల తరబడి ప్రయాణించాల్సి వచ్చేది. ఉదయం 9 నుంచి 10:30గంటల వరకు, సాయంత్రం 3:30గంటల నుంచి రాత్రి 9 వరకు ట్రాఫిక్ ఇబ్బందులు చెప్పనక్కర్లేదు. ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు దాదాపు రూ.350 కోట్లతో నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్‌లో ట్రాఫిక్ సులభతరం అవుతుంది.



విభజన హామీలను విస్మరించిన ప్రధాని మోడీ

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్

- ప్రధాని పర్యటనపై నిరసనలు
- దిష్టిబొమ్మలు దహనం

నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా తెలంగాణలో అడుగుపెట్టే అర్హత ప్రధాని నరేంద్ర మోడీకి లేదని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటరమేష్, ఆనగంటి వెంకటేష్ అన్నారు. విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం డీవైఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోట రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర పునర్విభజన చట్టం హామీల్లో ఉన్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందన్నారు. తెలంగాణ పర్యటనకి వచ్చినప్పుడల్లా ప్రధాని మోడీ ఇచ్చిన హామీల గురించి ఊసెత్తకుండా.. ఊకదంపుడు ఉపన్యాసాలకు పరిమితమవ్వడం సిగ్గుచేటన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ పెడతామని చెప్పి తొమ్మిదేండ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోకుండా తెలంగాణ యువతని మోసం చేసారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు హామీని ఇప్పటిదాకా నెరవేర్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం యువతను మోసం చేస్తున్నదన్నారు.

ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్ర విభజన చట్టం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎండి.జావెద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి నాయకులు హస్మీ, అనిల్, రఘు, స్టాలిన్, వికిత, రమేష్, కళ్యాణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ముందుగా మోడీ దిష్టి బొమ్మతో ర్యాలీ నిర్వహించారు. మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. వైరా, కల్లూరు, మధిరలో దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటించడాన్ని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నల్లాల బావి సెంటర్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. యాదాద్రి జిల్లాలోని బీబీనగర్‌లో మండలంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.

తాత్కాలికంగా ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్లు రద్దు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల పరిధిలో రైల్వే మౌలిక సౌకర్యాల నిర్వహణ పనుల మరమ్మతుల కారణంగా ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు తాత్కాలికంగా ఎమ్ఎమ్‌టీఎస్ రైళ్ల సేవల్ని రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. లింగంపల్లి నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి లింగంపల్లి, ఫలక్‌నుమా-లింగంపల్లి, ఉందానగర్-లింగంపల్లి, రామచంద్రాపురం-ఫలక్‌నుమా రూట్లలో రైళ్లను రద్దు చేసినట్టు శనివారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపారు.

ఆశా వర్కర్లపై మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను

ఖండిస్తున్నాం : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోనే అత్యధిక పారితోషికాలు ఇస్తున్నామని మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు సరిగాదనీ, వాటిని ఖండిస్తున్నామని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) పేర్కొంది. శనివారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆర్. నీలాదేవీ, కోశాధికారి పి.గంగమణి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రమేర్పడి తొమ్మిదేండ్లు దాటినా నేటికీ రాష్ట్రంలో ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించలేదని విమర్శించారు. హర్యానాలో రూ.12 వేల పారితోషికం ఇస్తున్నారని తెలిపారు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లో మన రాష్ట్రంలో కంటే ఎక్కువగా రూ.10 వేల ఫిక్స్‌డ్ వేతనాన్ని ఇస్తున్నారని గుర్తుచేశారు. అనేక రాష్ట్రాల్లో ఏఎన్ఎమ్ నియామకాల్లో ఆశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. చాలా రాష్ట్రాలలో ఆశా వర్కర్లకు సైకిళ్ళు కూడా ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో మాత్రం కనీసం 32 రకాల రిజిస్టర్లను కూడా ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు. పీఆర్సీలో భాగంగా పెంచిన ఏడు నెలల ఎరియర్స్‌ను నేటికీ అకౌంట్‌లో వేయలేదని తెలిపారు. కరోనా రిస్కు కింద 16 నెలలకుగానూ కేంద్రం ఇచ్చిన రూ.16 వేలను ఒక్క ఆశావర్కర్‌కు కూడా చెల్లించలేదని విమర్శించారు. పని భారాన్ని విపరీతంగా పెంచుతున్నదనీ, పనిచేయని సెల్ ఫోన్స్ ఇచ్చి నిరంతరం ఆన్‌లైన్‌లో పనిచేయాలని ఒత్తిడి చేస్తున్నదని వాపోయారు. మొబైల్ శిక్షణ కోసం ఒక్కొక్క ఆశావర్కర్‌కు రూ .50 వేలు ఖర్చు పెడుతున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పటం మానేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశావర్కర్లకు కనీసం రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలనీ, పని భారం తగ్గించాలనీ, 5జి టెక్నాలజీ మొబైల్‌ను అందించాలని కోరారు.

కార్మికులకు రూ.26వేల కనీస వేతనమివ్వాలి

వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లికార్జున్

- గుమ్మడిదల, ఐడీఏబొల్లారం మండలాల్లో జీపుజాత

నవతెలంగాణ-గుమ్మడిదల, ఐడీఏబొల్లారం




పారిశ్రామిక వాడలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, కనీస వేతనాన్ని వెంటనే సవరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, మల్లికార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త జీపుజాత శనివారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలో, జిన్నారం, ఐడీఏబొల్లారం మండ లాల్లోని ఖాజీపల్లి, గడ్డపోతారం ప్రాంతాల్లో పర్యటిం చింది. బొంతపల్లి పారిశ్రామిక వాడలోని ధనలక్ష్మి స్టీల్ పరిశ్రమ, గ్రాండ్ న్యూల్స్, హెటిరో యూనిట్ -1, ఎంఎస్ఎన్, ఖాజీపల్లి, గడ్డపోతారం ప్రాంతాల్లోని అరబిందో, హెటిరో డ్రగ్స్, లీ ఫార్మా, ఎస్ఎంఎస్ పరిశ్రమల దగ్గర నిర్వహించిన సభల్లో భూపాల్, మల్లికార్జున్ కార్మికులనుద్దేశించి మాట్లాడారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2014 నుంచి కనీస వేతనాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని విమర్శించారు. పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులు ఈఎస్ఐ, పీఎఫ్, సెలవులు, ఓటి డబుల్, యూనిఫామ్, బూట్లు క్యాంటీన్, ప్రమాదం తర్వాత ఆదుకోవడం తదితర సౌకర్యాలు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నా రన్నారు. ధనలక్ష్మి స్టీల్ పరిశ్రమలో బీహార్, ఇతర రాష్ట్రాల కార్మికులకు సరియైన సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా 12 గంటలు పనులు చేయిస్తున్నారని చెప్పారు. వలస వచ్చిన కార్మికులను రేకుల షెడ్డులో ఉంచుతున్నారని.. వారికి అనువైన ప్రదేశాల్లో ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. వలస కార్మికుల చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పలువురు వలస కార్మికుల గదులను పరిశీలించారు. విద్యుత్, నీటి సౌకర్యం, వాష్ రూమ్‌లో ఎటువంటి సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ధరల భారంతో కార్మికులు అతలాకుతలమవుతున్నా.. ప్రభుత్వాలు కనీస వేతనాన్ని అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే సీనియార్టీ ప్రకారం అర్హులైన కార్మికులకు వేతనాలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈనెల 17న జిల్లా కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్య క్షులు కె.రాజయ్య, నాయకులు చంద్రశేఖర్, వెంక టేష్ గౌడ్, ప్రభాకర్ రావు, వీరభద్రం, సుధాకర్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీ నరసింహ గౌడ్, ఆర్గనైజర్ సెక్రెటరీ దేవేందర్, ట్రెజరర్ రవి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హుస్సేన్, వీరేష్, గోపాల్ రెడ్డి, కార్మికులు రవీందర్‌రెడ్డి దుర్గారావు, దశరథరావు, హమాలీ యూనియన్ నాయకులు సాయిలు, కృష్ణ, యాదగిరి, రాములు, రాజు, సత్యం, నరేష్ పాల్గొన్నారు.

నవచిత్రం



పవన్‌కళ్యాణ్, సాయిధరమ్ తేజ్


మై డియర్.. మార్కండేయా

పవన్ కళ్యాణ్-సాయి ధరమ్ తేజ్ ద్వయం మొదటిసారి కలిసి నటిస్తున్న చిత్రం 'బ్రో'. ఈ సినిమా కోసం జీ స్టూడియోస్‌తో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ చేతులు కలిపింది. సముద్రఖని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించిన ఈ సినిమా ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం ఈ చిత్రం నుండి మొదటి సింగిల్ విడుదలైంది. తమన్ ఈ పాటకు అద్భుతమైన సంగీతం అందించారు. పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్‌పై తెరకెక్కించిన 'మై డియర్ మార్కండేయ' పాటను రేవంత్, స్నిగ్ధ శర్మ ఆలపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటకు గణేష్ స్వామి, భాను నృత్యరీతులు అందించారు.

ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా నిర్మించిన విలాసవంతమైన పబ్ సెట్‌లో ఈ పాటను చిత్రీకరించారు. సమయం, జీవితం గురించి లోతైన భావంతో నిండిన ఈ పాట, సందేశాన్ని ఇవ్వడంతో పాటు అందర్నీ కాలు కదిపేలా ఉంది. స్టైలిష్ అవతార్‌లో సాయి ధరమ్, తన చరిష్మాతో తెరకు నిండుతనం తీసుకొచ్చిన పవన్ కళ్యాణ్ రాకతో పాట మరింత ఊపందుకుంది. 'మై డియర్ మార్కండేయా.. మంచి మాట చెప్తా రాసుకో..' అనే పంక్తులు ఆయన వ్యక్తిత్వానికి, పాత్రకు సరిగ్గా సరిపోయేలా ఉన్నాయి. అలాగే ఈ పాటలో ఊర్వశి రౌతేలా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్నిగ్ధా శర్మ ఈ పాటకు జానపద ఆకృతిని తీసుకువచ్చారు అని చిత్ర బృందం తెలిపింది.

అందమైన ప్రేమకథ

విజయ్ దేవరకొండ, సమంత కలిసి నటిస్తున్న చిత్రం 'ఖుషి'. లవ్‌స్టోరీ, ఎమోషనల్ స్టోరీలను తీయడంలో దర్శకుడు శివ నిర్వాణ మార్క్ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. మరోసారి ఆయన తన మ్యాజిక్ చూపించేందుకు రెడీగా ఉన్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి సంబంధించిన తాజా అప్డేట్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది.



విజయ్ దేవరకొండ, సమంత

ఈ చిత్రం నుంచి 'ఆరాధ్య..' అనే సాంగ్‌ను రిలీజ్ చేయబోతున్నట్టుగా ప్రకటిస్తూ మేకర్లు ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో సమంత, విజయ్‌లు ఎంతో కూల్‌గా కనిపిస్తున్నారు. ఈ పాట ప్రోమోను సోమవారం, పాటను బుధవారం విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

ఇప్పటికే 'నా రోజా నువ్వే' అనే పాట యూట్యూబ్‌లో సెన్సేషన్‌గా మారింది. వంద మిలియన్లకు చేరువలో ఉంది. ఇప్పుడు ఈ సెకండ్ సింగిల్ 'ఆరాధ్య'తో మరోసారి 'ఖుషి' సినిమా ట్రెండ్ అవ్వడం ఖాయం. చార్ట్ బస్టర్ లిస్ట్‌లో 'ఆరాధ్య' పాట కూడా చేరనుంది. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయబోతోన్నారు. సెప్టెంబర్ 1న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది.

నువ్వు కావాలయ్యా..

రజనీకాంత్ కథానాయకుడిగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందు తున్న చిత్రం 'జైలర్'. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.



తమన్నా, రజనీకాంత్

తాజాగా ఈ చిత్రం నుంచి 'నువ్వు కావాలయ్యా' పాటని విడుదల చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు అనిరుధ్ ఈ పాటని క్యాచీ బీట్స్‌తో ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్ నెంబర్‌గా స్వరపరిచారు. అరుణ్‌రాజా కామరాజ్ రాసిన ఈ పాటను శిల్పారావు, అనిరుధ్ కలిసి ఎనర్జిటిక్‌గా పాడారు. ఈ పాటలో రజనీకాంత్ స్వాగ్, గ్రేస్ మెస్మరైజ్ చేయగా, తమన్నా డ్యాన్స్ మూమెంట్స్ అందర్నీ అలరిస్తున్నాయి. దీంతో ఈ సినిమాపై అందరిలోనూ భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్ రమ్య కృష్ణన్, తమన్నాతో పాటు వసంత్ రవి, నాగ బాబు, యోగి బాబు, జాఫర్ సాదిక్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఆగస్టు 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం : నెల్సన్, సంగీతం : అనిరుధ్, డిఓపీ: విజయ్ కార్తీక్ కన్నన్, ఎడిటర్: ఆర్.నిర్మల్, ఆర్ట్: డాక్టర్ కిరణ్.

వెండితెరపై జగన్ జీవితం

దర్శకుడు మహి వి.రాఘవ్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'యాత్ర 2'. 3 ఆటమ్ లీవ్స్, వి సెల్యులాయిడ్ బ్యానర్‌పై ఈ సినిమాను శివ మేక నిర్మిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా 'యాత్ర 2' మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మహి వి.రాఘవ్ మాట్లాడుతూ, 'ఇందులో 2009 నుంచి 2019 వరకు ముఖ్యంగా జగన్ ఎక్కడి నుంచి ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఎక్కడి వరకు ఎదిగారు అన్నదే ఈ సినిమాలో ఉంటుంది. వాస్తవ సంఘటనలే అయినా కూడా జనాలను ఆకట్టుకునేలా తెరకెక్కించేందుకు ఫిక్షన్ యాడ్ చేస్తాం. అలాగే జగన్ ఎదుగుదలను పొలిటికల్ డ్రామాగా చూపిస్తాను. తండ్రి ఇచ్చిన మాటను నిలబెట్టే కొడుకు అనే పాయింట్ చుట్టూ ఈ సినిమా నడుస్తుంది. సినిమా చూసి అందరూ ఎమోషనల్ అవుతారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. మధి సినిమాటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. ఎన్నికల టైంలో అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సినిమాను రిలీజ్ చేయాలని భావిస్తున్నాం' అని అన్నారు. "యాత్ర' మాదిరిగానే దీన్ని కూడా సపోర్ట్ చేస్తారని అనుకుంటున్నాను. నిజ జీవితంలో ఉండే పాత్రలన్నీ ఈ సినిమాలో ఉంటాయి' అని నిర్మాత శివ మేక చెప్పారు.




శివ మేక, మహి. వి. రాఘవ్

రంగబలి బ్లాక్‌బస్టర్ - హీరో నాగశౌర్య

హీరో నాగశౌర్య, పవన్ బాసంశెట్టి కాంబినేషన్‌లో రూపొందిన 'రంగబలి' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఎస్ ఎల్ వి సినిమాస్ పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిది బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో హీరో నాగశౌర్య మాట్లాడుతూ,"రంగబలి' చూసి ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. పవన్ చాలా మంచి సినిమా తీశారు. చాలా మంచి కథ చెప్పారు. ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. 'ఛలో' తర్వాత నాకు రంగబలి మరో బ్లాక్‌బస్టర్. ఈ ప్రయాణంలో సపోర్ట్ చేసిన నిర్మాత సుధాకర్‌కి, టీమ్‌కి కృతజ్ఞతలు. యుక్తి చక్కగా నటించింది. సత్య, జాకెట్ (రాజ్ కుమార్) ఇద్దరూ చక్కగా ఎంటర్‌టైన్ చేశారు. ఈ విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు మరోసారి కృతజ్ఞతలు' అని తెలిపారు. 'మా చిత్రాన్ని ప్రేక్షకులు అన్ని చోట్ల ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. సినిమా చూస్తున్నంత సేపు పడిపడి నవ్వుతున్నారు. ఫస్ట్ హాఫ్‌ని చాలా ఎంజాయ్ చేస్తున్నారు. శౌర్య, సత్య, రాజ్ కుమార్ పాత్రలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నాయి. సెకండ్ హాఫ్‌లో ఒక మంచి కథ, సందేశాన్ని చెప్పాం. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తున్నారు. కలెక్షన్స్ బాగున్నాయి. ఈ విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని దర్శకుడు పవన్ బాసంశెట్టి చెప్పారు. నాయిక యుక్తి తరేజ మాట్లాడుతూ,'ఇది నా మొదటి తెలుగు సినిమా. సినిమాని ప్రేక్షకులు ఎంతగానో ఆదరిస్తున్నారు. సినిమాని ప్రేక్షకులు ఎంజాయ్ చేయడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.



నాగశౌర్య,యుక్తి తరేజ, పవన్ బాసంశెట్టి



డా॥శంకర్ నాయుడు, దీన్‌రాజ్

తెలుగు వాళ్ళు గర్వపడే సినిమా

రచయిత దీన్‌రాజ్ దర్శకుడిగా పరిచయం అవుతూ తెరకెక్కించిన 'భారతీయన్స్' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని, ఈనెల 14న తెలుగు - హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదలకు సిద్ధమైంది. భారత్ అమెరికన్ క్రియేషన్స్ పతాకంపై ప్రవాస భారతీయుడు డాక్టర్ శంకర్ నాయుడు అడుసుమిల్లి ఈ చిత్రాన్ని నిర్మించారు. సినిమా విడుదల నేపథ్యంలో దర్శకుడు దీన్‌రాజ్ మాట్లాడుతూ,'చైనా బోర్డర్‌లో ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి చిత్రీకరణ చేశాం. అలాగే వర్షాలు కురిసి, కొండచరియలు విరిగిపడి ఎప్పుడు చిత్రీకరణ ఆగిపోతుందో తెలియని పరిస్థితుల్లో చేశాం. ఇలా ఎన్నో కష్టాలు పడ్డాం. ఎన్ని కష్టాలు పడితే ఏంటి? తెలుగు వాళ్లు గర్వపడే సినిమా తీశాం. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి మా చిత్రంపై ప్రశంసలు కురిపించడంతో మేం పడ్డ కష్టం అంతా మర్చిపోయేలా చేసింది. ప్రీమియర్ షోస్ అన్నింటికీ అసాధారణ స్పందన వచ్చింది' అని తెలిపారు.

ప్రేక్షకులకు థ్యాంక్స్

జగపతిబాబు ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'రుద్రంగి'. రసమయి బాలకిషన్ నిర్మాతగా అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మమత మోహన్ దాస్, విమల రామన్, గానవి లక్ష్మణ్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో దర్శకుడు అజయ్ సామ్రాట్ మాట్లాడుతూ, 'మా సినిమాకు అన్ని చోట్ల నుంచి చాలా పాజిటివ్ రెస్పాన్స్ వస్తుంది. ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్' అని అన్నారు.

'సినిమాను ఇంత బాగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో నేను చేసిన మల్లి పాత్రను అందరూ అప్రిషియేట్ చేస్తున్నారు' అని ఆశిష్ గాంధీ చెప్పారు.

డీఓపి సంతోష్ మాట్లాడుతూ,'థియేటర్లలో చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇంత మంచి సక్సెస్ అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని తెలిపారు.



అజయ్ సామ్రాట్, ఆశిష్‌గాంధీ, గానవి లక్ష్మణ్

నేడే లష్కర్ బోనాల పండుగ..

- హైదరాబాద్‌లోని నలుమూలల నుంచి ఆలయాలకు చేరుకోనున్న భక్తులు
- ఫలహారుపు బండ్లపై ఊరేగింపుతో అమ్మవారికి ప్రసాదం సమర్పణ



(ఏ. సతీష్)

అమ్మా బయలుదేరినావో.... తల్లి బయలుదేరినావో... నెత్తిమీద బోనాలమ్మో ...అంటూ స్త్రీలు భక్తి శ్రద్ధలతో ఉదయాన్నే లేచి తలారా స్నానం చేసి పరిశుభ్రమైన వస్త్రములు ధరించి మడితో వారు మొక్కుకున్న ప్రకారం బోనము (ప్రసాదము) తయారు చేసి, ఒక పాత్ర యందుపెట్టి అపవిత్రము కాకుండా ఆ బోనము పాత్రపై దీపము పెట్టి (జ్యోతి) తలపై పెట్టుకొని నగరంలోని నలుమూలల నుండి ఆలయాలకు విచ్చేసి అమ్మవారికి బోనము సమర్పించి వారి మొక్కుబడిని తీర్చుకొందురు. దీనినే బోనము, బోనాలు పండుగ అని అనాదిగా పిలువబడుచున్నది. ఈ దినము స్త్రీలు ముఖమునకు పసుపు పూసుకొని తడి వస్త్రములతో ఆలయమునకు వచ్చుట సనాతమైన ఆచారము. మరికొంత మంది స్త్రీలు పరిశుభ్రమైన నీటిని పసుపుతో కలుపుకొని వేపమండలు పాత్రయందుంచి సికింద్రాబాద్‌లోని మహాకాళి ఆలయమునకు వచ్చి అమ్మవారి ఆలయంలోని మండపమునకు ఎదురుగా గల శ్రీ మాతంగేశ్వరి దేవాలయములో సమర్పించుదురు. దీనినే సాక అందురు. నీరు, వేపాకు ఏ విధముగా చల్లగా ఉండునో ఆ విధముగా ఆ సాక సమర్పించిన వారిని తల్లి చల్లని దీవెనలు ప్రసాదించుననే విశ్వాసముతో సమర్పించుటయే సాక ఉద్దేశం. ఈ బోనాలు పండుగ రోజున నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి బోనాలు అమ్మవారికి ఇష్టమైన పదర్థాములతో భక్తులు వారింటి యందు తయారుచేసుకుని ఒక బండిలో పెట్టుకొని వచ్చి ఆలయ చుట్టు ప్రదక్షిణములు చేసి అమ్మవారికి కొంత సమర్పించి మిగిలినది మహాప్రసాదముగా స్వీకరించి తరింతురు. ఈ విధంగా వందల సంఖ్యలో బండ్లపై ప్రసాదములు తెచ్చి అమ్మవారికి సమర్పించుట, "ఫలహరపు బండ్లు" అనే పేరుతో పిలుచుట ఒక ఆనవాయితిగా మారింది. బోనములు పండుగనాడు జంటనగరాలలోని ప్రతీ బస్తి నుంచి పోతురాజులు శరీరమంతయూ పసుపుతో అలంకరించుకొని లంగోటా వస్త్రములు ధరించి కాళ్ళకు గజ్జెలు కట్టి నోటి యందు నిమ్మకాయ పెట్టుకోని కండ్లకు కాటుక నుదుట కుంకుమ పెట్టుకొని చేతియందు పసుపు తాడును కొరడాగా ధరించి ఝళిపించుచూ తప్పెట్లు వాయిధ్యములకు అనుగుణముగా లయబద్ధంగా గజ్జెల సవ్వడితోనాట్యము చేయుచూ ఆనందోత్సహములతో పురవీధులగుండా అనేక మందితో గుంపుగా కలసి ఆలయమునకు విచ్చేసి ప్రదక్షిణలు చేసి అమ్మవారిని సేవించుకొని ,వెళ్ళుట ఒక ముఖ్య ఆకర్షణ ఘట్టము. ఈ విధంగా వేలాదిమంది పోతురాజులు జాతరలో పాల్గొని లక్షలాదిమంది భక్తులను పారవశ్యము చేసి అమ్మవారిని ప్రసన్నం చేసుకొని మొక్కులను కోరుకుంటారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

పర్యావరణ పరిరక్షణ అనేది పౌరుల బాధ్యత అని ఏ దేశ రాజ్యాంగం చెబుతుంది?


- డాక్టర్ కె. శశిధర్
విషయ నిపుణులు
94919 91918



పోటీ పరీక్షల ప్రత్యేకం పర్యావరణం

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలలో పర్యావరణ పరిరక్షణ అనేది అంతర్లీనంగా దాగి ఉంటుంది. చెట్లను, జంతువుల్ని పూజించటం, వాటిని సంరక్షించటం భారతీయ గ్రామీణ జీవన విధానంలో అంతర్భాగాలే. దేశీయ సమాజంలో అంతర్లీనంగా దాగి ఉన్న ఈ పర్యావరణ స్పృహ భారత రాజ్యాంగంలో కూడా కనిపిస్తుంది. భారత రాజ్యాంగం యొక్క మూల గ్రంధం నేరుగా పర్యావరణ పరిరక్షణను ప్రస్తావించకపోయినా, పర్యావరణ సంబంధిత అంశాల గురించి ప్రస్తావిస్తుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్-47 దేశంలోని పౌరులందరి ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి కావాల్సిన చర్యలు తీసుకోవటం రాష్ట్రాల ప్రాధమిక భాద్యత అని తెలియచేస్తుంది. అదేవిధంగా ఆర్టికల్-49 జంతువుల సంరక్షణ కూడా రాష్ట్రాల భాద్యత అని ఉద్ఘాటిస్తుంది. ఆ తర్వాతి కాలంలో పర్యావరణ పరిరక్షణకు సంభందించిన అధికరణలు రాజ్యాంగ సవరణల ద్వారా రాజ్యాంగంలో ప్రవేశపెట్టబడ్డాయి. ఆ రకంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలను రాజ్యాంగంలో పొందుపరచిన మొదటి దేశంగానే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలను చేర్చడానికి రాజ్యాంగ సవరణలు కూడా చేపట్టిన మొదటి దేశంగా భారతదేశం కీర్తిని గడించింది.

ప్రపంచ పర్యావరణం ఎదుర్కొంటున్న సమస్యలు, తద్వారా మానవుని ఆరోగ్యానికి కలుగుతున్న నష్టాల గురించి చర్చించి, ప్రపంచ దేశాలను చైతన్యవంతం చేయటంతో పాటు ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ఒక స్పష్టమైప కార్యాచరణ ప్రణాళికను అందివ్వాలన్న లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి స్వీడన్ రాజధాని స్టాక్‌హెూం నగరంలో మానవుడు - పర్యావరణం అనే అంశం మీద మొదటి ప్రపంచస్థాయి పర్యావరణ సదస్సును నిర్వహించింది. 1972వ సంవత్సరం జూన్ 5వ తేది నుండి 16వ తేది వరకూ జరిగిన ఈ సదస్సులో పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు తీసుకోవాల్సిన చర్యలను నిర్దేశిస్తూ 26 సూత్రాలతో కూడిన ఒక తీర్మానం ప్రవేశపెట్టబడింది. 'ఒకే ఒక భూమి' అనే నినాదంతో జరిగిన ఈ సదస్సులో 122 దేశాలు పాల్గొనగా, 70 దేశాలు ఈ తీర్మానానికి ఆమోదం తెలుపుతూ సంతకాలు చేశాయి. స్టాక్‌హెూ డిక్లరేషన్‌పై భారతదేశం కూడా సంతకం చేసింది.



భూగ్రహ వాతావరణంపై ప్రపంచ దేశాలు నిర్వహించిన మొట్టమొదటి సమావేశంగా స్టాక్‌హెూం కాన్ఫరెన్స్ గుర్తింపు పొందింది. స్టాక్‌హెూం సదస్సు జరిగిన 1972 నాటికి ప్రపంపంలోని ఏ దేశంలోను పర్యావరణ మంత్రిత్వ శాఖలు లేవు. సదస్సు అనంతరం నార్వే, స్వీడన్ దేశాలు పర్యావరణ మంత్రిత్వ శాఖల్ని ఏర్పాటు చేసుకోగా, భారతదేశం 1980లో పర్యావరణ శాఖను ప్రారంభించింది. ఆ తర్వాత అది 1985లో పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖగా మారింది. మొదటి పర్యావరణ మరియు అటవీ శాఖ మంత్రిగా రాజీవ్‌గాంధీ పని చేశారు. స్టాక్‌హెూం సదస్సుకు భారతదేశం తరపున అప్పటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ హాజరయ్యారు. హాజరవ్వటంతో పాటు ఇందిరాగాంధీ స్టాక్‌హెూం కాన్ఫరెన్సులో చేసిన ప్రసంగం అనేక దేశాల ప్రశంసలు అందుకుంది. ధనిక దేశాలు చేస్తున్న పాపాలు, భారత్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల పాలిట పాపాలుగా మారుతున్నాయని, దేశాలలో పేదరికం తొలగితేనే పర్యావరణ పరిరక్షణ మరింత వేగవంతమవుతుందని ఆమె తన ఉపన్యాసంలో స్పష్టం చేశారు. స్వతహాగా పర్యావరణ ప్రేమికురాలైన ఇందిరాగాంధీపై స్టాక్‌హెూం కాన్ఫరెన్సు ప్రభావం పడింది. ఆ సదస్సు నుండి తిరిగి రాగానే పర్యావరణ పరిరక్షణ, దానికి చట్టబద్ధంగా తీసుకోవాల్సిన అంశాలపై చర్యలు ప్రారంభించారు. దానిలో భాగంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగంలోకి పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన 48-ఎ, 51-ఎ(జి) ఆర్టికల్స్‌ను ప్రవేశపెట్టటం జరిగింది. ఆర్టికల్ 48-ఎ పర్యావరణ పరిరక్షణ మరియు వన్యప్రాణి సంరక్షణకు దేశంలోని ఆయా రాష్ట్రాలు భాద్యత వహించాలని నిర్దేశిస్తుంది. దానితో పాటు అప్పటి వరకూ రాష్ట్ర జాబితాలో ఉన్న వన్యప్రాణులు మరియు అడవులను రాజ్యాంగం ఉమ్మడి జాబితాలోకి చేర్చింది. అదేవిధంగా ఆర్టికల్ 51-ఎ(జి) సరస్సులు, నదులు మరియు వన్యప్రాణులతో కూడిన సహజ పర్యావరణాన్ని పరిరక్షించటం మరియు పర్యావరణాన్ని మెరుగుపరచడం అనేవి దేశంలోని పౌరుల ప్రాథమిక విధులని పేర్కొంది. దానితో పాటు ప్రాణులన్నింటి పట్ల కరుణ, ప్రేమను పౌరులందరూ కలిగి ఉండాలని నిర్దేశిస్తుంది. రాజ్యాంగ సవరణ ద్వారా పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రవేశపెట్టిన ఈ అధికరణల ఆధారంగా దేశంలో అనేక పర్యావరణ చట్టాల రూపకల్పనకు మార్గం సుగమమం అయ్యింది.

1. పర్యావరణ పరిరక్షణ అనేది రాష్ట్రాల మరియు పౌరుల విధిని అని ఏ దేశ రాజ్యాంగం చెబుతుంది?
ఎ. అమెరికా   బి. కెన్యా   సి. ఇండియా   డి. చైనా

2. మొదటి ప్రపంచ పర్యావరణ సదస్సు ఏ సంవత్సరంలో జరిగింది;
ఎ. 1976   బి. 1967   సి. 1972   డి. 1976

3. స్టాక్‌హెూం కాన్ఫరెన్స్ ఏ దేశంలో జరిగింది?
ఎ. స్వీడన్   బి. రియోడిజెనిరా   సి. వియత్నాం   డి. రష్యా

4. స్టాక్‌హెూం కాన్ఫరెన్సులో ఎన్ని దేశాలు పాల్గొన్నాయి?
ఎ. 122   బి. 128   సి. 123   డి. 124

5. స్టాక్‌హెూం కాన్ఫరెన్సులో భారత దేశం తరుపున ఎవరు పాల్గొన్నారు?
ఎ. మొరార్జీ దేశాయ్   బి. రాజీవ్ గాంధీ
సి. శ్రీమతి ఇందిరా గాంధీ   డి. ఫిరోజ్ గాంధీ

6. స్టాక్‌హెూం కాన్ఫరెన్సు ప్రవేశపెట్టిన 26 సూత్రాలతో కూడిన డిక్లరేషన్‌పై ప్రాథమికంగా ఎన్ని దేశాలు సంతకం చేశాయి?
ఎ. 120   బి. 122   సి. 111   డి. 70

7. స్టాక్‌హెూ కాన్ఫరెన్సు ఏ నినాదంతో జరిగింది;
ఎ. ఒకే ఒక భూమి   బి. భూమి ఒక్కటే
సి. భూగ్రహాన్ని కాపాడుకుందాం   డి. పైవేవీ కావు

8. భారతదేశంలో పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
ఎ. 1975   బి. 1985   సి. 1965   డి. 1995

9. భారత రాజ్యాంగంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలను ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టారు?
ఎ. 47వ రాజ్యాంగ సవరణ   బి. 42వరాజ్యాంగ సవరణ
సి. 45వ రాజ్యాంగ సవరణ   డి. పైవేవీ కావు

10. భారత రాజ్యాంగంలో పర్యావరణ పరిరక్షణ రాష్ట్రాలు, పౌరుల ప్రాథమిక విధి అని ఏ అధికరణం నిర్దేశిస్తుంది?
ఎ. 48-ఎ   బి. 48-బి   సి. 47-ఎ   డి. 47-డి

11. జీవరాశి లేదా తోటి ప్రాణుల పట్ల కరుణ, ప్రేమ, ఆదరణ భావం కలిగి ఉండాలని ఏ అధికరణం చెబుతుంది?
ఎ. ఆర్టికల్ 15   బి. ఆర్టికల్ 51-ఎ(జి)   సి. ఆర్టికల్ 48-ఎ   డి. పైవేవీ కావు

12. భారతదేశంలో పర్యావరణ చట్టాల రూపకల్పనకు మార్గమేసిన రాజ్యాంగ అధికరణలు ఏవి?
ఎ. 14-ఎ; 15-ఎ   బి. 48-ఎ; 51-ఎ(జి)
సి. 47-ఎ; 49-బి   డి.42-ఎ; 43-సి

13. అడవులను, వన్యప్రాణులను కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో చేర్చిన ఆర్టికల్ ఏది?
ఎ. 48-ఎ   బి. 51-ఎ(జి)   సి. 14, 15-ఎ   డి. పైవేవీ కావు

14. 42వ రాజ్యాంగ సవరణ ఏ సంవత్సరంలో జరిగింది?
ఎ. 1956   బి. 1966   సి. 1976   డి. 1986

15. భారతదేశ మొదటి పర్యావరణ మరియు అటవీ శాఖా మంత్రి ఎవరు?
ఎ. శ్రీమతి ఇందిరా గాంధీ
బి. సంజయ్ గాంధీ
సి. రాజీవ్ గాంధీ
డి. ఫిరోజ్ గాంధీ

సమాధానాలు

1.సి	2.సి	3.ఎ	4.ఎ	5.సి
6. డి	7. ఎ	8. బి	9. బి	10.ఎ
11. బి	12. బి	13. ఎ	14. సి	15. సి

విద్య, ఉద్యోగ అవకాశాలు

ప్రభుత్వ ఉద్యోగాలు

కేంద్ర ప్రభుత్వ శాఖలు/ విభాగాల్లో వివిధ పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) అర్హుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
మొత్తం పోస్టుల సంఖ్య: 261. **పోస్టుల వారీగా ఖాళీలు:** ఎయిర్ వర్దినెస్ ఆఫీసర్- 80, ఎయిర్ సేఫ్టీ ఆఫీసర్- 40, లైవ్‌స్టాక్ ఆఫీసర్- 06, జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్- 05, పబ్లిక్ ప్రాసిక్యూటర్- 23, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్- 86, అసిస్టెంట్ ఇంజినీర్ గ్రేడ్ 1- 03, అసిస్టెంట్ సర్వే ఆఫీసర్- 07, ప్రిన్సిపల్ ఆఫీసర్- 01, సీనియర్ లెక్చరర్- 06
అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక: రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు రుసుము: రూ.25. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13-07-2023. **వెబ్‌సైట్:** https://upsc.gov.in/

బెల్-బెంగళూరులో ఇంజినీర్ ఖాళీలు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) 27 ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్.
అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/ బీటెక్.
అనుభవం: కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
వయసు: 32 ఏళ్లు మించకూడదు.
జీతభత్యాలు: నెలకు రూ.40000 చెల్లిస్తారు.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.472.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా.
చిరునామా: MANAGER (HR/ADSN, ES & C-QA) Bharat Electronics Limited Jalahalli P.O., Bengaluru 560013.
దరఖాస్తుకు చివరి తేదీ: 20.07.2023.
వెబ్‌సైట్: https://www.bel-india.in/

పీజేటీఎస్ఏయూలోయూజీ కోర్సులో ప్రవేశాలు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్శిటీ, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్శిటీ, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్శిటీలతోపాటు అనుబంధ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బైపీసీ స్ట్రీమ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది.
డిగ్రీ కోర్సులు-సీట్ల వివరాలు : బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ (నాలుగేళ్లు)-720 సీట్లు, బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్ (నాలుగేళ్లు)-43 సీట్లు, బీవీఎస్సీ అండ్ ఏహెచ్ (ఐదున్నరేళ్లు)-174 సీట్లు, బీఎఫ్ఎస్సీ (నాలుగేళ్లు)-39 సీట్లు, బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ (నాలుగేళ్లు)-204 సీట్లు
అర్హత: ఇంటర్మీడియట్(ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్)తోపాటు టీఎస్ ఎంసెట్-2023 ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: బీవీఎస్సీ ఏహెచ్ కోర్సుకు 17 నుంచి 25 ఏళ్లు, ఇతర కోర్సులకు 17 - 22 ఏళ్లు.
ఎంపిక: టీఎస్ ఎంసెట్-2023లో అభ్యర్థులు పొందిన ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 17.07.2023.
దరఖాస్తు సవరణ తేదీలు: 18.07.2023 నుంచి 19.07.2023 వరకు
వెబ్‌సైట్: https://www.pjtsau.edu.in/

ఎఫ్సీఆర్ఐ, ములుగులో బీఎస్సీ ఫారెస్ట్రీ ప్రవేశాలు

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్రీ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్.. 2023 24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఎస్సీ (ఆనర్స్) ఫారెస్ట్రీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఇంటర్మీడియట్(పీసీబీ/పీసీఎం/పీసీఎంబీ)తో పాటు టీఎస్ ఎంసెట్ - 2023 ర్యాంకు సాధించి ఉండాలి.
ప్రవేశ విధానం: టీఎస్ ఎంసెట్ 2023 ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు ఉంటాయి.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.07.2023
రూ.500 ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.07.2023.
వెబ్‌సైట్: www.fcrits.in

ఆలయ ఆర్చకులుగా అన్ని కులాలవారు

- **డిఎంకె తెచ్చిన సామాజిక న్యాయం : స్టాలిన్**

చెన్నై : ఏ కులానికి చెందిన వారినైనా ఆలయ ఆర్చకులుగా నియమించడం రాష్ట్రంలో డిఎంకె తీసుకొచ్చిన సామాజిక న్యాయమని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పేర్కొన్నారు. చెన్నైలో ఇటీవల హిందూ రిలిజియస్ అండ్ చారిటబుల్ ఎండోమెంట్స్ (హెచ్‌ఆర్‌అండ్‌సిఇ) శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని దేవాలయాల తరపున 34 జంటలకు జరిగిన సామూహిక వివాహ వేడుక కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ఆలయ ఆర్చకులుగా ఏ కులానికి చెందిన వారైనా ఉండొచ్చని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం డిఎంకె ప్రభుత్వం ఈ సామాజిక న్యాయాన్ని తీసుకుని వచ్చింది' అని చెప్పారు. అర్హులైన ప్రతీ ఒక్కర్నీ ఆలయాల్లో అర్చకులుగా అనుమతించే 'ద్రావిడ మోడల్' ప్రభుత్వమే, నిజమైన సామాజిక న్యాయమని స్టాలిన్ చెప్పారు. తమిళనాడు స్ఫూర్తితో రాజస్థాన్ ప్రభుత్వం కూడా వివిధ ఆలయాల్లో ఎనిమిది మంది మహిళలతో సహా మొత్తం 17 మందిని అర్చకులుగా నియమించిందని స్టాలిన్ తెలిపారు. అలాగే, హిందూ దేవాలయాల నిర్వహణ కోసం హెచ్‌ఆర్‌అండ్‌సిఇ శాఖను సృష్టించింది కూడా తమ జస్టిస్ పార్టీ అని స్టాలిన్ గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ శాఖ రాష్ట్రంలో 43 వేల ఆలయాల నిర్వహణను పర్యవేక్షిస్తుందని తెలిపారు. పురాతన ఆలయాల నిర్మాణలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పునర్నిర్మాణం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌అండ్‌సిఇ మంత్రి పికె శేఖర్‌బాబు, ఉన్నత విద్యాశాఖ మంత్రి కె. పొన్ముడి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి మా. సుబ్రమణియన్, మైనారిటీల సంక్షేమం- ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి జింగీ కెఎస్ మస్తాన్, చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వలసలపై కుదరని ఏకాభిప్రాయం !

- **కుప్పకూలిన డచ్ ప్రభుత్వం ప్రధాని రాజీనామా**

ది హేగ్ : డచ్ ప్రభుత్వం శుక్రవారం కుప్పకూలిపోయింది. వలసలను ఎలా అరికట్టాలనే అంశంపై నాలుగు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏకాభిప్రాయానికి రాలేకపోవడంతో నెదర్లాండ్స్ ప్రధాని మార్క్ రూటె తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఈ ఏడాది చివరిలో ఎన్నికలు నిర్వహించడానికి మార్గం సుగమమైందని భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడేవరకు రూటె ప్రభుత్వం ఆపద్ధర్మ ప్రభుత్వంగా వ్యవహరిస్తుంది. "వలస విధానాలపై సంకీర్ణ భాగస్వాముల మధ్య భిన్నమైన అభిప్రాయాలు వున్నాయి. ఇందులో రహస్యమేమీ లేదు' అని రూటె విలేకర్లతో వ్యాఖ్యానించారు.

తమ మధ్య విభేదాలను పరిష్కరించుకోలేమని నిర్ధారణకు రావడంతో దురదృష్టవశాత్తూ ఈ నిర్ణయానికి రావాల్సి వచ్చిందని అన్నారు. అందువల్లే మంత్రివర్గం రాజీనామా లేఖను రాజుకు రాతపూర్వకంగా అందచేశానని చెప్పారు. ఈలోగా తాజాగా ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీలు పిలుపిచ్చాయి. తక్షణమే ఎన్నికల జరగాలని యాంటీ ఇమ్మిగ్రేషన్ పార్టీ ఫర్ ఫ్రీడమ్ నేత గీర్ట్ వైల్డర్స్ ట్వీట్ చేశారు. గ్రీన్ లెఫ్ట్ నేత జెస్సీ క్లావెర్ కూడా ఎన్నికలకై పిలుపిచ్చారు. ఈ దేశానికి దిశా నిర్దేశం మారాల్సిన అవసరం వుందని వ్యాఖ్యానించారు.

బుధ, గురువారాల్లో వరుసగ అర్ధరాత్రులు వరకు సమావేశమైనా శరణార్ధుల విధానంపై ఒక ఒప్పందానికి రాలేకపోయారు. దాంతో ఇక సంకీర్ణంలో కలిసి వుండలేమని శుక్రవారం ఉదయం జరిగిన సమావేశంలో అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు. మార్క్ రూటెకి చెందిన పీపుల్స్ పార్టీ ఫర్ ఫ్రీడమ్ అండ్ డెమోక్రసీ, క్రిస్టియన్ డెమోక్రాట్లు శరణార్ధులపై కఠిన చర్యలు తీసుకునేందుకు మొగ్గ చూపుతుండగా, డి66, క్రిస్టియన్ యూనియన్‌లు వ్యతిరేకిస్తున్నాయి.

సంక్షేమం, అభివృద్ధి రెండు కండ్లలాగా భావించారు

- **డాక్టర్ వైఎస్ఆర్ జయంతి సభలో సీఎల్పీ నేత విక్రమార్క**

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు కండ్లలాగా భావించారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క గుర్తు చేశారు. పేద, మధ్యతరగతి పిల్లలు ఉన్నత విద్య చదవాలనే ఉద్దేశంతో స్కాలర్ షిప్స్ ఇచ్చారని తెలిపారు. రాజకీయాలకు కుల, మతాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని పేర్కొన్నారు. డ్వాక్రా రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ నగరం దాహార్తి తీర్చేందుకు కష్ణ, గోదావరి నది జలాలను నగరానికి తీసుకొచ్చారని చెప్పారు. ఐదేండ్లలో లక్షల ఎకరాలకు నీళ్ల ఇచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టిన గొప్ప దార్శనికుడని చెప్పారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలనే లక్ష్యం ఉండేదనీ, దాన్ని సాకారం చేసేందుకు అహర్నిశలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, అంజన్‌కుమార్, మహేష్‌కుమార్‌గౌడ్, మల్లు రవి, కేవీపీ రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి 500 రోజులు !

కీవ్ : రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం ఆరంభమై శనివారానికి 500రోజులు గడిచింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ తమ సైనికులను ప్రశంసించారు. ఈ మేరకు నల్ల సముద్ర దీవి అయిన స్నేక్ ఐలాండ్ నుండి ఒక వీడియో విడుదల చేశారు. రష్యా దాడి నేపథ్యంలో ఉక్రెయిన్ ప్రతిఘటనా సామర్ధ్యానికి ఈ దీవి ఒక ప్రతీకగా నిలిచింది. ఈ దీవిపై తిరిగి పట్టు సాధించడమనేది ఉక్రెయిన్ సైనిక పాటవానికి గొప్ప నిదర్శనంగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు. తమ భూభాగంలోని ప్రతి అంగుళాన్ని తిరిగి సాధించి తీరుతామని అన్నారు. విజయం సాధించిన ఈ నేల నుండే ఈ 500రోజులుగా పోరు సల్పుతున్న మన సైనికులకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని జెలెన్స్కీ ఆ సందేశంలో పేర్కొన్నారు. "ఈ యుద్ధంలో మనం ఖచ్చితంగా విజయం సాధించి తీరుతాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

గతేడాది ఫిబ్రవరి 24న మాస్కో దాడులు ఆరంభించిన రోజే స్నేక్ ఐలాండ్ దీవిని రష్యా బలగాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఉక్రెయిన్‌లో అతిపెద్ద ఓడరేవు అయిన ఒడెశాపై దాడి చేయడానికి ఈ దీవి ఒక గ్రౌండ్‌గా ఉపయోగపడుతుందనే ఆలోచనతో దీన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దీవిలోని ఉక్రెయిన్ బలగాలను తొలుత రష్యా బందీగా చేసినా, తర్వాత ఖైదీల మార్పిడి భాగంగా వారిని విడుదల చేశారు. ఈ దీవిని తీసుకున్న తర్వాత ఉక్రెయిన్ సైన్యం భారీగా అక్కడ గల రష్యా దళంపై బాంబుదాడులు వేసింది. దాంతో అక్కడనుండి జూన్ 30న రష్యన్ సైనికులు వెనక్కి మరలాల్సి వచ్చింది.

63 లక్షల మంది శరణార్థులు : 9వేల పౌరుల మరణాలు

గత 500రోజులుగా సాగుతున్న ఈ యుద్ధం కారణంగా 63లక్షల మంది శరణార్ధులయ్యారు. వీరిలో ప్రధానంగా మహిళలు, పిల్లలే వున్నారు. 9వేలమంది ఉక్రెయిన్ పౌరులు మరణించారు. ఇంకా ఈ సంఖ్య ఎక్కువే వుండవచ్చని భావిస్తున్నారు. గాయపడిన వారి సంఖ్య 15,779గా వుందని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం పేర్కొంది. ఇరు పక్షాల వైపు జరిగిన సైనిక మరణాలను నిర్ధారించడం కష్టసాధ్యంగా మారింది. కీవ్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లెక్కల ప్రకారం 14,300డాలర్ల మేరకు నష్టం వాటిల్లిందని అంచనా. ఉక్రెయిన్ భూభాగంలో 20శాతం కన్నా తక్కువ భూభాగమే రష్యా అధీనంలో వుందని అంచనా వేస్తున్నారు.

లోతుగా చర్చించిన తర్వాతే ధరణి రద్దు నిర్ణయం

కిసాన్ కాంగ్రెస్ నేత కోదండరెడ్డి
నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ధరణి పోర్టల్‌పై లోతుగా చర్చించిన తర్వాత దాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్టు కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండరెడ్డి చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చినవెంటనే ప్రజలకు ఇచ్చిన హామీమేరకు దాన్ని రద్దు చేస్తామని పునరుద్ఘాటించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఏ సంస్కరణలు తీసుకువచ్చినా బాధ్యతయుతంగా అమలు చేస్తామన్నారు. ధరణి రికార్డుల ప్రక్షాళనపై గ్రామ గ్రామాన తిరిగి హక్కుదారుల ఇబ్బందులను తెలుసుకున్నట్టు తెలిపారు. రెవెన్యూ నిపుణుల సలహాలమేరకే భూ డిక్లరేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక టైటిల్ గ్యారంటీ తీసుకొస్తామన్నారు.

స్వతంత్ర విచారణ జరిపించాలి

- **న్యాయం జరిగేలా చూడాలి**
- **బంగ్లాదేశ్‌లో కార్మిక నాయకుడి హత్యపై మానవ హక్కుల సంఘం డిమాండ్**

ఢిల్లీ: బంగ్లాదేశ్‌లో యూనియన్ నాయకుడు షాహిదుల్ ఇస్లాం దారుణ హత్య తీవ్ర ఆందోళనలకు దారి తీస్తున్నది. హత్యకు నిరసనగా వందలాది మంది గార్మెంట్ కార్మికులు బంగ్లాదేశ్ రాజధాని ఢాకా వీధుల్లోకి వచ్చారు. గతనెల 25న బంగ్లాదేశ్ గార్మెంట్ మరియు ఇండస్ట్రియల్ వర్కర్స్ ఫెడరేషన్ గాజీపూర్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఇస్లాం, కార్మికులకు చెల్లించని వేతనాలను పొందేందుకు గాజీపూర్‌లోని ఒక ఫ్యాక్టరీని సందర్శించారు. ఆ సమయంలో ఆయనను కొట్టి చంపిన ఘటన చోటు చేసుకున్నది. షాహిదుల్ ఇస్లాం హత్యకు వ్యతిరేకంగానే అక్కడి కార్మికులు, మానవ హక్కుల కార్యకర్తలు తమ ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ హత్యపై స్వతంత్ర, పారదర్శక దర్యాప్తు జరపాలని మానవ హక్కుల కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. న్యాయం జరిగేలా చూడాలని బంగ్లాదేశ్ అధికారులను కోరారు.హ్యూమన్ రైట్స్ వాచ్‌లోని సీనియర్ న్యాయవాది క్లాడియో ఫ్రాంకావిల్లా ఒక ప్రకటనలో "షాహిదుల్ ఇస్లాం మరణానికి న్యాయం, నష్టపరిహారం అందించడం ప్రపంచం చూస్తున్నందున బంగ్లాదేశ్‌కు భారీ పరీక్ష అవుతుంది. కార్మిక నాయకుడి హత్య కార్మికుల స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది" అని వివరించారు.

హ్యూమన్ రైట్స్ వాచ్‌కు అందిన సమాచారం ప్రకారం.. షాహిదుల్ ఇస్లాం జూన్ 25న ప్రిన్స్ జాక్వర్డ్ స్వెటర్ లిమిటెడ్‌కి వెళ్లి రెండు నెలలపాటు చెల్లించని వేతనాలు, ఈద్ సెలవుదినం కోసం బోనస్ డిమాండ్ చేశాడు. కర్మాగారం వెలుపల అతనితో పాటు మరో ముగ్గురిపై ఒక ముఠా దాడి చేసింది. వేతనాలు డిమాండ్ చేసినందుకు అతనిని దారుణంగా కొట్టారు. దుర్భాషలాడారు.

హేతుబద్ధ వైఖరితో చైనాతో కలిసి పని చేయండి

- **చైనా అభివృద్ధి నుండి ప్రయోజనాలు పొందండి**
- **అమెరికా ఆర్థిక మంత్రితో చైనా ప్రధాని భేటీ**

బీజింగ్ : హేతుబద్ధమైన, ఆచరణాత్మకమైన వైఖరి పాటిస్తూ, చైనాతో కలిసి పని చేయాల్సిందిగా చైనా ప్రధాని లీ కియాంగ్ అమెరికాను కోరారు. గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో శుక్రవారం అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ యెలెన్‌తో భేటీ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాధ్యమైనంత త్వరలో చైనా, అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సరైన దిశగా పట్టాలకెక్కేలా చూడాలని అన్నారు. చైనా-అమెరికా సంబంధాల్లో "వర్షాలు, గాలులు" తర్వాత 'హరివిల్లులు' విరుస్తాయని లీ వ్యాఖ్యానించారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం యెలెన్ బీజింగ్‌లో పర్యటిస్తున్నారు. ద్వైపాక్షిక సంబంధాల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా నాయకత్వంతో సంబంధాలను పెంచుకునేందుకు ఈ పర్యటన ఉద్దేశించబడిందని యెలెన్ తెలిపారు. చైనాతో ఆరోగ్యకరమైన ఆర్థిక పోటీని అమెరికా కోరుకుంటోందని చెప్పారు. మరింత సమాచార మార్పిడి జరగాలని యెలెన్ కోరారు. ఇదిలా వుండగా, గుత్తాధిపత్యాన్ని, బెదిరింపులను చైనా సహించబోదని లీ కియాంగ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. చైనా అభివృద్ధి అనేది అమెరికాకు సవాలు కన్నా ఒక అవకాశం వంటిదని లీ పేర్కొన్నారు. దీన్ని ముప్పుగా చూడడం కన్నా దీన్నుండి లాభాలు పొందడానికి చూడాలని కోరారు. ఆర్థిక సహకారాన్ని రాజకీయం చేయడం ఇరు దేశాలకు, యావత్ ప్రపంచానికి కూడా మంచిది కాదని అన్నారు. ఇరు పక్షాలు కమ్యూనికేషన్‌న పెంచుకోవాలని అన్నారు. ద్వైపాక్షిక ఆర్థిక రంగంలో కీలకమైన అంశాలపై కూలంకష, ఆచరణాత్మక చర్చలు, పరస్పర అభిప్రాయాల మార్పిడి ద్వారా ఏకాభిప్రాయాన్ని సాధించాలన్నారు. తద్వారా చైనా, అమెరికా సంబంధాల్లో సుస్థిరతను, సానుకూల శక్తిని చొప్పించాలని లీ కోరారు.

జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు

- **అమర్‌నాథ్ యాత్ర నిలిపివేత**

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాల కారణంగా వరసగా రెండో రోజునా అమర్‌నాథ్ యాత్రను నిలిపివేశారు. జమ్ము- శ్రీనగర్ హైవేపై కొండ చరియలు విరిగిపడ్డంతో పహల్గాం, బల్తాల్ రెండు మార్గాల్లోనూ శనివారం యాత్రను నిలిపివేశారు. దారి మధ్యలో చిక్కుకునిపోయిన యాత్రికులను భారత సైన్యం సురక్షిత ప్రాంతాలకు తరలించింది. బరారీ మార్గ్ క్యాంపులో 253 మంది యాత్రీకులు, చందన్‌వారీ క్యాంపులో 126 మంది యాత్రికులను సురక్షితంగా ఉంచినట్లు ఆర్మీ ప్రతినిధి ఒకరు తెలిపారు. యాత్రీకులకు అవసరమైన సహాయాన్ని భారత సైన్యం అందిస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలకు తోడు, ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పడిపోయినట్లు చెప్పారు. ముందు రోజు శుక్రవారం కూడా యాత్రను నిలిపివేయడంతో మొత్తంగా వేలాది మంది యాత్రీకులు వివిధ ప్రదేశాల్లో చిక్కుకునిపోయినట్లు సమాచారం. ఇందులో వందలామంది తెలుగు రాష్ట్రాల నుంచి యాత్రీకులు కూడా ఉన్నారు. నువ్వాన్ బేస్, భగవతి నగర్ బేస్ క్యాంపు, పంచతర్ణి క్యాంపుల్లో వందలాది మంది నిలిచిపోయారు. కేవలం పంచతర్ణి క్యాంపులోనే దాదాపు 1500 మంది వరకూ యాత్రీకులు ఉన్నారు. మరోవైపు, జమ్ము నుంచి కాశ్మీర్ లోయకు వెళ్లేందుకు కొత్త యాత్రీకులనెవ్వర్నీ అధికారులు అనుమతించలేదు. దీంతో చందర్‌కోట్ ప్రాంతంలోని రాంబన్ యాత్రి నివాస్ క్యాంపు వద్ద సుమారు 4,600 మంది యాత్రీకులు చిక్కుకుని పోయారు. అలాగే, కొండచరియలు విరిగిపడ్డంతో శ్రీనగర్-జమ్ము జాతీయ రహదారిని కూడా అధికారులు మూసివేశారు. దీంతో హైవేపై దాదాపు 600 వాహనాలు నిలిచిపోయాయి. జమ్ముకాశ్మీర్‌లో గత మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ భారీ వర్షాలకు వరదలతో పాటు కొండచరియలు కూడా విరిగిపడుతున్నాయి. ఈ ఏడాదిలో ఈ నెల 1న అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమయింది. ఇప్పటి వరకూ 82 వేల మంది అమర్‌నాథ్‌ను సందర్శించుకున్నారు. ఆగస్టు 31 వరకూ ఈ యాత్ర కొనసాగనుంది.



"నచ్చడం" లేదు...

నేను ఎందుకో
నాతో "నేను" మాట్లాడుతుంటే
నచ్చడం లేదు....

మనసులో పొర్లే
"మాట"కు అర్థం నచ్చలేదు...

ఓడిపోతున్న
"నిజం"గొంతుక నచ్చలేదు

ఒరిగిపోతున్న
"నిజాయితీ" బలహీనత నచ్చలేదు

ఊపిరాడని
"ఊహ"ల మౌనం నచ్చలేదు

అలివికాని
"ఆలోచన"లిల లోతు నచ్చలేదు

పిచ్చిగా
"పంచుకునే" ప్రేమ నచ్చలేదు

మనసును భయపెట్టే
"దూరం" నచ్చలేదు

మాటకు విలువలేని
"దగ్గర" నచ్చలేదు..

జవాబు దొరకని
"ప్రశ్న"లా బతుకు నచ్చలేదు

కలలు కన్న కోరికలే
"శత్రువు"లుగా మారడం నచ్చలేదు

చివరిగా
నీలో నీవు చూపిన
"నేను" అసలు నచ్చడం లేదు.

- చందలూరి నారాయణరావు
9704437247

మస్త్ మస్త్ కిక్ ఇచ్చే మస్తీ గోలీ సోడా

మార్కెట్లోకి ఎన్ని కూల్ డ్రింక్స్ వచ్చినా గోలీసోడా తాగితే వచ్చే కిక్కే వేరు.. మేడిన్ లోకల్ బ్రాండ్ అయిన గోలీసోడాలకు మంచి డిమాండ్ ఉండేది. కడుపు ఉబ్బరంగా ఉన్నట్లు.. పొట్టషేర్లు పట్టేసినట్లు.. అన్నం అరగనట్టు.. తేన్పు రాలేనట్టు.. ఇలా ఏ ఫీలింగ్ అనిపించినా ఒక్క గోలీ సోడా తాగితే వీటన్నంటికీ సమాధానం చెప్పేది! ఇప్పుడా గోలీ సోడా ఖాళీ అయ్యింది. వేసవికాలం వచ్చిందంటే చాలు తోపుడు బండ్లలో పెట్టి గల్లీగల్లీ తిరుగుతూ సోడాలు అమ్మేవారు. చిన్నాపెద్దా అనే తేడాలేకుండా సోడాలు తాగి వేసవి తాపాన్ని తగ్గించుకున్నాం అంటూ సేదతీరేవారు. జాతర్లు, వేడుకల్లో అయితే వీటికి ఫుల్ డిమాండ్ ఉండేది. తెలుగు సినిమాల్లోనూ గోలీసోడాల మీద డైలాగ్‌లు, ఫైట్లు పుష్కలం. అలాగే ఒంటిచేత్తో సోడా కొట్టడాన్ని చాలెంజింగ్‌గా తీసుకుని యూత్ పోటీపడేవారు. అప్పట్లో ఇవి అంత ఫేమస్ మరీ. కానీ, ప్రస్తుతం కార్పొరేట్ కూల్ డ్రింక్స్ ముందు గల్లీ గోలీసోడా చినబోయింది. అడపాదడపా ఎక్కడో ఒకచోట మాత్రమే ఈ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. రోజుకో రకం సోడా మెషీన్లు అందుబాటులోకి రావడంతో గోలీ సోడాలు కనుమరుగయ్యాయి. కానీ, అదే సోడా కొత్తదనంతో పునర్దర్శమిచ్చింది! దాహం తీర్చు కునేందుకు కొన్ని పట్టణాల్లో స్థానికంగా దొరికే వివిధ ఫ్లేవర్ల గోలీ సోడా యువతకు క్రేజీగా మారింది. దీన్ని గమనించే కరీంనగర్ కుర్రాడు తుల రఘునాథ్ గోలీ సోడా తయారుచేస్తూ తెలంగాణ వ్యాప్తంగా తనదైనా ప్రత్యేకత చాటుకుంటున్నాడు. ఎంతో మంది స్థానికులకు ఉపాధి మార్గమైనాడు.





కరీంనగర్లోని ఆరెపల్లి గ్రామానికి చెందిన కార్పొరేటర్ తుల రాజేశ్వరి, బాలయ్య కుమారుడు తుల రఘునాథ్ ఎంబీఏ పూర్తి చేసి మార్కెటింగ్ లో రాణించాలనుకున్నాడు. కానీ ఒక సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం రావడంతో కొద్దినెలల పాటు ఉద్యోగం చేశాడు. అక్కడ ఒక్కరి కనుసన్నల్లో పని చేయడం కష్టంగా అనిపించింది. ఆ జాబ్ వర్క్ లో భాగంగానే



ఒకసారి కోయంబత్తూరు వెళ్లినప్పుడు దాహంగా ఉందని రోడ్డు పక్కన దుకాణానికి వెళ్లి సోడా తాగాడు. ఆ గోలీ సోడా అతడిని ఆకర్షించింది. ఆ క్షణమే గోలీ సోడా ఫ్యాక్టరీని స్థాపించాలనే ఆలోచన వచ్చింది. తిరిగి రాగానే సోడా తయారీకి సంబంధించిన అన్ని విషయాలను ఆసక్తిగా తెలుసుకోవడం ప్రారంభించాడు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే తన దృష్టంతా సోడా తయారీపైనే పెట్టాడు. ఒక అవగాహనకు వచ్చిన తర్వాత మొదట చేసిన పని ఏమిటంటే... ఉద్యోగానికి రాజీనామా చేయడం. అంతకంటే ముందు తల్లిదండ్రులతో చర్చించాడు. వాళ్ల కుమారుడికి సపోర్టు చేశారు.

ఉద్యోగం వదిలేసి.. ఉపాధి కల్పిస్తూ..

నెలకు రూ.70 వేల శాలరీ వచ్చే సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఉద్యోగం మానేశాడు. ఫ్యాక్టరీ పెట్టాలని నిశ్చయించుకున్నాడు. కానీ, బంధువులు,మిత్రులు సహజంగానే 'రిస్క్ చేయడం.



అవసరమా?' అనే అన్నారు. కానీ తల్లిదండ్రులను ఒప్పించి, కరీంనగర్ కు మకాం మార్చాడు. 3.5 కోట్ల రూపాయలతో రేకుర్తిలోని 16 గుంటలు స్థలంలో 'మస్తీ' అనే పేరుతో గోలీ సోడా ఫ్యాక్టరీని డిసెంబర్ 2020లో ప్రారంభించాడు. 'మస్తే సోడా' పేరుతో నాలుగు రకాల ఫ్లేవర్స్ తో గోలీ సోడాను మార్కెట్లోకి ప్రవేశపెట్టాడు.

సొంతగా మార్కెటింగ్....

ఎంబీఏ చదివిన అనుభవంతో రఘునాథ్ కరీంనగర్ జిల్లాలో తనదైన శైలిలో మార్కెటింగ్ చేశాడు. దాంతో మస్తీ గోలీసోడా ప్రజలకు చేరువైంది. లెమన్, ఆరెంజ్, జింజర్, బ్లూబెర్రీ, ఫ్లేవర్స తో 200 మిల్లీలీటర్ల గ్లాస్ బాటిల్స్, 250 మిల్లీలీటర్ల ప్లాస్టిక్ బాటిల్స్ తయారు చేస్తున్న మస్తీ గోలీ సోడాకు మార్కెట్లో మంచి ఆదరణ లభించింది. ఒక్కో సోడా బాటిల్ ను 20 రూపాయలకు విక్రయిస్తున్నారు. మస్తీ గోలీ సోడాను ఫ్యాక్టరీలో తయారు చేసి కిరాణా దుకాణాలు, బేకరీలు, టీస్టాల్స్, హెూటల్స్ వంటి చిన్న చిన్న దుకాణాలకు సైతం చేరవేశారు. ఈ సోడాలు నాణ్యతతో, వివిధ ఫ్లేవర్లతో కూల్డ్రింకులకు. పోటీగా నిలిచి యువత మనసు గెలుచుకుంటున్నాయి. దాంతో ఈ ఏడాది డిమాండ్ బాగా పెరిగింది. మస్తీ గోలీ సోడా గురించి చుట్టు పక్కల జిల్లాలకు కూడా తెలిసింది. దాంతో మార్కెట్ విస్తరించాడు రఘునాథ్. పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాలతోపాటు ఉమ్మడి వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు కూడా సరఫరా చేస్తున్నాడు. ప్రతిరోజు ఐదు వేలకు పైగా మస్తీ సోడాలు తయారుచేసి విక్రయిస్తున్నారంటే వీటికున్న క్రేజ్ ను అర్థం చేసుకోవచ్చు.

రంగు రంగుల సోడాలు..

గోలీసోడా ఒక్కటే అయినా.. అందులో ఉండే ఫ్లేవర్లు అనేకంగా ఉండేవి. రకరకాల రంగుల్లో, రుచుల్లో లభించేవి. పిల్లలైతే స్వీట్ సోడా, ఆరెంజ్ ఫ్లేవర్స్ బాగా ఇష్టపడేవారు. ఇక పెద్దలు ఎక్కువగా మసాలా సోడకు మొగ్గుచూపేవారు. కాస్త ఆయాసంగా ఉన్నా.. అరుగుదల లేదని అనిపించినా లెమన్ సోడా ఎక్కడుందా అని వెతుక్కునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఈ సోడాల్లో కూడా చాలా రకాల ఫ్లేవర్స్ అందుబాటులోకి వచ్చాయి. ప్లెయిన్ సోడా, ఆరెంజ్ సోడా, గ్రేప్స్ సోడా, కలర్ సోడా, లెమన్, లెమన్ స్వీట్, మసాలా, మసాలా సాల్ట్, సుగంధీ సోడా, స్ట్రా బెర్రీ, అంజీర్, ఫ్రూట్ సోడా అంటూ ఎన్నో ఫ్లేవర్స్ మార్కెట్లో అందుబాటులోకి వచ్చేశాయి.

గోలీసోడా ప్రత్యేకమే..

గోలీసోడా అంటేనే అదో స్పెషల్. చిన్నపాటి సీసాలో సోడాను నింపి అందులోని గ్యాస్ బయటకు లీక్ అవకుండా చిన్నపిల్లలు ఆడుకునే గోలీని అడ్డంగా ఉండేలా ఏర్పాటు చేస్తారు. అందులో నీరు, గ్యాస్ నింపగానే అది రంధ్రానికి అడ్డుగా వచ్చి ఆగుతుంది. దాంతో సోడా బయటకు వెల్లదు. వేలితో ఆగోలీని అడ్డుతొలగిస్తే ఒకరకమైన శబ్దంతో కొద్దిపాటి గ్యాస్ బయటకు వచ్చి తాగేందుకు వీలు ఏర్పడుతుంది. దాన్ని కూడా ఎంత త్వరగా తాగితే అంత బాగుంటుందని చెబుతారు గోలీసోడా ప్రియులు.

- జోష్ టీం

ఉద్యోగానికి రాజీనామా చేసి ఇక్కడ ఫ్యాక్టరీ నెలకొల్పడంతో స్థానికులకు ఉపాధి లభిస్తోంది. మస్తీ గోలి సోడాను నాణ్యతా ప్రమాణాలతో రుచి, శుచిగా తయారు చేస్తున్నాను. ప్రస్తుతం సాఫ్ట్ వేర్ ఉద్యోగం కంటే ఎక్కువగానే ఆదాయం వస్తోంది. రానున్న కాలంలో మరిన్ని ఫ్లేవర్స్ తో మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తా. ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాల కోసం కృషి చేయడం తప్పుకాదు. కానీ ఉద్యోగాలు రాని వారు నిరాశకు లోనుకాకుండా మనకు నచ్చిన వాటిలో స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలి. కొత్తరకం ఆలోచనలకు చిత్తశుద్ధిని జోడిస్తే తప్పకుండా విజయం దక్కుతుంది. రానున్న కాలంలో తన గోలీ 'సోడాను మరిన్ని జిల్లాలకు, వీలైతే రాష్ట్రాలకు ఎగుమతి చేయాలనే ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- తుల రఘునాథ్





వర్షపు చినుకై తాకి పో ??

కాశ్మీరు అందాలన్నీ కండ్లల్లో పెట్టుకొని
సీమ్లా సొగసులన్నీ చెక్కిల్ల పై అద్దుకొని
నయాగార వంపులన్నీ నడుములో ఒంపుకొని
కొప్పులో సన్నజాజి మల్లెలను తురుముకొని
నల్లని త్రాసు లాంటి పొడవైన వాల్జడతో
పట్టు పరికిణిలో ఏంజెల్ లా ఎదురొచ్చి
నా మనసునంతా పొక్కిలి చేసింది

తన చురుకైన చూపులను విసిరేసి
నా కాళ్ళను కదలకుండా ఖైదీలను చేసింది
తన పలచని చిరనవ్వులను నా వైపు రువ్వి
నా కనురెప్పలకు సంకెళ్ళను వేసింది
మా రెండు పెదవులు కదలకుండానే
మనసులు రెండు మౌనంగా మాట్లాడుకున్నాయి
చూపులు రెండు కలిసిపోయిఊసులాడుకున్నాయి

కాలమెంత కఠినమైనదో కనికరం లేకుండా
మధుర క్షణాలకు ఇనుప తెర వేసింది
నిండు జాబిలికి మబ్బులడ్డం వచ్చినట్లు
మా ఇద్దరి మధ్య జన కడలి అడ్డొచ్చి
కవ్వించిన నెరజాణ కనుమరుగైంది
కలల పుప్పొడిని వెదజల్లిన కన్యకోసం
అవనిపై నేను బొంగరంలా తిరుగుతున్నాను

మనసు గది తలుపులను తెరుచుకొని స్వప్నాల
కుసుమాలను పరుచుకున్నాను
ఆశల అగరవత్తులను వెలిగించుకొని
ఊహల వంతెన పై నడుస్తున్నాను
మదినిండా ఉప్పెనలా ఉప్పొంగిన భావాలను
కమ్మనైన కవితలుగా రాస్తున్నాను
అందమైన గుర్తులను నెమరేసుకుంటూ
అద్భుతమైన ప్రేమ కావ్యాన్ని లిఖిస్తున్నాను

నైరాష్యపు ఉక్కపోతలో నేనుంటే
చిరు గాలిలా వచ్చి పలకరించు
ఊపిరాడని బతుకులో నేనుంటే
ప్రాణవాయువు లా వచ్చి శ్వాసించు
ఎండిన ఎడారి లా నేనుంటే
నువ్వు వర్షపు చినుకై తాకిపో

- తాటిపాముల రమేశ్ (తార)
శివనగర్, వరంగల్
7981566031

ప్రేమ పల్లకి

నేను ఎక్కడ ఉన్నా
నీ తలంపుతోనే ఉన్నా
నా మదిలో నిన్ను ప్రతిష్ఠించు కున్నా
నా రాగానికి, నా తాళానికి



నాట్య మయూరివి నీవే
నీ అందియల చప్పుడు
నా గానానికి హరమై
నాకు ప్రేమ దేవతవై
అను క్షణం నిను తలుస్తూ
నీ పాదాలు కంది పోకుండా
ప్రేమ పల్లకి లో నిను ఊరేగిస్తూ
నేను బోయనై పల్లకి మోస్తూ
నీ జ్ఞాపకాలు నెమరేసుకుంటూ
నా ఊహల లోకంలో
నా కలల ప్రపంచంలో
తేలి పోతూ ఉన్నా
నా ప్రియురాలి దర్పాన్ని చూస్తూ
ప్రేమ పల్లకిని మోస్తూ

- కనుమ ఎల్లారెడ్డి
93915 23027

మధురానుభూతి


మేఘాల తాకిడికి మధురమైన మెరుపు వచ్చినట్టు
మరుపేరాని నా మనసుకి ఊహల అలజడి తాకింది
ఆ అలజడి రేగిన అందాల తపస్వి ఈ అపురూప బొమ్మ
అపురూప కోవెలలో వెలసిన చక్కనమ్మ
చిలిపి నవ్వుల దమయంతి
చిరునవ్వుల కల్పవల్లి
యువరాణి యశస్సు
రాజ్యమేలే మేధస్సు
ఈ చిరు కోకిల దారి మరచిపోయిందేమో
నా ఊహల రహదారిలో పయనం చేస్తుంది
నా గుండె గదిని తన అందాలతో అలంకరించింది
కోమలమైన తన హస్తాలతో నా మనసుని తాకి
నా కనుల కునుకు చెరిపేసింది
స్వర్గలోక స్వప్న సుందరా తను



లేదా కోనసీమ కోయిలమ్మనా
మదు మధుర ఆమె గొంతు తేనెల విందు
తన్మయపరిచే తన అందాలు బందావన
మందిరాలు
ఆకాశమంత పల్లకిలో ఆమెను ఊరేగించి
నా ప్రేమ రాజ్యానికి రాణిగా ప్రకటిస్తాను...

- పోలగాని భానుతేజశ్రీ

మనసులోని భావాలు



ప్రియమైన మాధవికి,

నీ వాట్సాప్ మెసేజ్ చూసి కొంచం ఆశ్చర్య పోయాను. "చిన్న చిన్న మెసేజ్‌లతో విసిగిపోయాను. కొంచం ఎక్కువ విషయాలతో ఉత్తరం రాయండి" అన్నావు. ఈ రోజుల్లో ఇంకా ఉత్తరాలు రాసేవాళ్ళు ఉన్నారంటే ఆశ్చర్యమే. డెలివరీ అయ్యేదాకా మనకి ఇంకా అయిదారు నెలలు విరహం తప్పదు కనుక ఉత్తరాలు మంచి ఆలోచనే కదా! ఈ స్మార్ట్ ఫోన్ కల్చర్ వచ్చిన తరువాత, మనసులోని భావాలు వివరంగా చెప్పుకునే అవకాశం మిస్ అవుతున్నామేమో! ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగానే ఉంటుంది. నీతో పరిచయానికి ముందు, దూరంగా ఉండడం వల్ల, అమ్మ, నాన్న అప్పుడప్పుడు గుర్తుకు వచ్చి, వాళ్ళ మీదికి ఆలోచనలు పోయేవి. కానీ, నీతో పరిచయం ప్రారంభమయ్యాక, ప్రతి క్షణం నీ ఆలోచనలే. ఒక వ్యక్తి సహచర్యంలో ఇంత మాధుర్యం ఉంటుందని నాకు ఇప్పటి వరకు తెలియదు. ప్రేమికులు అందరూ రుణపడి ఉండాలేమో. ఏ పని చేస్తున్నా, ఇప్పుడు నువ్వు ఏం చేస్తూ ఉంటావన్న ఆలోచనే.. మనిషి ఎదురుగా ఉన్నా చెప్పలేని కొన్ని భావాలు ఉత్తరాల ద్వారానే సాధ్యం అవుతుందేమో కదా? నువ్వు ఎదురుగా ఉన్నప్పుడు చెప్పని విషయాలు ఇప్పుడు చెప్పాలనిపిస్తోంది. నువ్వు ఎదురుగా ఉంటే చేతలే కానీ మాటలు కష్టం కదా? పెద్ద ఉత్తరం రాయమన్నావు కాబట్టి, ఎప్పటినుంచో నీకు చెబుదామనుకున్న అనేక విషయాలు ఇప్పుడు చెబుతాను. మన పెళ్లి అయిన తరువాత, మనం మొదటిసారి కలవడం గురించి మాట్లాడుకున్నాం. గుర్తు ఉందా ? అప్పుడు చెప్పలేని ఎన్నో విషయాలు ఇప్పుడు చెబుతాను. నేను మీ కాలేజీకి గెస్ట్ లెక్చరర్ ఇవ్వడానికి వచ్చినపుడే నువ్వు నన్ను మొదటిసారి చూశావు. కానీ నేను నిన్ను అంతకు ముందే చూశాను. యూనివర్సిటీలో నా కొలీగ్ నారాయణ, నేను, ఒకసారి మీ కాలేజ్ ఇంగ్లీష్ లెక్చరర్ మధుసూదన్‌ను కలవడానికి మీ స్టాఫ్ రూమ్ కి వచ్చాం. మేము అతనితో మాట్లాడుతూ ఉండగా నువ్వూ, నీ క్లాస్‌మేట్ జలజ మధుసూదన్‌ని కలవడానికి వచ్చారు. ఆమె చాలా అందంగా ఉందన్న విషయం గుర్తించినా, నాకు వెంటనే చిరాకు కలిగింది. ఆమె తన అందాన్ని అందరూ చూస్తున్నారా లేదా అనే భావన, బాడీ లాంగ్వేజ్‌లోనూ, చూపులలోనూ స్పష్ట పరచడం నాకు నచ్చలేదు. దీంతో నా చూపు పక్కన ఉన్న నీపై పడింది. ఎర్రటి గులాబీ పక్కన, బుట్ట సంపెంగ సువాసనలా అనిపించావు. బెదురు చూపులు చూస్తున్న నువ్వూ, నీ సహజమైన ముగ్ధత్వం నన్ను వెంటనే ఆకట్టుకున్నాయి. ఆ వేళ నువ్వు లేత ఆకుపచ్చ రంగు వోణీ వేసుకున్నావు. చిన్న గులాబీ, జడలో ఓ పక్కన పెట్టుకున్నావు. జలజ మధుసూదన్‌తో ఏదో మాట్లాడిన తర్వాత మీరు ఇద్దరూ వెళ్లిపోయారు. మరి కొన్ని విషయాలు మరో ఉత్తరంలో రాస్తాను. అన్ని విషయాలు ఇప్పుడే చెప్పేస్తే ఎలా? అందుకే మరి కొన్ని ముచ్చట్లతో మరో లేఖతో కలుస్తా.. నీ ఆరోగ్యం జాగ్రత్త.

నా మాధవికి బోలేదు ముద్దులతో...

నీ
రాజశేఖర్